సాహితి గత వారంతో పూర్తి వివరాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
5-7-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 155 పేజీలు: 10+4 వెల: 8.00

నా వార్తలే చదువుతా: యుఎస్ అధ్యక్షుడు ట్రంప్
ఇరాన్‌లో ఖమేనీ అంతిమయాత్ర ఆరంభం
5



## రేపటి నుంచి ప్రధాని మూడు దేశాల పర్యటన
3

ఆస్ట్రేలియా వస్తే చంపేస్తామంటూ బెదిరింపులు: నిఘా సంస్థల వెల్లడి



## 23 మందిని ఉగ్రవాదులుగా ప్రకటించిన కేంద్రం
5

వారిలో 17 మంది పాకిస్థానీయులు, ఆరుగురు భారతీయులు

# 2034 దాకా తెలంగాణలో ప్రజాపాలనే



బిఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్తులేదు
పాపాల భైరవుడు ఫామ్‌హౌస్‌కే పరిమితం
కెసిఆర్ కుటుంబం లక్షకోట్లు ఎలా సంపాదించిందో చెప్పాలి
మిడ్జిల్ ప్రజలకు నా ప్రాణాలు ఇచ్చినా తక్కువే
కృతజ్ఞత సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

శనివారం మిడ్జిల్ సభలో అభివాదం చేస్తున్న సిఎం రేవంత్

**మహబూబ్ నగర్ బ్యూరో, జులై 4, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ ఇక గతమేనని భవిష్యత్తు లేదని.. 2034 వరకు ప్రజా పాలన ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. నాగర్ కర్నూలు జిల్లా ఊరుకొండ పేట ఆలయంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు కార్పొరేషన్ చైర్మన్‌లతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, రూ. 10కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్ లో ఏర్పాటుచేసిన రాజకీయ కృతజ్ఞత సభలో ఆయన ప్రసంగించారు. కెసిఆర్ ఫామ్‌హౌస్‌లోనే కుంగి కృశించి పోవాలని, వారికి అధికారం కలలో మాటేనని రేవంత్ రెడ్డి అన్నారు. అరుంధతి సినిమాలో పశుపతిని బంధించినట్లు తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను ఫామ్ హౌస్‌లో బంధించాలని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకిరాని కేసీఆర్ మళ్లీ అధికారంలోకి ఎందుకు రావాలో ప్రజలే చెప్పాలన్నారు. రేషన్ కార్డులు ఇచ్చి కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్నబియ్యం ఇచ్చి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అందజేసి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ >>2

జోద్‌పూర్‌లో శనివారం విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ. చిత్రంలో కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, షెకావత్, రాజస్థాన్ సిఎం భజన్‌లాల్ తదితరులు

## 'ఉడాన్' పథకానికి 28,840 కోట్లు

కొత్తగా 100 ఏరోడ్రోములు.. 200 హెలిప్యాడ్‌ల అభివృద్ధి
-రాజస్థాన్‌లో ప్రధాని మోడీ

**జోద్‌పూర్,జులై 4:** రాజస్థాన్ అభివృద్ధికి కొత్త ప్రాజెక్టులు మరింత వేగాన్ని అందిస్తాయని ప్రధాని మోడీ పేర్కొన్నారు. శనివారం రాష్ట్రంలోని పచ్‌ప్రద ఆయిల్ రిఫైనరీతోపాటు జోద్ పూర్‌లో కొత్తగా సుమారు రూ.480 కోట్ల వ్యయంతో నిర్మించిన విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని ప్రధాని ప్రారంభించారు. 23వేల చదరపు మీటర్ల >>2

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**మహబూబ్ నగర్ బ్యూరో, జులై 4, ప్రభాతవార్త:** అంతకు ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రూ.47.08 కోట్లతో మిడ్జిల్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.10 కోట్లతో ఊరుకొండపేట శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన,రూ.20 కోట్లతో పాత మిడ్జిల్ మండలంలోని 40 గ్రామ పంచాయతీల అభివృద్ధికి శంకుస్థాపన, రూ.17,08,45000 వ్యయంతో మిడ్జిల్ మండలంలో చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతేకామిడ్జిల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధ్యాపా గోపాల్ రెడ్డి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. మాజీ పార్లమెంట్ సభ్యులు, ఢిల్లీ లో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు మధు సూదన్ రెడ్డి ,కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్, అచ్చంపేట >>2



## 20 నుంచి వర్షాకాల పార్లమెంటు

కీలక బిల్లుల ఆమోదం కోసం ఎన్డీయే కసరత్తు
ఆగస్టు 13 దాకా కొనసాగనున్న సమావేశాలు: కేంద్రమంత్రి రిజిజు

**న్యూఢిల్లీ,జులై 4:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20 నుంచి ఆగస్టు 13 వరకు నిర్వహించనున్నారు. మొత్తం 25 రోజుల వ్యవధిలో 19 రోజులపాటు సభా కార్యకలాపాలు కొనసాగనున్నాయి. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్ర పతి ద్రౌపదీ ముర్ము పార్లమెంట్ ఉభయసభల సమావేశాలకు ఆమోదం తెలిపారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శనివారం ఆ విషయాన్ని వెల్లడించారు. వర్షాకాల సమావేశాల తేదీలను కిరణ్ రిజిజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు 2026 పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నిర్వహణకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారని ఈనెల20న ప్రారంభమయ్యే సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగుతాయని తెలిపారు. జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, >>2




## పార్టీ పేరు మార్చుకోండి

వెయ్యి అభ్యంతరాలు వచ్చాయన్న ఇసి
సాధ్యంకాదు, కోర్టుకు వెళ్తానన్న కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై4:** సొంత పార్టీ స్థాపనతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలనుకున్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం ఊహించని బిగ్ షాక్ ఇచ్చింది. తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పేరుతో పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఆమె చేసుకున్న దరఖాసు పై ఏకంగా వెయ్యికి పైగా >>2

## సింగరేణిలో సంస్కరణలకు ప్రత్యేక కమిటీ

కోల్ గ్యాసిఫికేషన్ వైపు సంస్థ అడుగులు
భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** దక్షిణ భారతదేశంలో ఇంధన భద్రతలో సింగరేణి కీలక పాత్ర పోషించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. రానున్న రోజుల్లో సింగరేణి తన సేవలను మరింత విస్తృత పరచాలని, ఇందుకు కొత్త గనులు సాధించి పెరుగుతున్న దేశ ఇంధన అవసరాలకు తోడ్పాటును అందించాలనిసూచించారు. హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో శనివారం ఆయన సంస్థ పనితీరు, భవిష్యత్ కార్యాచరణపై సమీక్షి ంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి బొగ్గు ఉత్పత్తి పెంచడం కోసం అవసరమైన కొత్త బ్లాక్‌లను బొగ్గు శాఖ నిర్వహించే వేలం పాటలో పాల్గొని సాధించాలన్నారు.దేశంలో విద్యుత్ అవసరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో రానున్న 10నుంచి 15 సంవత్సరాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. దేశ ఇంధన రంగంలో ఇంకా సుదీర్ఘకాలం బొగ్గు కీలక పాత్ర పోషించనున్నదని కనుక బొగ్గు ఉత్పత్తిని గణనీయంగా పెంచడంపై దృష్టి సారించాలని, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తూ, పని సామర్థ్యాన్ని మరింతగా పెంచే చర్యలు చేపట్టాలని తెలిపారు. నేటి పోటీ మార్కెట్ లో ప్రభుత్వ సంస్థలు నిలబడాలంటే నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవడంతో పాటు, ప్రతీ ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రధానంగా కంపెనీ అభివృద్ధికి, సంస్కరణల అమలుకు ఒక ప్రత్యేక కమిటీని నియమించుకోవాలన్నారు. సమష్టిగా సింగరేణి అభివృద్ధిలో పాలుపంచుకోవాలని. సంస్థ అభివృద్ధికి తాము పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే దేశంలో కోల్ >>2



శనివారం సమీక్షలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



శనివారం హైదరాబాద్‌లో నేషనల్ లీగల్ కాంక్లేవ్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

## బిజెపికి ఓట్లడిగే దమ్ము ఉందా?

మోడీ భ్రమలు వీడుతున్నాయి..
రాహుల్ స్ఫూర్తితో కులగణన
-పిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్

**హైదారబాద్,జూలై 4,ప్రభాతవార్త:** అభివృద్ధి పేరు చెప్పి బిజెపి నేతలకు ఓట్లు అడిగే దమ్ముందా రాముడి పేరు చెప్పి ఓట్లు దండుకొని మూడో సారి అధికారంలోకి వచ్చారని టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ లీగల్ కాంక్లేవ్ లో ఎఐసిసి మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబ, ఇండియన్ యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌భాను చిబ్, ఆల్ ఇండియా కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీ కృష్ణ అలవేరు, తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడీ శివ చరణ్‌రెడ్డి, గురుదీప్ సింగ్, రోషిని జైశ్వాల్, శ్రావణ్ రాజ్ పాల్గొనగా ముఖ్యఅథితిగా మహేష్‌గౌడ్ పాల్గొనిమాట్లాడినారు. బిజెపి పాలకులు రాజ్యాంగాన్నిమార్పుచేసి మనువాద రాజ్యాంగాన్నిఅమలు చేయాలనే >>2

## రంకెలు వేస్తే.. అంకెలు మారుతాయా?

కాంగ్రెస్ చేసిన అప్పును కూడా బిఆర్ఎస్ ఖాతాలో చూపారు..
భట్టి మాటలన్నీ అసత్యాలే: హరీష్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై4:** ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అప్పుల విషయంలో అబద్దాలు,అర్థ సత్యాలు చెప్పిమసిబూసి మారేడు కాయ చేసే ప్రయత్నం చేసిందని, రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. లేని అప్పులను ఉన్నట్లుగా చూపి గోబెల్స్ ప్రచారానికి పాల్పడ్డారని, అప్పుల విషయంలో మంత్రి జూపల్లి సవాళ్లు చేసి తోక ముడిచిన తీరును యావత్ తెలంగాణ సమాజం చూసిందని, ఆ అవమానం నుంచి ఎలాగైనా బయటపడాలనే భావనతో, ఆత్మరక్షణలో భాగంగా భట్టి అప్పులపై తప్పుడు లెక్కలు వండి వార్చారని పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మేనిఫెస్టోలో మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదు?అప్పులు అప్పులు.. అంటూ ఎందుకు కుంటి సాకులు, సొల్లు పురాణం చెబుతున్నరు? కరోనా వచ్చినా ఎకానమీ డౌన్ అయినా కేసీఆర్ ఏనాడూ రాష్ట్రం దివాళా తీసింది అనలేదు. మరి ఇప్పుడు కరోనా లేదు, పెద్ద నోట్ల రద్దు లేదు, ముఖ్యమంత్రి ఎందుకు దివాళా దివాళా అని మాట్లాడుతున్నరు? అని ప్రశ్నించారు. భట్టి విక్రమార్క పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు 8,21,651 కోట్లు అని మళ్లా అదే కట్టుకథ చెప్పిండు అన్నారు. 02-06-2014 నాటికి అంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికే రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న ఎఫ్ఆర్‌బిఎం రుణాలు, ఎస్‌పివి గ్యారంటీ రుణాలు (గవర్నమెంట్ గ్యారంటీడ్) మొత్తం కలిపి రూ.84,268 కోట్లు బిఆర్ఎస్ ప్రభుత్వ ఖాతాలో చూపారు. 2023 >>2




శనివారం బిఆర్ఎస్ భవన్‌లో మీడియాతో హరీష్



స్టెరాయిడ్స్‌ను మీడియాకు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ డిసిపి గైక్వాడ్

## భారీగా స్టెరాయిడ్ ఇంజెక్షన్లు స్వాధీనం

జిమ్ నిర్వాహకుడు సహా ఆరుగురి అరెస్టు


**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** జింలకు వస్తున్న యువతీ యువకులకు కృత్రిమ కండల కోసం కృత్రిమ కండల కోసం స్టెరాయిడ్స్ ఇంజక్షన్లు అమ్ముతున్న ఆరుగురిని నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడ్డ వారిలో జిం నిర్వాహకుల తో పాటు మధ్యవర్తులు, >>2



## 667 ఎకరాల్లో భద్రాద్రి ఎయిర్‌పోర్టు!

సీతంపేట, సుజాతనగర్‌లే అనుకూల ప్రాంతాలుగా గుర్తింపు
కేంద్ర మంత్రి రాంమోహన్ నాయుడుకు నివేదిక పంపిన మంత్రి తుమ్మల

**కొత్తగూడెం, ప్రభాతవార్త:** దశాబ్దాలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులు ఎదురుచూస్తున్న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం కల సాకారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ఇప్పటికే ప్రతిపాదించిన స్థలాలు సాంకేతిక, ఆర్థిక కారణాలతో అనుకూలం కాదని తేలడంతో, జిల్లా యంత్రాంగం ద్వారా ప్రత్యామ్నాయ స్థలాలపై చేపట్టిన సమగ్ర సాధ్యాసాధ్యాల అధ్యయన నివేదికను వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేతజౌళి శాఖలమంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రపౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రాంమోహన్ నాయుడుకు అందజేశారు. ఈ మేరకు జులై 4నమంత్రి తుమ్మల లేఖ రాశారు.గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై గతంలో తాను పంపిన లేఖలను ప్రస్తావిస్తూ, తాజా పరిణామాలను ఇందులో వివరించారు. కొత్తగూడెం సమీపంలో గతంలో ప్రతిపాదించిన రెండు స్థలాల్లో ఒకటి సాంకేతికంగా, మరొకటి ఆర్థికంగా(భూసేకరణకు) అనుకూలం కాదని తేలడంతో ప్రాజెక్టు ముందుకు సాగలేదు. దీంతో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సూచన మేరకు జిల్లా యంత్రాంగం స్వతంత్ర సాంకేతిక సంస్థ ఖిరాజ్ టెక్నాలజీస్‌ఖను రంగంలోకి దించి, సాంకేతికంగా, ఆర్థికంగా అనుకూలమైన కొత్త స్థలాలను గుర్తించే బాధ్యతను అప్పగించింది. ఇటీవల ఢిల్లీలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర మంత్రిని కలిసినప్పుడు, కొత్త స్థల ప్రతిపాదనపై పది రోజుల్లో ఫీజిబిలిటీ నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ మేరకు నిర్దేశిత గడువులోగానే నివేదికను సిద్ధం చేసి కేంద్రానికి పంపడం గమనార్హం. రెండు స్థలాలు ఖరారుఏటీఆర్72600 తరహా విమానాలకు అనుగుణంగా విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో భూమి లభ్యత, భూతల స్వరూపం, రన్‌వే దిశ, ఎత్తు పరిమితి ఉపరితలాలు (అబ్‌స్టకల్ లిమిటేషన్ సర్ఫేసెస్), పర్యావరణ అంశాలు, రవాణా సౌకర్యాలను నిపుణుల బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ ప్రాథమిక సాధ్యాసాధ్యాల అధ్యయనంలో సీతంపేట, సుజాతనగర్ ప్రాంతాలు అవసరమైన కీలక >>2



## 13 జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్

భారీ వర్ష సూచన

**హైదరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** ఎల్ నినో ప్రభావంతో రుతుపవనాలు మందకొడిగా సాగిన కారణంగా జూన్ >>2



జోధ్‌పూర్‌లో శనివారం విమానాశ్రయ టెర్మినల్ భవన నమూనాను పరిశీలిస్తున్న ప్రధాని మోడీ. చిత్రంలో కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, షెకావత్ తదితరులు

## 28,840 కోట్లు

>> విస్తీర్ణంలో నిర్మించిన ఈ భవనం ద్వారా ఏడాదికి 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించవచ్చు. రాజస్థాన్ సంప్రదాయ కళాకృతులు, ఆధునిక సదుపాయాల మేళవింపుగా టెర్మినల్‌ను తీర్చిదిద్దారు. దీనివల్ల మార్వార్ ప్రాంతంలో పర్యటకం, వాణిజ్యం, ఉపాధికి కొత్త అవకాశాలు లభిస్తాయని ప్రధాని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రాంతీయ వాయు మార్గాల అనుసంధానాన్ని మరింత మెరుగుపరిచేందుకు సవరించిన ఉడాన్ పథకాన్ని కూడా ప్రధాని ప్రారంభించారు. రాబోయే పదేళ్ల కోసం ఈ పథకం కింద రూ.28,840 కోట్లను కేటాయించారు. కొత్తగా 100 ఎయిర్‌డ్రోమ్‌లు, 200 హెలిప్యాడ్‌లను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాజస్థాన్ ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికైన సుమారు 54 వేల మందికి నియామక పత్రాలు అందించినట్లు ప్రధాని తెలిపారు. వారికి అభినందనలు తెలియజేశారు. రాజస్థాన్ ప్రజలకు తాను రుణపడి ఉన్నానని పేర్కొన్న మోడీ ఆ రాష్ట్రంలోని ప్రతి అణువు స్వాభిమానం ప్రాధాన్యాన్ని నేర్పిందని చెప్పారు. స్వావలంబనతోనే స్వాభిమానాన్ని నిలబెట్టుకోవచ్చని, కొత్త ప్రాజెక్టులతో రాజస్థాన్‌తో పాటు దేశ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. పచ్‌పద్రలో ప్రారంభించిన గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీకమ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్ దేశ ఇంధన రంగంలో చారిత్రక మైలురాయి అని ప్రధాని అభివర్ణించారు.

రాజస్థాన్‌లో ఏర్పాటు చేసిన తొలి రిఫైనరీ కూడా ఇదేనని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రిఫైనరీకమ్‌పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లలో ఒకటిగా ఇది నిలుస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు పశ్చిమ రాజస్థాన్ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలను మార్చివేస్తుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంతో పాటు రాజస్థాన్ స్వావలంబన సాధించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వాలు కేవలం శంకుస్థాపనలకే పరిమితమయ్యేవని ప్రధాని విమర్శించారు. శిలాఫలకాలు వేసిన తర్వాత ప్రాజెక్టులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచేవారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వాల పనితీరు అందుకు పూర్తి భిన్నంగా ఉంటుందని చెప్పారు. ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతో బాధ్యత ముగిసిందని భావించకుండా వాటిని సకాలంలో పూర్తి చేసేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తామని తెలిపారు. ఇటీవల రిఫైనరీ ప్రాజెక్టు ప్రాంతంలో జరిగిన ప్రమాదాన్ని ప్రస్తావించిన ప్రధాని, ఆ తర్వాత మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసిన కార్మికులు, అధికారులను అభినందించారు. ఎంత పెద్ద సవాలు ఎదురైనా నవభారత్ తన సంకల్పం నుంచి వెనక్కి తగ్గదని వారు నిరూపించారని ప్రశంసించారు. పచ్‌పద్ర కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.1.06 లక్షల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. పెట్రోకెమికల్స్, పట్టణ రవాణా, రైల్వేలు, జాతీయ రహదారులు, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ పంపిణీ తదితర రంగాలకు ఈ ప్రాజెక్టులు సంబంధించినవి. వీటిలో రూ.13 వేల కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న జైపూర్ మెట్రో రైలు ప్రాజెక్టు ఫేజ్2 కీలకంగా ఉంది. ఈ ప్రాజెక్టుకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు.

## ఇంజెక్షన్లు స్వాధీనం

>> ఇక్కడ కు వచ్చే వారు కూడా వున్నారు. వీరి వద్ద నుంచి 440 డోస్‌ల స్టెరాయిడ్స్ ఇంజక్షన్లు జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్ ఫోర్స్ డిసిపి వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ శనివారం మీడియాకు వెల్లడించారు. నగరంలోని జింలలో శిక్షణ కోసం వచ్చే వారికి కొందరు నిర్వాహ కులు కృత్రిమంగా కండలు వచ్చేందుకు స్టెరాయిడ్స్ ఇంజక్షన్లు అమ్ముతున్నట్లు అందిన సమాచారంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా వుంచారు. ఈ సందర్భంగా గతంలో జిం యజమానిగా వుండి ప్రస్తుతం ఆన్‌లైన్ ట్రైనర్లుగా వున్న ముషీరాబాద్ వాసులు బట్టి శివ (32), మహమ్మద్ పు ర్ఖానుద్దీన్ ఫైసల్ (28) పాత్ర వెలుగు చూసింది. వైద్యుల సూచనల మేరకు ఆసుపత్రుల్లో తీవ్రమైన జబ్బులు కలిగిన వారు వాడాల్సిన వీటిని వీరిద్దరు తమ ఇష్టానుసారం జింలకు వచ్చే యువతీ యువకులకు ఇస్తున్నారు. దీనివల్ల కృత్రిమంగా కండలు పెరిగినా శరీరంలోని అనేక అవ యవాలు దెబ్బతింటాయి. కొన్నిసార్లు గుండెపోటుతో పాటు బ్రెయిల్ స్ట్రోక్ కూడా వచ్చే ప్రమాదం వుంది. వీరిద్దరు మార్కెట్లో డిమాండ్ వున్న టెర్మెన్, మెఫెన్ టెర్మెన్ సల్ఫేట్ ఇంజక్షన్లను జింలకు వచ్చే వారికి ఇస్తున్నారు. ఇందులో శివ యుపికి చెందిన ముదీద్ చౌహాన్ నడుపుతున్న మెడ్‌హౌస్ ఫార్మా కంపెనీ నుంచి ఈ కామర్స్ ద్వారా వీటిని తెప్పిస్తున్నాడు. అనంతరం వీటిని శివ, మహమ్మద్ యూసుఫ్‌లు తమకు నమ్మక ంగా వుండే వారికి అమ్ముతున్నాడు. ఇక ఇదే ముఠాకు చెందిన మహమ్మద్ పుర్ఖానుద్దీన్ ఫైసల్ పంజాబ్‌కు చెందిన రాజన్ ప్రీత్ సింగ్ నుంచి షిప్ రాకెట్ అనే ఆన్ లైన్ సర్వీస్ ద్వారా కొనుగోలు చేస్తున్నాడు. వీటిని మహమ్మద్ సైఫ్, ఫర్జాన్ ఖాన్‌ల ద్వారా అమ్ముతున్నాడు. వీరిద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్టు చేసి విచారించగా స్టెరాయిడ్స్ ఇంజక్షన్ల సరఫరాలో మధ్యవర్తులుగా వున్న ముషీరాబాద్ వా సులు ఫర్జాన్ ఖాన్ (20), మహమ్మద్ సైఫ్, మహమ్మద్ యూసుఫ్ (26), జీడిమెట్లకు చెందిన సోంబట్టి అభిలాష్ (24)ల విషయం వెలుగు చూసింది. వెంటనే వీరిని కూడా అరెస్టు చేశారు. కాగా ఈ కేసులో స్టెరాయిడ్స్ ఇంజక్షన్లు చట్టవిరుద్ధంగా అమ్మిన యుపికి చెందిన ముదీద్ చౌ హాన్, పంజాబ్‌కు చెందిన రాజన్ ప్రీత్ సింగ్‌ల కోసం గాలిస్తున్నారు.

కాగా అరెస్టయిన వారి నుంచి మెఫెన్‌టెర్మెన్ సల్ఫేట్ ఇంజక్షన్ (10 ఎంఎ ల్ వయల్), గ్రీన్ స్పీడ్ ఇంజక్షన్ ఒక వయల్, టెస్టోస్టెరాన్ ఎడేట్ ఇంజక్షన్ 50 వయల్స్ (1 ఎంఎల్), టెస్టోకేర్ ఏ డేట్ ఇంజక్షన్ 1 యాంపి ల్ , సొమోట్రోపెన్ 7 యాంపిల్స్, రెమా స్టోరల్ ఇంజక్షన్ 7 యాంపిల్స్, రెమా స్టోరెల్ 7 యాంపిల్స్, అస్లిమిన్ ఇంజక్షన్లు (200 ఎంఎల్ వయల్స్), 336 ట్యాబ్లెట్లు, రెండు సెల్‌ఫోన్లు జప్తు చేశారు. వీటి విలువ ఆరున్నర లక్షల రూపాయలుగా తేలింది. ఈ ముఠాను పట్టుకున్న సిబ్బందిని టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ అభినందించారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

>> శాసనసభ్యులు డా. వంశీకృష్ణ, పరిగి శాసనసభ్యులు రామ్మోహన్ రెడ్డి, ఇతర శాసనసభ్యులు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ,ఒబెదుల్లా కొత్వాల్ ,సరితా తిరుపతయ్య, మాజీ శాసనసభ్యులు సంపత్, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, తదితరులు హాజరయ్యారు.

## పార్టీ పేరు మార్చుకోండి

>> అభ్యంతరాలు వచ్చాయని సీఈసీ వెల్లడించింది. పార్టీ పేరు మార్చాల్సిందే నంటూ ఆదేశాలు జారీ చేసింది. పార్టీ నమోదు ప్రక్రియ ముందుకు సాగాలంటే 15 రోజుల్లోగా మరో 3 ప్రత్యామ్నాయ పేర్లను తమకు సమర్పించాలని స్పష్టం చేస్తూ కవితకు అధికారికంగా లేఖ రాసింది. నిర్ణీత గడువులోగా కొత్త పేర్లు పంపకపోతే, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును క్లోజ్ చేస్తామని సీఈసీ ఆ లేఖలో కఠినంగా హెచ్చరించింది. ఈసీ పంపిన లేఖపై కల్వకుంట్ల కవిత స్పందిస్తూ ఎన్నికల సంఘం లేఖలో పేర్కొన్న అభ్యంతరాలకు తాము ఇప్పటికే రాతపూర్వక సమాధానాలు ఇచ్చామని తెలిపారు.

ఈసీ కోరినట్లుగా ప్రత్యామ్నాయంగా కొత్త పేర్లను పంపే ప్రసక్తే లేదని ఆమె తేల్చిచెప్పారు. తెలంగాణ రక్షణ సేన పేరుపైనే తాము ముందుకు వెళ్తామని, అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘంపై కోర్టుకు వెళ్లి న్యాయపోరాటం చేయడానికైనా సిద్ధమని కవిత స్పష్టం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కవిత తన కొత్త పార్టీ కోసం తెలంగాణ ప్రజా జాగృతి, తెలంగాణ జాగృతి, తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ రాష్ట్ర జాగృతి, తెలంగాణ ప్రజా శక్తి అనే ఐదు పేర్లను ఈసీకి ప్రతిపాదించారు. ఆ తర్వాత ఏప్రిల్ 25న మునీరాబాద్‌లో భారీ ఎత్తున నిర్వహించిన ఆవిర్భావ సభలో.. తమ పార్టీ పేరు తెలంగాణ రాష్ట్ర సేన (టిఆర్ఎస్) అని కవిత స్వయంగా ప్రకటించి, పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు. ఆ తర్వాత కేవలం మూడు రోజుల వ్యవధిలోనే (ఏప్రిల్ 28న) ఈ పేరును తెలంగాణ రక్షణ సేనగా మారుస్తూ, ఈ పేరుపై నెల రోజుల్లోగా ప్రజల నుంచి అభ్యంతరాలు కోరుతూ పత్రికల్లో నోటిఫికేషన్ ఇవ్వాలని ఈసీ ఆదేశించింది. మూడు రోజుల్లోనే రాష్ట్ర సేన, కాస్త రక్షణ సేనగా ఎందుకు మారిందనే దానిపై అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ నడిచింది. ప్రస్తుతం తెలంగాణ రక్షణ సేన్న పేరుతోనే కవిత కేడర్‌ను సమాయత్తం చేస్తూ ప్రజా క్షేత్రంలో పోరాటాలు నిర్వహిస్తుండగా... ఇప్పుడు ఏకంగా వేల సంఖ్యలో అభ్యంతరాలు వచ్చాయి. ఈ ఈసీ స్పందన నేపథ్యంలో ఈ టిఆర్ఎస్ పేరు కవితకు దక్కుతుందా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది.

### వారం - వర్జ్యం

05-07-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
పంచమి మ.1.27
శతభిష మ.3.09
వర్జ్యం : రా.9.47-రా.11.27
దు.సా.సా.4.55-సా.5.47
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - సా.4.30-6.00

### వారాఫలం

**మేషం:** ప్రముఖులతో చర్చలు సాగిస్తారు. ఇంటిలో శుభకార్యాలు. నూతన ఉద్యోగావకాశాలు లాభిస్తాయి. ఋణాలు తీరుస్తారు.

**వృషభం:** కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం. కారణం లేని చికాకు మీకు కొంత ఇబ్బంది కలిగిస్తుంది.

**మిథునం:** ఆర్థిక విషయములలో నిజముగా సహాయపడే వారెవరో మీరు గ్రహించగలుగుతారు. ఇంటర్వ్యూలకు హాజరవుతారు.

**కర్కాటకం:** జీవిత భాగస్వామితో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించడం చెప్పదగినది. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**సింహం:** దూరప్రాంతాలలోని ఆత్మీయుల క్షేమసమాచారం ఆనందం కలిగిస్తుంది. సంబంధ బాంధవ్యాలు పెరుగుతాయి.

**కన్య :** ఓర్పుతో, నేర్పుతో అందరితో కలిసి పనిచేసే ధోరణి వలన విజయులాదిశగా పయనిస్తారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**తుల :** నూతన ప్రయత్నాలలో పురోగతిని సాధిస్తారు. ప్రముఖులను కలుసుకొని కీలక సమాచారం తెలుసుకుంటారు.

**వృశ్చికం:** తనఖా వస్తువులను విడిపించుకుంటారు. మొండి బాకీలు వసూలవుతాయి. ఇంటర్వ్యూలకు హాజరవుతారు.

**ధనుస్సు:** మాటల చాతుర్యంతో ఎంతటి వారినైనా ఆకట్టుకుంటారు. సన్నిహితుల సహాయంతో ముందుకు సాగుతారు.

**మకరం:** కొత్త పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. నిర్వహిస్తున్న సంస్థలు అభివృద్ధి పథంలో నడుస్తాయి.

**కుంభం:** కోర్టుకేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. స్పెక్యులేషన్ మధ్యసంగా వుంటుంది.

**మీనం:** రాజకీయ అధికార ప్రాప్తి పొందుతారు. నిందారోపణలు రానివ్వకుండా చాకచక్యంగా వ్యవహరిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 2034 దాకా తెలంగాణలో ప్రజాపాలనే

>> ఇస్తుంటే ప్రజాపాలన పోవాలంటున్నారని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి లక్ష కోట్లు సంపాదించిన కేసీఆర్ కుటుంబం అధికారంలోకి రావాలా అంటూ ప్రశ్నించారు. 1000 ఎకరాల ఫామ్‌హౌస్ కేసీఆర్ కు ఎలా వచ్చిందో, బిడ్డకు కొడుకుకు అల్లుడుకి వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలు అడుగుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం మాత్రం అప్పులకుప్పగా మారిందని, కేసీఆర్ కుటుంబానికి ఆస్తులు ఫామ్ హౌస్‌లో ఎలా వచ్చాయో చెప్పాలన్నారు. తనకు పాలన చేత కావడం లేదని, పరిపాలన రావడంలేదని అంటున్నారని పాలమూరు బిడ్డలు పాలనకు పనికిరారా అంటూ ప్రశ్నించారు. తనకు పాలనపై అవగాహన లేదని చాలామంది హేళన చేస్తున్నారని, తాను గ్రామంలోనే పుట్టి పెరిగి ఎక్కడ పరిస్థితిలో అన్ని అవగాహన చేసుకునే వచ్చానన్నారు. గ్రామాలు బాగుంటేనే మండలం బాగుంటుందని, మండలం బాగుంటేనే జిల్లా బాగుంటుందని, బాగుంటేనే రాష్ట్రాలు బాగుంటాయని అప్పుడే దేశం బాగుపడుతుందన్నారు. పాలమూరు బిడ్డకు పరిపాలన చేతకాదు అనే దొరల దురహంకారాన్ని బద్దలు కొట్టాలన్నారు. మరొకసారి ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. ప్రజా కవి యుద్ధ నౌక గద్దర్లను నాలుగు గంటలు ఎండలో కూర్చోబెట్టిన కేసీఆర్ ను ఉరి తీసిన తక్కువేనని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**మిడ్జిల్ ప్రజలకు నా ప్రాణం ఇచ్చిన తక్కువే..**

తనకు రాజకీయంగా జన్మనిచ్చిన మిడ్జిల్ ప్రజలకు తన ప్రాణం ఇచ్చిన తక్కువేనని సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మిడ్జిలును దత్తత తీసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను సీఎం కోరారు. తాను జడ్పిటిసిగా నిలబడిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రబ్బాని ని తనకు పోటీగా నిలిపారని గుర్తు చేశారు. అప్పుడు రబ్బాని గెలిస్తే జడ్పీ చైర్మన్ అయ్యే వాడని, తాను ఇప్పటివరకు ఎవరిని ఇబ్బందులకు గురి చేయలేదని రబ్బానీకి ప్రభుత్వంలో ప్రత్యేక స్థానం కల్పించాలని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క సూచించారు. చీకట్లో నుంచి వెలుగు రేఖలు రావాలని 2006లో మిడ్జిల్ మండల ప్రజలు తీసుకున్న మహా గొప్పదని, ఎమ్మెల్సీగా రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నదంతా తనకు విచ్చేసారని భావోద్వేగానికి గురయ్యారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అడిగిన వారందరికీ రేషన్ కార్డులు ఇచ్చామని, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం ఇస్తున్నామని, నియోజకవర్గానికి 3500 చొప్పున రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇల్లు ఇచ్చామని, 21,000 కోట్ల రైతు రుణమాఫీ చేశామని , గత ప్రభుత్వం ఎనిమిదిన్నర లక్షల రూపాయల అప్పులను మిగిల్చి వెళ్లిందని అన్నారు. మిడ్జిల్ మండలానికి ప్రాణం ఇస్తానని ,జిల్లాలో ప్రతి ఎకరానికి సాగునీరు అందించడం, ప్రతి ఒక్కరికి విద్యను అందించే వరకు సేవ చేస్తానని అన్నారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఒక జడ్పిటిసిగా ప్రస్థానం మొదలుపెట్టి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం గొప్ప విషయం అని అన్నారు. ప్రజా సంక్షేమమే ఏజెండాగా తమ పరిపాలన కొనసాగుతున్నదని, పాలనంటే అధికారం కాదని, ప్రజల కోసం పాటుపడ్డామని, రాష్ట్రంలో కోటి 15 లక్షల మందికి సన్న బియ్యం ఇస్తున్నామని, 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం, భోజనం అందిస్తున్నామని, నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించామని, వడ్డీ లేని రుణా ల్లో భాగంగా ప్రతి సంవత్సరం స్వయం సహాయక మహిళా సంఘాలకు 20 వేల కోట్లు ఇస్తున్నామని, ప్రజల అవసరాలు తీర్చడమే పరిపాలన అని అన్నారు. స్థానిక శాసనసభ్యుడు జనంపల్లి అనిరుద్ రెడ్డి సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర స్పోర్ట్స్ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి మాట్లాడారు.

## రంకెలు వేస్తే అంకెలు మారుతాయా?

>> డిసెంబర్ 7నుంచి 2024 మార్చి 31వరకు అంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకున్న ఎఫ్ఆర్‌బిఎం రుణాలు రూ.15,118 కోట్లు. దీన్ని కూడా బిఆర్ఎస్ ప్రభుత్వ అప్పుల్లో కలిపారు. (ఆర్బీఐ రిపోర్టు ఆధారం) అంటే రూ.84,268 కోట్లు + రూ.15,118 కోట్లు = రూ.99,386 కోట్లు, ఈ మొత్తాన్ని 07-12 -2023 నాటికి ప్రభుత్వంపై ఉన్న మొత్తం బకాయి రుణాలు రూ.5,16,881 కోట్ల నుంచి తీసివేస్తే. = రూ.4,17,495 కోట్లు. ఇదే నేను చెప్పిన లెక్క.

మీ డాక్యుమెంట్ ప్రకారమే చెబుతున్నా అని పేర్కొన్నారు. ఎన్ని కలిపినా వాళ్లు చెప్పిన 8,21,651 కోట్లు నిండటం లేదని ప్రభుత్వం గ్యారెంటీ ఉండి, కార్పోరేషన్లు చెల్లించేవి, ప్రభుత్వం గ్యారెంటీ లేకుండా కార్పోరేషన్లే చెల్లించేవి కలిపారు. నిజానికి ఈ రుణాలు వాటికవే చెల్లిస్తాయి. మేం చెబుతున్నది మా సొంత లెక్కలు కావు. డిప్యూటీ సిఎం భట్టి ప్రెస్ మీట్ పెట్టి చెప్పిన డాక్యుమెంట్ ఆధారంగానే వివరిస్తున్నా అని పేర్కొన్నారు. ఆర్బీఐ డాక్యుమెంట్ పబ్లిక్ డొమైన్ లోనే ఉంటది ఎవరైనా తెలంగాణ అప్పులు ఎంత తెచ్చిందో చూడొచ్చు అని చెప్పారు.

## 667 ఎకరాల్లో భద్రాద్రి ఎయిర్‌పోర్టు!

>> సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా, అనుకూలమైన భూతలం, భూవినియోగం, నిర్వహణ పరిస్థితులతో ఉన్నట్లు తేలింది. సుమారు 667 ఎకరాల ప్రతిపాదిత అభివృద్ధి స్థలాన్ని ఎలాంటి ప్రధాన పర్యావరణ, సాంకేతిక అవరోధాలు లేకుండానే సమకూర్చవచ్చని నివేదిక స్పష్టం చేసింది. దీంతో ఏళ్లుగా నానుతున్న స్థల నిర్ధారణ సమస్యకు తెరపడే అవకాశం కనిపిస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యూహాత్మక ప్రాంతంలో ఉండటమే కాక, విశాలమైనగిరిజన, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతోందని మంత్రి తుమ్మల తన లేఖలో పేర్కొన్నారు. సింగరేణి బొగ్గు గనులు, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ, బీపీఎల్ వంటి ప్రముఖ పారిశ్రామిక సంస్థలకు ఈ జిల్లా నిలయంగా ఉందని వివరించారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి క్షేత్రానికి ఏటా లక్షలాది మంది భక్తులు దేశ, విదేశాల నుంచి తరలివస్తుంటారని, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే వారి ప్రయాణం మరింత సులభతరమవుతుందని తెలిపారు. అంతేకాక, జిల్లాలోని అటవీ సంపద, ఖనిజ వనరులు, ఎకో టూరిజం అవకాశాలు, ప్రతిపాదిత ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులకు విమానాశ్రయం మరింత బలం చేకూరుస్తుందని, తద్వారా పెట్టుబడులు పెరిగి విద్యా, పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో వేగవంతమైన అభివృద్ధికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. ఫీజిబిలిటీ నివేదికను దయచేసి పరిగణనలోకి తీసుకుని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రిని తుమ్మల తన లేఖలో అభ్యర్థించారు.




కేంద్ర మంత్రి ధర్మేంద్ర రాజీనామా చేయాలని నిరాహార దీక్ష చేస్తున్న వాంగ్‌చుక్‌కు శనివారం న్యూఢిల్లీలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు. చిత్రంలో కాక్రోచ్ పార్టీ అధ్యక్షుడు అభిజీత్ దీపక్

## బిజెపికి ఓట్లడిగే దమ్ము ఉందా?

>> కుట్ర చేస్తున్నారి ఆరోపించారు, గాంధీ,నెహ్రూ వారసత్వంను తుడిచివేయాలని దీని కోసం ఓటర్లను కూడా ఓట్లు వేయకుండా నిరోధించేందుకు సర్ పేరుతో కుట్ర చేస్తున్నారనీ ఆవేదన చెందారు. బిహార్,పశ్చిమబెంగాల్‌లో లక్షలాది ఓట్లు తొలగించారని ఆయన ఆరోపించారు. భారత్‌జోడో నుంచి రాహుల్‌గాంధీ ఎనలేని పోరాటం చేస్తూ భారత ప్రజాస్వామ్య రక్షణకు పూనుకొన్నారని ఆయన అన్నారు. కులగనణతో తెలంగాణ దేశానికి రోల్‌మాడల్‌గా అయిందని వందేళ్ళ తరువాత మిగితా భారతదేశం లో కూడా రాహుల్‌గాంధీ స్పూర్తితో కులగణన జరుగుతుందని ఆయన చెప్పారు. రాహుల్‌గాంధీ మిషన్‌లో చేరి అప్రజాస్వామిక పాలనపై పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జాతీయ లీగల్ సెల్ కాన్‌క్లేవ్ విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, హాజరైన న్యాయవాదులు, న్యాయ నిపుణులను ఉద్దేశించి ముఖ్య అతిథులు రాజ్యాంగ పరిరక్షణ, న్యాయవ్యవస్థ, న్యాయవ్యవస్థ దుర్వినియోగం, సామాజిక న్యాయం, యువ న్యాయవాదుల పాత్ర తదితర కీలక అంశాలపై ప్రసంగించారు. దేశంలోనే తొలిసారిగా యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇలాంటి జాతీయ స్థాయి కాన్‌క్లేవ్ నిర్వహించడం అభినందనీయమని విశిష్ట అతిథులు జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్ , జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆల్కలంబ, కొనియాడారు. నేషనల్ లీగల్ కాంక్లేవ్ లో న్యాయవాదులకు పరస్పర అనుభవాల మార్పిడి, సమకాలీన న్యాయ అంశాలపై అవగాహన పెంపొందించుకునేందుకు ఇటువంటి కాన్‌క్లేవ్‌లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. బీహార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కృష్ణ అల్లవేరు ,రాజ్యసభ సభ్యులు, సీనియర్ న్యాయవాది వివేక్ ్నటకీయా , ఎఐసిసి సెక్రెటరీ సచిన్ సావంత్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జాతీయ లీగల్ సెల్ కన్వీనర్ రూపేష్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ గూడూరు నిఖిల్ రెడ్డి ,సీనియర్ న్యాయవాదులు నందితా రావు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో సంస్కరణలకు ప్రత్యేక కమిటీ

>> గ్యాసిఫికేషన్‌కు విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. సింగరేణి కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టు చేపట్టడంపై దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఫెర్టిలైజర్స్ తదితర పరిశ్రమలను దృష్టిలో ఉంచుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటానికి కోల్ గ్యాసిఫికేషన్ కు పూనుకోవాలన్నారు. దేశంలో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో వ్యవసాయ, ఇతర పారిశ్రామిక రంగాల్లో విద్యుత్ వినియోగం తీవ్రంగా పెరిగే అవకాశం ఉన్నందున విద్యుత్ ఉత్పాదనకు తగినంత బొగ్గు అందించడానికి కోలిండియా తో పాటు, సింగరేణి కూడా సంసిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో విద్యుత్ అవసరాలు పెరగనున్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను ముందుగానే బలోపేతం చేసి ఉత్పత్తికి నిరంతర ఇంధన సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తి పెంపుకు అనుగుణంగా రవాణా వ్యవస్థను కూడా బలోపేతం చేయాలని మంత్రి ఆదేశించారు. రవాణా కాంట్రాక్టులను అత్యంత వేగంగా ఖరారు చేసి అమలు చేయడం ద్వారా అదనపు ఉత్పత్తి సకాలంలో వినియోగదారులకు చేరేలా చూడాలని సూచించారు. సంస్థ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికల్లో ఉద్యోగులను భాగస్వాములుగా చేసుకుని వారి విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, సంయుక్త కార్యదర్శి సంజీవ్ కుమార్ కస్సి, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి ప్రైవేట్ సెక్రటరీ పంకజ్ జైన్, బొగ్గు శాఖ సలహాదారులు వీరా రెడ్డి, సింగరేణి డైరెక్టర్లు ఎల్ వి సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, పోట్రు గౌతమ్, ఎం.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి ట్రిపుల్ ఐటిలో విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జూలై 4, ప్రభాతవార్త:** అనారోగ్యం, కుటుంబ సమస్యల కారణంగా క్యాంపస్‌లో కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి భవనంపై నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా పినపాక మండలం బయ్యారం గ్రామానికి చెందిన శివ ప్రసాద్ కుమారుడు అభిరూప్(20) గచ్చిబౌలిలోని ఐఐటీ క్యాంపస్‌లో కంప్యూటర్ సైన్స్ రెండవ సంవత్సరం చదువుతూ క్యాంపస్‌లోని హాస్టల్‌లో నివాసం ఉంటున్నాడు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలు, కుటుంబ కలహాలతో అభిరూప్ ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం అభిరూప్ తాను నివాసం ఉంటున్న హాస్టల్ బిల్డింగ్ ఆరవ అంతస్తు నుండి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యార్థి ఆత్మహత్యపై సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వ్యక్తిగత సమస్యలతో మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని అనుమానిస్తున్నప్పటికీ, అసలు కారణాలపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## వర్షాకాల పార్లమెంటు

>> సంభాషణలు, నిర్ణయాలకు ఈ సమావేశాలు వేదికగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి పార్లమెంట్ సమావేశాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా ఉభయసభలు సమావేశం కానున్నాయి. బెంగాల్, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో అధికార భారతీయ జనతా పార్టీ విజయాలు సాధించిన నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలపై ఆసక్తి నెలకొంది. మారిన రాజకీయ సమీకరణాల ప్రభావం ఉభయసభల కార్యకలాపాలపై కనిపించే అవకాశం ఉంది. తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) పార్టీల్లో చోటుచేసుకున్న పరిణామాలు సైతం వర్షాకాల సమావేశాల్లో చర్చనీయాంశంగా మారనున్నాయి. తమను ప్రత్యేక గ్రూపులుగా గుర్తించాలని కోరుతూ 20 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, ఆరుగురు శివసేన (యూబీటీ) ఎంపీలు చేసిన విజ్ఞప్తులపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీంతో స్పీకర్ తీసుకునే నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు రాజ్యసభలోనూ రాజకీయ సమీకరణాలు మారాయి. కొత్తగా ఎన్నికైన, తిరిగి ఎన్నికైన ఎంపీలు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అధికార ఎన్డీయేకు సంఖ్యాబలం మరింత అనుకూలంగా మారింది. రాజ్యసభకు చెందిన ముగ్గురు తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీలు రాజీనామా చేయడంతో ఆయా స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. వీటి ఫలితాలతో ఎగువ సభలో బీజేపీ మరింత బలం పెంచుకునే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

ఈసారి వర్షాకాల సమావేశాల్లో పలు కీలక బిల్లులు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ బిల్లును పరిశీలిస్తున్న జేపీసీ జూలై 17న సమావేశమై తన నివేదికను ఆమోదించే అవకాశం ఉంది. ఆ తర్వాత నివేదికను పార్లమెంట్ పరిశీలనకు సమర్పించనున్నారు. తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర లేదా రాష్ట్ర మంత్రులు అరెస్టై వరుసగా 30 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే వారిని పదవి నుంచి స్వయంచాలకంగా తొలగించాలనే ప్రతిపాదన ఈ బిల్లులో ఉన్నట్లు సమాచారం. ఈ నిబంధనపై ఇప్పటికే తీవ్ర రాజకీయ చర్చ జరుగుతోంది.

## ఆరెంజ్, ఎల్లో అలర్ట్

>> నెలలో అంతంత మాత్రంగానే వర్షాలు కురిశాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్న క్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు పుంజుకున్నాయి. ఈ క్రమంలో శనివారం వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికలను జారీ చేసింది. రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. దీంతో తీవ్రమైన వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్న ఖమ్మం, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాలకు వాతావరణ శాఖ అత్యంత అప్రమత్తతను సూచిస్తూ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అతిభారీ వర్షాల హెచ్చరికలతో పాటు రాష్ట్రంలోని మరో తొమ్మిది జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అంచనా వేసింది. రాష్ట్రంలోని ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, సూర్యాపేట, కామారెడ్డి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని, నదులు, వాగులు దాటే ప్రయత్నాలు చేయవద్దని విపత్తు నిర్వహణ శాఖ అధికారులు సూచించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కూడా ఆకాశం మేఘావృతమై ఉండి, సాయంత్రానికి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ నిపుణులు తెలిపారు.

# రేపటి నుంచి ప్రధాని 3 దేశాల పర్యటన

## ఆస్ట్రేలియా వస్తే చంపేస్తామంటూ బెదిరింపులు: నిఘా సంస్థలు వెల్లడి



**న్యూఢిల్లీ, జులై 4:** ప్రధాని నరేంద్రమోడీ ఈ నెల 6 నుంచి 11 వరకు ఇండొనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు. ఈ 3 దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా మోడీ ఈ పర్యటన చేయనున్నారని విదేశాంగ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ మొదట ఇండోనేషియాను సందర్శిస్తారు. ఆ తర్వాత ఆస్ట్రేలియాకు ప్రయాణమవుతారు. అక్కడ ఆయన ప్రధాన అధికారిక కార్యక్రమాలు మెల్‌బోర్న్‌లో జరుగుతాయి. అనంతరం న్యూజిలాండ్ పర్యటనతో మోడీ తన విదేశీ పర్యటనలను ముగిస్తారని ఎంఈఏ కార్యదర్శి రుద్రేంద్ర టాండన్ తెలిపారు. దాదాపు 40 సంవత్సరాల తర్వాత ఒక భారత ప్రధాన మంత్రి ఆ దేశంలో పర్యటించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. వచ్చేవారం ప్రధాని మోడీ న్యూజిలాండ్‌లో తన మొదటి అధికారిక పర్యటన చేయనున్నట్లు ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ శనివారం అధికారికంగా ప్రకటించారు. 'భారత ప్రధాని నరేంద్ర మోడీ వచ్చే వారం న్యూజిలాండ్‌లో తన మొదటి అధికారిక పర్యటన చేయనున్నారని ప్రకటించడానికి నేను ఎంతో సంతోషిస్తున్నాను' అని లక్సన్ తన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అయితే ఈ పర్యటన గురించి కచ్చితమైన తేదీలను ఆయన వెల్లడించలేదు.

ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం ఒకటి అని కొనియాడిన లక్సన్, న్యూజిలాండ్ ఆర్థిక శ్రేయస్సుకు భారత్ ఎంతో కీలకమైనదని స్పష్టం చేశారు. ఏప్రిల్‌లో కుదిరిన న్యూజిలాండ్ ఇండియా ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్ ద్వారా ఇరుదేశాల మధ్య సంబంధాలను మేము తదుపరి స్థాయికి తీసుకెళ్తున్నాం. ఇది న్యూజిలాండ్‌కు మరిన్ని ఉద్యోగాలను, అధిక ఎగుమతులను, బలమైన ఆర్థిక వృద్ధిని అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఒప్పందం కొత్త అవకాశాలను తెరుస్తుందని, న్యూజిలాండ్ వస్తు, సేవలకు 1.4 బిలియన్ల (140 కోట్ల) జనాభా కలిగిన భారీ మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తుందని లక్సన్ అన్నారు. ఇది కివీస్ సమాజంలోకి మరింత ఆదాయాన్ని తీసుకువస్తుందని, కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని, వేతనాలను పెంచుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, న్యూజిలాండ్‌ల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంపొందించడానికి, పెట్టుబడులను ప్రోత్సహించడానికి ఈ సంవత్సరం ప్రారంభంలోనే భారత్, న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సంతకాలు చేశాయి. ఇండోనేషియా పర్యటననివేదికల ప్రకారం, భారతదేశంలో ప్రజల జీవితాలను, జీవనోపాధిని మార్చడంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) సాధించిన విజయాన్ని చూసి, ఆ రంగంలో భారత్‌తో భాగస్వామ్యం పట్ల ఇండోనేషియా చాలా ఆసక్తి కనబరుస్తోంది. ఇందులో భాగంగానే, 2026 జూన్ 7న ఢిల్లీలో 8వ ఇండియాఇండోనేషియా జాయింట్ కమిషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి భారత విదేశాంగ మంత్రి (ఈఏఎం) ఎస్.జైశంకర్, ఇండో నేసియా విదేశాంగ మంత్రి సుగియోనో సంయుక్తంగా అధ్యక్షత వహించారు.

**ఆస్ట్రేలియా పర్యటన**

ఇక మోడీ తన ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా, ఇరుదేశాల మధ్య ఉన్న సన్నిహిత వ్యూహాత్మక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో ప్రధాని మోడీ ద్వైపాక్షి క చర్చలు జరపనున్నారు. ఇటీవలే గతనెల 26న ఢిల్లీలో జరిగిన ఫారిన్ మినిస్టర్స్ ఫ్రేమ్‌వర్క్ డైలాగ్ సందర్భంగా విదేశాంగ మంత్రి జైశంకర్ తన ఆస్ట్రేలియా కౌంటర్ పార్ట్ పెన్నీ వాంగ్‌తో సమావేశం కావడం గమనార్హం. ఈ పర్యటనలో అత్యంత ముఖ్యమైన ఘట్టంగా ఈనెల 9న మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరగనున్న మెల్‌బోర్న్ మీట్స్ మోడీ అనే భారీ కమ్యూనిటీ ఈవెంట్‌లో ప్రధాని ప్రసంగించనున్నారు. ఆస్ట్రేలియా ఇండియా ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం, విక్టోరియా రాష్ట్ర చరిత్రలోనే భారత్‌ఆస్ట్రేలియా కమ్యూనిటీల మధ్య జరిగిన అతిపెద్ద సమ్మేళనాలలో ఒకటిగా నిలుస్తుందని అంచనా.

**వస్తే చంపేస్తామంటూ మోడీకి బెదిరింపులు**

ఇదిలా ఉంటేమోడీ విదేశీ పర్యటనకు ముందే ఆయనకు బెదిరింపులు ఎదురయ్యాయి. ఫేస్‌బుక్ పోస్టులో బెదిరింపులు వచ్చినట్లు దర్యాప్తు ఏజెన్సీలు నిర్ధారించాయి. ఆస్ట్రేలియా వస్తే చంపేస్తామంటూ ప్రధానిమోడీకి బెదిరింపులు వచ్చినట్లు దర్యాప్తు ఏజెన్సీలకు సమాచారం అందడంతో వెంటనే అలర్ట్ అయ్యాయి. ప్రధాని మోడీ ఆస్ట్రేలియా పర్యటనకు ముందు బెదిరింపులు తీవ్ర కలకలం రేపుతున్నాయి. మోడీని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో హత్య బెదిరింపు రావడంతో ఆస్ట్రేలియా అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బెదిరింపు సందేశం పోస్టు చేసిన వ్యక్తికి సంబంధించిన ఐపీ అడ్రస్‌ను గుర్తించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ప్రధాని మోడీ జులై 8 నుంచి 10 వరకు మెల్‌బోర్న్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో ద్వైపాక్షి క చర్చలు జరపనున్నారు.

**ఫేస్‌బుక్‌లో బెదిరింపు సందేశం**

స్థానిక మీడియా కథనం ప్రకారం జులై 9న మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరగనున్న మెల్‌బోర్న్‌మీట్స్ మోడీ కార్యక్రమానికి సంబంధించిన ఫేస్‌బుక్ పోస్టు కింద అబు ముస్తఫా పేరుతో ఉన్న ఖాతా నుంచి బెదిరింపు వ్యాఖ్య పోస్ట్ చేశారు. ఈ వ్యాఖ్యలో కార్యక్రమం జరిగే సమయంలో స్టేడియం పైకప్పు మూసి ఉంచడం మంచిది. లేకపోతే ఆయన ఆస్ట్రేలియాకు తన మరణం కోసం వస్తారు. అంటూ హెచ్చరిక చేశారు. ఈ బెదిరింపు పోస్టుకు సంబంధించిన ఐపీ అడ్రస్‌ను పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఇది క్రిమినల్ నేరం కిందకు వస్తుందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేసినట్లు ఆస్ట్రేలియన్ ఫెడరల్ పోలీస్ అధికారికంగా ప్రకటించలేదు. దర్యాప్తు కొనసాగు తున్నందున మరిన్ని వివరాలను వెల్లడించలేమని పేర్కొంది.



## అసెంబ్లీలో రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పించిన స్పీకర్, చైర్మన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 4:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా శాసనసభ మెంబర్స్ లాంజ్‌లో ఆయన చిత్రపటానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌ముదిరాజ్, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసన మండలి కార్యదర్శి డా. వి. నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు విత్తన దోపిడీ

### ఎమ్మార్పీ కంటే మించిన రేట్లు

### మార్కెట్లో నిషేధిత బిటి విత్తనాలు

### ఇష్టారాజ్యంగా అమ్మకాలు

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** ప్రస్తుత వానాకాలం పంటల సీజనులో విత్తనాలకు డిమాండ్ పెరగడంతో కొందరు వ్యాపారులు రైతులను దోపిడీ చేస్తున్నారు. రైతుల అమాయకత్వాన్ని బట్టి వ్యాపారులు ఒక్కొక్కరు ఒక్కో రీతిగా విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తూ రైతుల్ని నిలువు దోపిడీ చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే పెంచి అమ్ముతూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సోయాబీన్ విత్తనాల 25 కేజీల బ్యాగ్ ధర రకాన్ని బట్టి రూ.2,500 నుండి రూ.3,500 వరకూ ఉండగా, కొందరు వ్యాపారులు రైతుల నుంచి అవకాశాన్ని బట్టి రూ.3 వేల నుండి రూ.3,900 వరకూ వసూలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. నగదు రూపంలో అదనంగా డబ్బులు తీసుకుంటున్న వ్యాపారులు రసీదులో మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన ధరల్ని మాత్రమే రాస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే విత్తనాల కొరత ఉందనే సాకు చెబుతున్నారు. రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 3.34 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగవుతోంది. సుమారు 6 లక్షల వరకు పత్తి విత్తనాల అవసరముంటుంది. సగటున ఒక్క ప్యాకెట్‌పై రూ.100 చొప్పున పత్తి, సోయాబీన్ విత్తనాలపై వసూలు చేస్తున్న వ్యాపారులు రూ.6 కోట్లకుపైనే రైతుల నుంచి అధిక ధరల పేరిట లూటీ చేస్తున్న పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. అలాగే సిద్దిపేట జిల్లాలోనూ 1.50 లక్షల ఎకరాల్లో పత్తి, మెదక్ జిల్లాలో 50 వేల ఎకరాల్లో పత్తి సాగవ్వనుంది. రెండు జిల్లాల్లోనూ 3.5 లక్షల వరకు పత్తి విత్తన ప్యాకెట్ల వ్యాపారం సాగనుంది. పత్తి విత్తనాలకు సంబంధించి బ్రాండెడ్ హైబ్రీడ్ విత్తనాలు బీటీ1, బీటీ2 రకాల కొరత ఉందని చెప్పి ఎంఆర్‌పీ ధర రూ.950గా ఉంటే అదనంగా రూ.300 వసూలు చేస్తున్నారు. హైబ్రీడ్ విత్తనాల గురించి రైతులకు శాస్త్రీయమైన అవగాహన లేకపోవడంతో వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. మరి కొందరేమో నిషేధించబడిన బీటీ3 పత్తి విత్తనాలను తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. బీటీ2 కంటే బీటీ 3 విత్తనాలు సాగు చేస్తే 30 శాతం అధిక దిగుబడి వస్తుందని, దోమపోటు అస్సలు రాదని చెప్పి రూ600 వందలకే ప్యాకెట్ విత్తనాలను విడిగా విక్రయిస్తున్నారు. ఖమ్మం తదితర జిల్లాల్లో పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో నిషేధిత గడ్డి మందు, చీడల నివారణ కోసం వాడే ఆయిల్ ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు అరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## విహెచ్‌ను పరామర్శించిన మాజీ గవర్నర్ దత్తాత్రేయ



**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** సోమాజి గూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ కాంగ్రెస్ నేత, రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమ శాఖ సలహాదారులు వి. హనుమంత రావును శనివారం మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించినారు. ఆస్పత్రిలోని వైద్యనిపుణులతో మాట్లాడి విహెచ్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకొన్నారు. దత్తాత్రేయ విహెచ్‌తో మాట్లాడుతూ త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు.

## ఇంజినీరింగ్‌లో 79,313 సీట్ల కేటాయింపు

### 7 వరకు వెబ్‌ఆప్షన్ల మార్పునకు అవకాశం

### మాక్ సీట్ కేటాయింపు చేసిన అధికారులు

### 10న మొదటి విడత సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్ సెట్-2026 కౌన్సెలింగ్‌లో భాగంగా శనివారం మాక్ సీట్ కేటాయింపు చేశారు. 88,053 సీట్లకు గానూ 79,313 సీట్లను కేటాయించారు. 90 శాతం సీట్లను కేటాయించారు. ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో భాగంగా మాక్ సీట్ల కేటాయింపు శనివారం చేయగా.. ఈ నెల 7 వరకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లను మార్చుకోవడానికి అవకాశం కల్పించినట్లు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు.

ఎప్ సెట్-2026లో 89,785 మంది ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. వారిలో 88,062 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. రాష్ట్రంలో 175 ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 88,053 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉండగా.. వాటిలో 79,313 సీట్లను కేటాయింపు చేశారు. మొత్తం సీట్లలో 90 శాతం సీట్లను కేటాయించారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చినప్పటికీ 8740 సీట్లను కేటాయించ లేదు. ఈడబ్ల్యూఎస్ కోటాలో 6261 సీట్లను కేటాయించారు.

మాక్ అలాట్‌మెంట్ పొందిన విద్యార్థులు తమ సీట్ల కేటాయింపులో ఆప్షన్లను మార్చుకోవడానికి నేటి(ఆదివారం) నుంచి ఈ నెల 7 వరకు అవకాశం కల్పించారు. ఈ నెల 10న మొదటి విడత సీట్ల కేటాయింపు చేస్తారు. ఈ నెల 14 వరకు విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ ఈ నెల 17న ప్రారంభించనున్నారు.

## దోస్త్ ద్వారా 1,17,658 మంది డిగ్రీలో చేరిక

### నాన్‌దోస్త్ కాలేజీల్లో చేరిన 21,034 మంది

### డిగ్రీ మొదటి సంవత్సరంలో 1,38,692 మంది

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2026 ద్వారా మూడో విడత ముగిసేనాటికి 1,17,658 మంది కాలేజీల్లో చేరారు. ఇప్పటికే రెండు విడతల్లో కేటాయింపులు చేయగా.. జూన్ 25న మూడో విడత కేటాయింపు చేశారు. మూడో విడత కేటాయింపు సందర్భంగా కాలేజీల్లో చేరడానికి ఈ నెల 4(శనివారం) వరకు అవకాశం కల్పించారు. గత రెండు విడతల్లో సీటు పొందిన విద్యార్థులు కూడా ఈ నెల 4 లోపుగా కాలేజీల్లో చేరాలని దోస్త్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం వరకు రాష్ట్రంలో దోస్త్ ద్వారా 1,17,658 మంది కాలేజీల్లో చేరినట్టు తెలిసింది. నాన్ దోస్త్ కాలేజీల్లో 21,034 మంది చేరారు. మొత్తంగా 2026-27 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో 1,38,692 మంది చేరారు.

## స్టెరాయిడ్స్ ఇంజక్షన్ల అమ్మకాలపై బి2బి సంస్థకు పోలీసుల తాఖీదులు

### కొరియర్ కంపెనీల పాత్రపై విచారణ

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో వెలుగు చూసిన స్టెరాయిడ్స్ ఇంజక్షన్ల అక్రమ విక్రయాలపై పోలీసు శాఖ తీవ్రంగా స్పందించింది. వైద్యుల సిఫార్సుల మేరకు దీర్ఘకాలిక రోగులకు ఇవ్వాల్సిన వీటిని జింలలో ఫిట్‌నెస్ కోసం వచ్చే యువతకు ఇష్టానుసారం కొందరు అమ్ముతున్న ఉదంతాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేయడం సంచలనం రేపింది. హైదరాబాద్‌లో పట్టుబడ్డ స్టెరాయిడ్స్ ఇంజక్షన్లు యు పి, పంజాబ్‌ల నుంచి దిగుమతి అయినట్లు గుర్తించిన పోలీసులు ఇందుకుగానూ ప్రముఖ ఆన్‌లైన్ బిజినెస్ సంస్థ బి2బికి నోటీసులు జారీ చేశారు. దేశ వ్యాప్తంగా ఆన్‌లైన్ వ్యాపారంలో పేరొందిన బి2బి (బిజినెస్ 2 బిజినెస్) సంస్థ ద్వారా జింల నిర్వాహకులు స్టెరాయిడ్స్ ఇంజక్షన్లను ఆర్డర్ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆర్డర్ చేసే క్రమంలో అడ్డగోలు పత్రాలను, నకిలీ వైద్యుల సిఫార్సుల లేఖలను జింల నిర్వాహకులు ఉపయోగించినట్లు పోలీసులు తేల్చారు. ఈ విషయంలో అన్ని అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సిన బి2బి సంస్థ నాంకే వాస్తేగా వ్యవహరించిందని పోలీసుల విచారణలో తేలింది. దీంతో బి2బి నుంచి వివరణ తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు. భవిష్యత్తులో స్టెరాయిడ్స్ ఇంజక్షన్లను రవాణా చేయవద్దని పోలీసులు ఆదేశించారు. మరోవైపు స్టెరాయిడ్స్ ఇంజక్షన్ల స్మగ్లింగ్‌లో కొరియర్ కంపెనీల పాత్ర కూడా వుండడంతో వాటిపైనా చర్యలు తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు. స్టెరాయిడ్స్ ఇంజక్షన్లను యుపి, పంజాబ్ నుంచి హైదరాబాద్‌కు రావడంలో ఏ ఏ కొరియర్ కంపెనీల పాత్ర వుందనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇందులో అనుమానాస్పదంగా వున్న కొన్ని కంపెనీలకు పోలీసులు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఇందులో కొరియర్ కంపెనీలు కాసులకు కక్కుర్తిపడి నేరం చేసినట్లయితే వాటిపై చర్యలు తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారని సమాచారం.

## ఉల్లి కొనుగోలు ధర 13 శాతం పెంపు

### క్వింటాల్ రూ.2,125కు చేరిన రేటు

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** ధర తక్కువగా ఉండటంతో నష్టాల్లో ఉన్న ఉల్లి రైతులకు కేంద్రం శుభవార్తను అందించింది. మార్కెట్లో ఉల్లి ధరల స్థిరీకరణ, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా, కేంద్ర బఫర్ స్టాక్ సేకరణ కోసం ఉల్లి కొనుగోలు ధరను ఏకంగా 13 శాతం పెంచుతూ శనివారం కీలక నిర్ణయం తీసుకుంది. తాజా సవరణతో ఉల్లి కనీస కొనుగోలు ధర ఇప్పుడు క్వింటాలుకు రూ.2,125 కు చేరింది. గతంలో కేంద్ర ప్రభుత్వం క్వింటాల్ ఉల్లికి రూ.1,875 మద్దతు ధరగా చెల్లించేది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, రైతుల పెట్టుబడి వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ధరకు అదనంగా రూ.250 పెంచింది. ఈ ప్రస్తుత మార్కెటింగ్ సీజన్లో కేంద్ర ప్రభుత్వం ఉల్లి కొనుగోలు ధరలను పెంచడం ఇది ఐదో సారి కావడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన నాఫెడ్, ఎన్సీసీఎఫ్ ద్వారా రైతుల నుంచి నేరుగా ఈ పెంచిన ధరలకే బఫర్ స్టాక్ సేకరించనున్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల బహిరంగ మార్కెట్లో మధ్యవర్తుల దోపిడీ తగ్గి, ఉల్లి రైతులకు భారీగా ఆర్థిక ప్రయోజనం చేకూరనుందని కేంద్ర అధికారవర్గాలు వెల్లడించాయి.

## కన్నకొడుకును కడతేర్చిన కసాయి తండ్రి

**కల్లూరు, జులై 4, ప్రభాతవార్త:** కసాయి తండ్రి తన కన్న కొడుకును కడతేర్చిన సంఘటన కల్లూరు మునిసిపాలిటీ లో చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు ప్రకారం.. పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ కొత్తపల్లి సీతా రాములు శుక్రవారం రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో మద్యం మత్తులో తన ఒక్కగానొక్క కుమారుడు కొత్తపల్లి కిరణ్‌కుమార్ (30)ను దగ్గరలోని బెల్ట్ షాపుకు తీసుకువెళ్లి ఫుల్లుగా మద్యం తాగించి తిరిగి తన ఇంటికి తీసుకొచ్చి విక్షణారహితంగా కొట్టి, తలవెనక భాగంపై బలమైన గాయం చేయడంతో విపరీతమైన రక్తస్రావమై కిరణ్‌కుమార్ కుప్ప కూలిపోయాడు. కిరణ్ చనిపోయాడని నిర్ధారించుకున్న తండ్రి సీతారాములు ఆటోలో పారిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి నిందితుడిని గాలిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

## పోలీసు ఉద్యోగాల భర్తీల్లో టిజిఎస్‌పికి మొండి చెయ్యి

### తొలిసారిగా ఒక్క కానిస్టేబుల్ పోస్టు కూడా భర్తీకాని వైనం

### సివిల్, ఎఆర్ విభాగాల్లో గ్రేటర్ పరిధిలోని కమిషనరేట్లకే ప్రాధాన్యత

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఐదు వేల పోలీసు ఉద్యోగాల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌లో తెలంగాణ స్పెషల్ పోలీసు విభాగానికి కానిస్టేబుళ్ల కేటగిరిలో మొండి చెయ్యి ఎదురయ్యింది. మొత్తం ఐదు వేల పోస్టుల భర్తీలో అధికారుల కేడర్‌లో సివిల్ ఎస్ఐలు 148, సాయుధ బలగం ఎస్ఐలు 14, టిజిఎస్‌పి ఎస్ఐలు 12, అంబర్‌పేట్‌లోని ప్రత్యేక సాయుధ బలగం సెంట్రల్ పోలీసు లైన్స్ (సిపిఎల్ ) ఎస్ఐలు మూడు వుండగా ఫింగర్ ప్రింట్ బ్యూరోలో 23 ఏఎస్ఐ పోస్టులు వున్నాయి. ఇక క్షేత్రస్థాయిలో కీలకంగా వుండే కానిస్టేబుల్ పోస్టుల్లో సివిల్ విభాగంలో 3697 వుండగా సాయుధ బలగంలో 1052 వున్నాయి.

దీని తరువాత సిపిఎల్‌లో 24, పోలీసు రవాణా శాఖలో డ్రైవర్ పోస్టులు 20, మెకానిక్ పోస్టులు ఏడు వున్నాయి. పోలీసు శాఖలో ఎప్పుడు భర్తీలు జరిగినా కానిస్టేబుల్ కేటగిరిలో 40 శాతం అంతకు పైగా టిజిఎస్‌పికి కేటాయించడం ఆనవాయితీగా వస్తోంది. దీని తరువాత సివిల్ విభాగం ఆ తరువాత సాయుధ బలగం విభాగాలకు కేటాయింపులు వుండేవి. స్పెషల్ పోలీసు బెటాలియన్లలో కానిస్టేబుళ్ల కొరత తీవ్రంగా వుండడం గమనార్హం. ఈ విభాగంలో గల అన్ని బెటాలియన్లలో కలిపి మూడు వేలకు పైగా పోస్టులు ఖాళీగా వున్నాయని తెలిసింది. అయితే తాజా నోటిఫికేషన్‌లో ఈ విభాగానికి ఎస్ఐ కేడర్‌లో 12 పోస్టులు మాత్రం కేటాయించి కానిస్టేబుల్ పోస్టుల్లో ఎలాంటి కేటాయింపులు చేయలేదు. ఇలా ఎందుకు జరిగిందనే దానిపై అధికారుల నుంచి స్పష్టత కొరవడింది.

టిజిఎస్‌పి నుంచి ఖాళీలకు సంబంధించి నివేదిక పోలీసు నియామక మండలితో పాటు సర్కారు వద్ద వుండడం గమనార్హం. అయినప్పటికీ కేటాయింపుల్లో కానిస్టేబుల్ పోస్టుల విషయంలో ప్రాధాన్యత ఇవ్వలేదు. ఇలా జరగడం ఇదే తొలిసారిగా టిజిఎస్‌పి విభాగం అధికారులు చెబుతున్నారు.

ఇక సివిల్ కానిస్టేబుళ్ల పోస్టుల విషయానికి వస్తే ఖాళీల సంఖ్య 15 వేలకు పైగా వుండగా భర్తీలు 3697 మాత్రమే చేబడుతున్నారు. మిగతా పోస్టుల భర్తీ ఎప్పుడన్నదీ తెలియరావడం లేదు. ఈ భర్తీల్లో రెండు వేల పోస్టులు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లకు కేటాయించనున్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లో కానిస్టేబుల్ పోస్టులు మూడు వేలకు పైగా ఖాళీగా వుండగా మిగతా మూడు కమిషనరేట్లలో 1500 పైగా వున్నట్లు సమాచారం. అంటే ఈ నాలుగు కమిషనరేట్లలో కూడా పూర్తి స్థాయిలో భర్తీలు జరగడం లేదన్న మాట. ఇక సాయుధ బలగంలో భర్తీ కానున్న 1052 పోస్టుల్లోనూ 700 పైబడి పోస్టులు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లకు కేటాయించనున్నటు సమాచారం. ఈ లెక్కన అటు సివిల్, ఇటు సాయుధ బలగంలో జరగనున్న భర్తీలలో రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు అరకొరగానే వుండనున్నాయని చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో వున్న ఖాళీలను 70 శాతం భర్తీ చేయాలంటే 20 వేల పోస్టులయినా రిక్రూట్ చేయాలని అధికారులు చెబుతున్నారు.

నిరుద్యోగులు కూడా దీనినే డిమాండ్ చేస్తున్నారు. అయితే పోలీసు శాఖ మలివిడత భర్తీ చేబట్టాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఈ భర్తీల్లో 15 వేలకు పైగా పోస్టులను రిక్రూట్ చేసే వీలుందని సమాచారం.

## పెట్రోల్‌లో ఇథనాల్.. డీజిల్‌లో ఐసోబ్యుటనాల్

### 15 శాతం మిశ్రమానికి కేంద్రం నిర్ణయం

**న్యూఢిల్లీ, జులై 4:** దేశంలో ఈ20 పెట్రోల్‌పై చర్చ జరుగుతుంటే కేంద్రం మరో నిర్ణయాన్ని ప్రకటించింది. డీజిల్‌లో 15 శాతం ఐసోబ్యూటనాల్ కలిపేందుకు సిద్ధమైంది. ఈ విషయాన్ని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శనివారం వెల్లడించారు. పెట్రోల్, డీజిల్ వంటి శిలాజ ఇంధనాల్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడాన్ని తగ్గించాలని, ఆధునిక స్వచ్ఛమైన చమురును వాడాలనే కేంద్ర లక్ష్యంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు గడ్కరీ వెల్లడించారు. చమురు దిగుమతుల్ని తగ్గించేందుకు కేంద్రం ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలని కేంద్రం నిర్ణయించింది. పెట్రోల్‌లో కలిపినట్లుగా ఇథనాల్‌ను డీజిల్‌లో నేరుగా కలపడానికి వీలుకాదు. అందువల్ల ఇథనాల్ నుంచి ఐసోబ్యూటనాల్‌ను ఉత్పత్తి చేస్తారు. దీన్ని డీజిల్‌లో కలుపుతారు. త్వరలో డీజిల్‌లో ఐసోబ్యూట నాల్‌ను 15 శాతం కలపబోతున్నారు. ఇకపై పూర్తి డీజిల్ కాకుండా 85 శాతం డీజిల్, 15 శాతం ఐసోబ్యూటనాల్ కలిపిన చమురు అందుబాటులోకి వస్తుంది. ఐసోబ్యూటనాల్‌ను డీజిల్‌కు పూర్తి ప్రత్యామ్నాయంగా కూడా వాడుకోవచ్చని గడ్కరీ అన్నారు. ప్రస్తుతం ఐసోబ్యూటనాల్ మిక్సింగ్ ప్రక్రియ కొనసాగుతోందని, దేశీయ చమురు భద్రతలో ఇదొక ముందడుగు అని గడ్కరీ అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ప్రస్తుతం దీన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే రెండు జనరేటర్లను ఇలా విజయవంతంగా వాడినట్లు చెప్పారు. డీజిల్‌లో ఐసోబ్యూటనాల్ కలపడం వల్ల డీజిల్ వినియోగం తగ్గుతుందని, దీనివల్ల విదేశాల నుంచి క్రూడాయిల్ దిగుమతులు తగ్గుతాయన్నారు.




ఇటీవలి కాలంలో పెట్రోల్‌లో ఇథనాల్ కలుపుతూ కేంద్రం చేపట్టిన చర్యల వల్ల రూ.1.9 లక్షల కోట్ల విదేశీ మారక నిధులు మిగిలాయిన నితిన్ గడ్కరీ వెల్లడించారు. దీనివల్ల కర్బన ఉద్గారాలు కూడా తగ్గుతాయన్నారు. కేంద్ర నిర్ణయంపై ప్రజల నుంచి, నిపుణుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ పెట్రోల్ వల్ల వాహనాల మైలేజ్ తగ్గుతుందని, త్వరగా పాడయ్యే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో కేంద్రం నుంచి ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.


తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) శాఖ

(చట్టం-30/2013లోని సెక్షన్ 19(1)లోని సబ్ రూల్-1 రూల్ 25 ప్రకారం)

ఫారం - VII

రూఢీ ప్రకటన

కలెక్టర్/సంయుక్త కలెక్టర్/స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ)/ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)

కలెక్టర్ ఫైల్ నెం. G1/1205/2026 తేది : 19.06.2026
నెం.బి/906/రాయిగిరి/2024 తేది : .06.2026
గెజిట్ నెం. 26/2026 తేది : 01.07.2026

డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (కట్టడాలు), దక్షిణ మధ్య రైల్వే, కాజీపేట్ గారు రిక్విజేషన్ ఇచ్చిన రిక్విజేషన్ అనుసరించి తెలంగాణ ప్రభుత్వము/జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు ఈ దిగువ షెడ్యూల్లో నిర్దిష్ట పరచిన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలము రాయిగిరి గ్రామ భూములను మరియు వాటి విస్తీర్ణములను మొత్తము ఎ.01.05 గుంటల భూమి ప్రజా ప్రయోజనము నిమిత్తము అనగా యం.యం.టి.ఎస్. ఫేజ్-II విస్తరణ ఘటకేసర్-రాయిగిరి (యాదాద్రి) నిర్మాణము కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరమైనదని భావించనైనది.

షెడ్యూల్

గ్రామము : రాయిగిరి మండలము : భువనగిరి జిల్లా : యాదాద్రి భువనగిరి

| క్రమ సంఖ్య | సర్వే నెంబర్ | భూమి స్వభావము | భూమి రకం | పేరు | విస్తీర్ణం ఎ.గుం. | కట్టడాలు /చెట్లు/ బావులు |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 1 | | | | రోడ్డు | 0.01 | |
| 2 | | | | పాత గ్రామకంఠం | 0.12 | |
| 3 | 136 | పట్టా | తరి | గోగి ప్రాపర్టీస్/షేక్ అక్బర్ తండ్రి: సిద్దిక్ (వ/అ) | 0.07 | |
| 4 | 176 | పట్టా | తరి | యస్.వి.కన్స్‌ట్రక్షన్/కొండకింది శ్రీనివాస్ రెడ్డి (వ/అ) | 0.12 | |
| 5 | 177 | పట్టా | తరి | 1. పుల్ల శివకాంత్ తండ్రి: సురేష్ కుమార్ (వ/అ) | 0-10.5 | |
| | | | | 2. అయరాల్ మాణిక్యం తండ్రి: సుబ్రహ్మణ్యం (వ/అ) | 0-02.5 | |
| | | | | మొత్తం | 01-05 | |

ఇట్టి ప్రకటన భూసేకరణ భూ నిర్వాసితులు పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం, 2013 (సెం. చట్టం 30/2013)లోని 15వ విభాగం ననుసరించి నిర్ణీత గడువులోపల ఎటువంటి అభ్యంతరములు రానందున పై ఎగువ షెడ్యూల్ దాఖల భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించి పై రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టములోని 19(1) విభాగముననుసరించి జారీ చేయనైనది.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజములు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న సందర్భములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడదు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో కార్యాలయ పని వేళలో రాజస్వ మండలాధికారి, భువనగిరి గారి కార్యాలయములో మరియు తహసీల్దార్ కార్యాలయము, భువనగిరి మండలములో పరిశీలించుకొను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/-. భూసేకరణ అధికారి, మరియు రాజస్వ మండలాధికారి, భువనగిరి
సం/- అదనపు కలెక్టర్ (ఆర్), యాదాద్రి భువనగిరి
సం/-. జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి

DIPR RO.NO: 399/LA/PP/Advt/Pub/2026-27



తెలంగాణ ప్రభుత్వం
జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయము-భద్రాద్రి కొత్తగూడెం

ఆర్.సి.నెం. 2067/B6/Tenders/KGBVs & URS/TSS/2026-27, తేది: 03.07.2026

షార్టు టెండర్ ప్రకటన

2026-27 విద్యా సంవత్సరమునకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నడుపబడుచున్న (14) కె.జి.బి.విలు మరియు (1) అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల (URS) పాఠశాలలకు కూరగాయలు, పండ్లు, చికెన్ మరియు మటన్ సరఫరా చేయుటకు ఆసక్తి గల అభ్యర్థుల నుండి సీల్డు టెండరు దరఖాస్తులు తేది. 11-07-2026 లోపు కోరబడుచున్నవి. వివరములు ఈ దిగువ చూపబడినవి.

క్రమ సంఖ్య, అంశము, దరఖాస్తు మరియు షెడ్యూల్ కొరకు చెల్లించవలసిన పైకము, ధరావత్తు సొమ్ముగా చెల్లించవలసిన పైకము, DD తీయవలసిన పేరు, దరఖాస్తులు స్వీకరించుటకు మరియు సమర్పణకు చిరునామా, అభ్యర్థుల అర్హత, ప్రాతిపదిక: 1. కూరగాయలు, పండ్లు, చికెన్ & మటన్, రూ.2000/- ఒక్కొక్క దానికి (తిరిగి ఇవ్వబడదు), రూ.10,000 & 20,000/-లు ఒక్కొక్క దానికి, సంబంధిత కేజీబీవి స్పెషల్ ఆఫీసర్‌ల పేరున, స్పెషల్ ఆఫీసర్, కేజీబీవి, సంబంధిత మండలాలకు చెందిన వారై ఉండవలెను, మండల ప్రాతిపదిక.

సీల్డ్ టెండర్ దరఖాస్తులు తేదీ. 06-07-2026 నుండి 11-07-2026 వరకు సాయంత్రం 04:30 గంటల వరకు సంబంధిత కేజీబీవిల నందు స్వీకరించబడును. గడువు దాటిన పిదప వచ్చిన దరఖాస్తులు మరియు తపాలా ద్వారా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవు.

సీల్డ్ టెండర్ దరఖాస్తులు ది.14-07-2026 న ఉదయం. 10:00గం., లకు ఐ.డి.ఓ.సి మీటింగ్ హాల్ భద్రాద్రి కొత్తగూడెం నందు శ్రీయుత జాయింట్ కలెక్టర్ మరియు చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ, వారి సమక్షంలో తెరువబడును.

టెండర్ గడువు పొడిగించుటకు మరియు రద్దు పరచుటకు జాయింట్ కలెక్టర్ మరియు చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ, ఖమ్మం గారికి అధికారం కలదు.

సం/- జిల్లా విద్యాశాఖాధికారి మరియు ఎక్స్ - అఫీషియో జిల్లా ప్రాజెక్ట్ అధికారి, సమగ్ర శిక్ష, భద్రాద్రి కొత్తగూడెం.

DIPR.No.5524-PP/CL/Advt/1/2026-27, తేది: 04.07.2026

# సమస్యలతో విద్యా సంవత్సరానికి స్వాగతం

**నాగమణీంద్ర పల్లాపు**

తెలంగాణ రాష్ట్రంలో 2026-27 విద్యా సంవత్సరం జూన్ 1 నుంచి ప్రారంభమైంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలు జూన్ 1 నుంచి ప్రారంభం కాగా, జూన్ 8 నుంచి డిగ్రీ, పీజీ కాలేజీలు ప్రారంభమయ్యాయి. జూన్ 15 నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతోపాటు అధ్యాపకుల కొరత కూడా కొనసాగుతోంది. ఈ ఏడాది ప్రత్యేకంగా పాఠశాల స్థాయి నుంచి జూనియర్ కాలేజీ వరకు విద్యార్థులందరికీ ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అందించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి పాఠశాల విద్యార్థులతోపాటు, జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా ఉదయం పూట అల్పాహారం అందిస్తోంది. అయితే ఇది రాష్ట్ర వ్యాప్తంగా ఇదేసారి కాకుండా విడతల వారీగా మొదలుపెట్టనుంది. ఇదిలా ఉంటే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాల కొరతతోపాటు టీచర్ల కొరత కూడా ఉంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో లెక్చరర్ల కొరతతోపాటు ఇప్పటి వరకు తెలుగు మీడియం విద్యార్థులకు పుస్తకాలు సైతం అందజేయలేదు. ఇక రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. ఉన్నవి 129 డిగ్రీ కాలేజీలే అయినా వాటిలో 70 శాతానికిపైగా అధ్యాపకులు లేరు. ఉన్నత విద్యా సంస్థలైన యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూనివర్సిటీల్లో 80 శాతానికి పైగా అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాకతీయ యూనివర్సిటీతోపాటు మరికొన్ని యూనివర్సిటీల్లో చాలా డిపార్ట్‌మెంట్లకు ప్రొఫెసర్లు లేరు. చివరికి హెచ్‌ఓడీలుగా అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది నుంచి మరో 22508 పైగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ క్లాసులను ప్రారంభించడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4679 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ క్లాసులను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు 24,562 ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రీ ప్రైమరీ నుంచి హైస్కూల్, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ కోర్సుల వరకు సుమారు కోటి మంది విద్యార్థులు తమ విద్యను కొనసాగిస్తున్నారు. అత్యధికంగా పాఠశాల స్థాయిలో 62లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. సర్కారు స్కూళ్లలో టీచర్ల కొరత అయోమయానికి గురిచేస్తోంది. కేంద్ర విద్యాశాఖ



విడుదల చేసిన సమగ్ర శిక్ష పీఏబీ నివేదిక రాష్ట్ర విద్యా వ్యవస్థలోని ఎన్నో అంశాలను బహిర్గతం చేసింది. రాష్ట్రంలో మొత్తం 30,057 ప్రభుత్వ స్కూల్స్ (69.7 శాతం)ఉండగా, వాటిలో చదువుతున్నది 26.29 లక్షల (35.3 శాతం) స్టూడెంట్స్ మాత్రమే. కానీ రాష్ట్రంలో ఉన్న 12,474 (28.9 శాతం) ప్రైవేటు స్కూళ్లలో 47.52 లక్షల (63.7 శాతం) మంది చదువుతున్నారు. రాష్ట్రంలోని 4,739 ప్రైమరీస్కూళ్లు ఒక్క టీచర్‌తోనే కొనసాగుతున్నాయి. అప్పర్ ప్రైమరీ లెవల్లోనూ సింగిల్ టీచర్ బడుల సంఖ్య 80 నుంచి 93కి పెరిగింది. అప్పర్ ప్రైమరీలో పీపుల్ టీచర్‌రేషియో(పీటీఆర్) 14.8 నుంచి 18.6 శాతానికి పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 11,801 ప్రైమరీ స్కూళ్లలో (60శాతం) 30 కంటే తక్కువ మంది విద్యార్థులే ఉన్నారు. ఒక్క విద్యార్థి కూడా లేని జీరో ఎన్ రోల్‌మెంట్ బడుల సంఖ్య కూడా 1,809 నుంచి 1,997కు పెరిగింది. అప్పర్ ప్రైమరీలోనూ జీరో ఎన్‌రోల్‌మెంట్ బడుల సంఖ్య 39 నుంచి 49కి చేరింది. రాష్ట్ర వ్యా



ప్తంగా 6,791 ప్రైమరీ స్కూళ్లలో 15 మంది కంటే తక్కువ మంది స్టూడెంట్లు ఉన్నారు. రాష్ట్రంలో సెకండరీ స్థాయిలో డ్రాపౌట్ రేటు గతేడాది 8 శాతం ఉండగా, ఇప్పుడు 10.5 శాతానికి పెరిగింది. ఇది జాతీయ సగటు 8.2 శాతం కంటే ఎక్కువ. బడుల్లో త్రాగునీరు, కరెంటు లాంటి సదుపాయాలు 95 శాతానికి పైగా బడుల్లో కల్పించినప్పటికీ నాణ్యమైన విద్య అందించడంలో మాత్రం రాష్ట్రం వెనుకబడే ఉందని నివేదిక ఎత్తిచూపింది. రాష్ట్రంలో ఉన్న 14 డైట్ కాలేజీల్లో మంజూరైన 286 పోస్టుల్లో ఏకంగా 151 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలు ఈ ఏడాది కూడా ఫీజుల భారాన్ని మోయక తప్పడం లేదు. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజు నియంత్రణ చట్టం వస్తుందని ఆశతో ఎదురు చూడటం.. తీరా విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి రాకపోవడంతో తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ చట్టం ఈ ఏడాది 2026-27 కూడా రాలేదు. ఫీజు నియంత్రణ చట్టం ఇప్పటి వరకు రాకపోవడంతో ఈ ఏడాది కూడా రాష్ట్రంలోని సుమారు 12 వేల ప్రైవేటు స్కూల్స్‌లో చదువుతున్న సుమారు 32 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు లక్షల్లో ఫీజులను చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రైవేటు స్కూల్స్‌కి సంబంధించి ఫీజుల వసూలులో హైదరాబాద్ నగరం దేశంలో రెండో స్థానంలో ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ తరువాత ప్రైవేటు స్కూల్స్‌లో అడ్మిషన్లకు లక్షల్లో డొనేషన్లను వసూలు చేస్తుండటమే కాకుండా.. ఏడాది ఫీజు సైతం లక్షల్లో ఉంటుంది. ఇద్దరు పిల్లలను ప్రైవేట్ స్కూల్‌లో చదివించాలంటే ఉద్యోగస్తులు తాము సంపాదిస్తున్న దాంట్లో సగానికిపైగా వారి పిల్లల ఫీజులకే ఖర్చు చేయాల్సి వస్తోంది. రాష్ట్రంలోని ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ కోసం 2017లో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రొఫెసర్ తిరుపతి రావు ఛైర్మన్‌గా కమిటీని ఏర్పాటుచేసింది. అప్పటి నుంచి ఫీజు నియంత్రణ చట్టం కోసం తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. జూన్ 1 నుంచే ప్రారంభమైన జూనియర్ కాలేజీల్లోనూ సమస్యలు నెలకొన్నాయి. ఇంటర్‌బోర్డు అనుమతి లేకుండానే రాష్ట్రంలోని 1000కి పైగా ప్రైవేటు జూనియర్ కాలేజీలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ఇంటర్ బోర్డు అనుబంధ గుర్తింపు కోసం సుమారు 1424 కాలేజీలు దరఖాస్తు చేసుకోగా వాటిలో శనివారం వరకు కేవలం 358 కాలేజీలకు మాత్రమే ఇంటర్ బోర్డు అనుమతి ఇచ్చింది. ప్రైవేటు జూనియర్ కాలేజీలకు సంబంధించి 2025-26విద్యా సంవత్సరంలో 1405 కాలేజీలకు అనుమతి ఇవ్వగా ఇపుడు 358 కాలేజీలకు మాత్రమే గుర్తింపును ఇచ్చింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో తెలుగు మీడియం బుక్స్ లేవు. ●

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు కాలేజీలకు వచ్చి ఖాళీగా కూర్చోవల్సిన పరిస్థితి ఏర్పడింది. కాలేజీలు ప్రారంభమై నెల రోజులు దాటినా ఇప్పటి వరకు తెలుగు మీడియం విద్యార్థులకు పుస్తకాలు అందజేయలేదు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వడంతో వారికి క్లాసులు కొనసాగుతుండగా.. తెలుగు మీడియం విద్యార్థులు మాత్రం ఖాళీగా కూర్చోవల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలోని 436 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండగా వాటిల్లో కొన్నింటికి మాత్రమే తెలుగు మీడియం బుక్స్ అందాయి. రాష్ట్రంలోని 85 శాతానికి పైగా ప్రభుత్వ జూనియర్ కాలేజీవిద్యార్థులకు తెలుగు మీడియం బుక్స్ ఇప్పటికీ చేరలేదు. జూన్1నుంచి కొత్త విద్యాసంవత్సరం2026-27 ప్రారంభమైంది. అప్పటినుంచివిద్యార్థులు కాలేజీలకు వస్తున్నారు. మొదటి సంవత్సరంలో ఇప్పటి వరకు సుమారు 62వేల మంది విద్యార్థులు చేరగా..వారిలో 35వేల మంది వరకు తెలుగు మీడియం విద్యార్థులున్నారు. మిగిలిన వారు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులున్నారు. ఈ ఏడాదిలో సిలబస్ కూడా మారింది. ఈ నేపథ్యంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు కొత్త సిలబస్‌తో ప్రింట్ చేసి ఇవ్వాల్సిన క్లాసులు బోధించడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్ల కొరత తీవ్రంగా ఉంది. మంజూరైన పోస్టుల్లో సుమారు 70శాతం పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. వాటిల్లో గెస్ట్ లెక్చరర్లతో పాఠాలు బోధిస్తున్నారు. యూనివర్సిటీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 11 యూనివర్సిటీల్లో 2500కిపైగా అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోనూ సౌకర్యాలతో పాటు, అధ్యాపకుల కొరత ఉంది. కొద్ది రోజులక్రితం నేషనల్ మెడికల్ కౌన్సిల్ ..ప్రభుత్వమెడికల్ కాలేజీల్లో ఉన్న లోపాలను సరిచేసుకోవాలని సూచించింది. ఈనేపథ్యంలో ఈ ఏడాది కూడా విద్యార్థులకు సమస్యలతోనేస్వాగతంపలికింది.

# రెండో సమరం!

తమిళనాడు

**ఎ.వి.వి ప్రసాద్**

మొదటి 50 రోజులు‘విజయ్’వంతమయ్యాయి. అదే సమయంలో రెండో యుద్ధంకూడా మొదలయింది. మే10 న సిఎంగా ప్రమాణం చేసే వరకు విజయ్ సాగించిన సమరం మొదటిదైతే, ప్రభుత్వాన్ని కాపాడుకోవడం కోసం చేస్తున్న సమరం రెండోది. అది ఇప్పుడు కీలక దశకు చేరుకొంది. మొదటి యుద్ధానికి విజయ్ ‘ఇమేజ్’ సహకరిస్తే,రెండో యుద్ధం ఆయనసామర్థ్యానికి పరీక్షగా నిలుస్తోంది. ‘ద్రవిడ’ రంగు, రుచి, వాసన లేని పార్టీగా విజయ్ ‘తమిళ వెట్రి కజగం (టివికె) పేరు తెచ్చుకొన్నా, దాదాపుఆరు దశాబ్దాల ద్రవిడ పార్టీల పాలనకు టివికె స్వస్తి పలికినా ఆ పార్టీలోకి వచ్చి చేరుతున్నవారంతా ద్రవిడ పార్టీల మూలాలున్నవారే అన్నది గమనించాల్సిన విషయం. ప్రభుత్వంలో ఉన్నచిన్న, పెద్ద అధికారులందరు కూడా రెండు ప్రధాన ద్రవిడ పార్టీలలో ఏదో ఒకదానికి మద్దతుదారులే. వారికి రుచించని విజయ్ విధానాలుచాలానే కనిపిస్తున్నాయి. మొదటి సారి ముఖ్యమంత్రి కావడం, తాను ప్రారంభించిన పార్టీని మొదటి సారి అధికారంలోకి తేవడంతో ఆ ప్రత్యేకత కనిపించేలా గత నెలన్నర రోజుల్లో విజయ్‌చాలా పథకాలే ప్రకటించారు. అదే సమయంలోనిత్యం తన ప్రభుత్వాన్ని కాపాడుకోవలసిరావడం కూడా అనివార్యమైంది.ఒక వంక రాష్ట్రంలో పాతుకుపోయిన డిఎంకె, అన్నాడిఎంకెలు విజయ్‌ని సిఎం పదవి నుంచి తప్పించడానికి యథాశక్తి ప్రయత్నిస్తున్నాయి. ఇటీవలి ఎన్నికల్లో డిఎంకె ఓడిపోవడంతో పాటు అధిపతి అయిన స్టాలిన్ కూడా ఓడిపోవడం ఆ పార్టీ నేతలకు ఎంత మాత్రం మింగుడు పడటం లేదు. దానితో విజయ్ వైపు నుంచి ఏ చిన్న అవకాశం దొరికినా దానిని ఉపయోగించుకోవాలని డిఎంకె చూస్తోంది. స్టాలిన్ తదనుగుణమైన వ్యాఖ్యలు పలుమార్లు చేశారు కూడా.విజయ్ ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు దగ్గర పడుతున్నాయనీ, రాజకీయఅనుభవం లేని విజయ్ సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపలేడనీ స్టాలిన్ సందర్భం దొరికినప్పుడల్లా బాహాటంగానే విమర్శిస్తున్నారు. దానికి నిదర్శనమా అన్నట్లు విజయ్ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర ఒకటి గత వారం వెలుగులోకి వచ్చి పెనుసంచలనం సృష్టించింది. టివికె ప్రభుత్వం పడిపోయినట్లే కొన్ని తమిళ పత్రికలు ప్రచారం చేశాయి. గతనాలుగు రోజులుగా తమిళ మీడియా విజయ్‌భవిష్యత్తుపై భిన్న కథనాలను కుప్పతెప్పలుగా వండి వడ్డిస్తున్నాయి. టివికె పార్టీకి చెందిన పదిమంది ఎమ్మెల్యేలకు రూ.35కోట్ల చొప్పున ప్రత్యర్థి వర్గంఎర వేసిందనీ, ‘డీల్’ దాదాపు ఖరారైన సమయంలో అది బయటపడిందనీ అంటున్నారు. దానితో తమిళరాజకీయం హఠాత్తుగా కొత్త మలుపు తిరిగింది. ఆ పదిమందిలో ఏడుగురు గోడదూకడానికి సిద్ధమయ్యారనీ, ప్లాన్ ప్రకారం జరిగి ఉంటే విజయ్ ప్రభుత్వం కూలిపోయి ఉండేదనీ ప్రచారమవుతోంది. ఆఎత్తుగడను ఇంటెలిజెన్స్ వర్గాలు సకాలంలో గుర్తించడం వల్ల బాగోతం బయటపడింది. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేయడంతో పరిణామాలు మరింత ఆసక్తికరంగా మారాయి. అరెస్టయిన ఆఐదుగురు డిఎంకె మాజీమంత్రి సెంథిల్ బాలాజీ అనుచరులని తేలడంతో కుట్ర ఎక్కడినుండి మొదలయిందో అందరికీ అర్థమైంది. ఓ యూట్యూబర్‌ను కూడా అరెస్టు చేసి పోలీసులు ‘ఇంటరాగేట్’ చేయడంతో ఇంకా చాలా విషయాలు వెలుగులోకి వచ్చాయి. టివికె ఎమ్మెల్యే ఇళయరాజా, మరికొందరు ఎమ్మెల్యేలతో డిఎంకె అధిష్ఠానం నిరంతరం ‘టచ్’లో ఉందనీ, అందుకే స్పీకర్‌కు వ్యతిరేకంగా ఓటింగ్‌లో పాల్గొనవలసిందిగా వారిని కోరారనీ తెలుస్తోంది. స్పీకర్ వ్యతిరేక తీర్మానాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వాన్ని కూల్చాలనే విపక్ష సంకల్పం ఆఖరి దశలోబెడిసికొట్టింది. విజయ్ కూడా ‘కొనుగోళ్ల’ దారిలోనేవెళ్తున్నారనీ, డిఎంకె, మరికొన్ని పార్టీలలోని ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకొనే పనిలో నిమగ్నమయ్యారనీ అంటున్నారు. కొందరు విపక్ష ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి తిరిగి టివికె నుంచి పోటీ చేయించే వ్యూహం రూపొందించారనీ, అందుకు భారీగా ఖర్చుచేయడానికి కూడా సిద్ధమయ్యారనీ చెబుతున్నారు. ఆ విధంగా సొంతంగా పూర్తి మెజారిటీ సాధించే ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది.అయితే ఉన్నత స్థాయి అధికారులలో అధిక శాతం డిఎంకె మద్దతుదారులు కావడంతో వారిని తన దారిలోకి తెచ్చుకోవడం విజయ్‌కి పెద్ద తలనొప్పిగా ఉన్నదని పార్టీవర్గాలు అంటున్నాయి. ముఖ్యమంత్రి, మంత్రులు ఎన్ని ప్రకటనలు చేసినా క్షేత్రస్థాయిలో వాటినిఅమలు చేసేది అధికార వర్గమే గనుక వారిని తనవైపుతిప్పుకొనడానికి విజయ్ చాలా కష్టపడవలసి వస్తోందనే అంటున్నారు. ఇటువంటి సవాళ్లు పెరుగుతుండగా, గత శుక్రవారం విజయ్ ప్రభుత్వానికి గవర్నర్ తో కూడా ఢీకొనే పరిస్థితి ఎదురుకావడం మరో ఆసక్తికర పరిణామం. గవర్నర్ అర్లేకర్ మదురైలో సీనియర్ అధికారులతో సమీక్ష జరపడం ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారింది. దానిపై మంత్రి నిర్మల్ కుమార్ ఘాటుగా స్పందించడం, మరికొందరు మంత్రులువంతపాడడం ఇప్పుడు ప్రభుత్వాన్ని ఓ కుదుపు కుదుపుతోంది. ప్రభుత్వ విభాగాల పనితీరుపై గవర్నర్ సమీక్ష జరపడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. మంత్రివన్ని అరసు చేసిన విమర్శలు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. సిపిఐ వంటి పార్టీలు కూడా రంగంలోకి దిగడంతో కొత్త వివాదం మరింతగా రాజుకొంటోంది. విజయ్‌కి ఇది నిజంగానే కొత్త తలనొప్పి అనే చెప్పాలి. విజయ్ ప్రభుత్వం ప్రమాణ స్వీకార సమయంలో ముప్పుతిప్పలు పెట్టిన గవర్నర్ ఇప్పుడు కొత్త వివాదానికి కారణమవడం చూస్తే లోక్‌భవన్ నుంచి కూడా విజయ్‌కి ముందుముందు సవాళ్లు ఎదురుకావొచ్చని అర్థమవుతుంది. ఈ రెండో సమరంలో విజయ్ సక్సెస్ కావడం ఆయన వ్యూహరచనపై ఆధారపడి ఉంటుంది. ముందు ముందు సంభవించే పరిణామాలు ఇంకెంత ఆసక్తికరంగా ఉంటాయో దీనిని బట్టే అర్థమవుతోంది. ●



ముఖ్యమంత్రి విజయ్

# మాతృభూమికి ‘అవామీ’ అధినేత!

బంగ్లాదేశ్

**గన్ని మోహన్**

రెండేళ్లుగా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్‌మాజీ ప్రధాని షేక్ హాసీనా ఎంతో సాహసోపేతమైన నిర్ణయాన్నే తీసుకున్నారు. ఈ ఏడాదే తాను స్వదేశానికి వెళతానని, బంగ్లా ప్రజల శ్రేయస్సుతోపాటు తన సొంతపార్టీ అవామీ లీగ్ కేడర్ సంరక్షణ కూడా తన బాధ్యత అనిచెపుతున్నారు. చావుకు తాను భయపడేదిలేదని, స్వదేశానికి వెళ్లాలన్నదే తమ అభిమతమని ఈ వారంలో ప్రకటించారు. బంగ్లాదేశ్‌లో కాందిశీకుల రిజర్వేషన్ల నుంచి మొదలైన ఉద్యమంతో ముస్లిం ప్రజానీకం ముస్లిమేతరులు, మైనార్టీలపై దాడులకు పూనుకోవడం, ఆస్తులు విధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఎంత కట్టడి చేసినప్పటికీ హాసీనా హయాంలో ఈ ఉద్యమం పాక్‌ప్రేరేపిత ఉద్యమంగానే ముద్రపడింది. ప్రత్యేకించి భారత్ నుంచి బంగ్లాదేశ్‌ను వేరుచేసే లక్ష్యంతోనేహాసీనా ప్రభుత్వాన్ని కూలదోశారన్నది అక్కడి మైనార్టీల వాదన. అంతేకాకుండా అమెరికా పరోక్షంగా తనను పదవీచ్యుతి చేసేందుకు కుట్రలుచేసిందని పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ వల్లెవేసినమాటలనే హాసీనా కూడా చెప్పుకొచ్చారు. ఏదైతేనేమిరెండేళ్ల క్రితం నిర్బంధ రాజీనామాతో ఆమె అత్యవసరంగా దేశాన్ని వీడి భారత్‌లో ఆశ్రయంపొందుతున్న సంగతి తెలిసిందే. తదనంతరం వచ్చిన నోబెల్ పురస్కార గ్రహీత మహ్మద్ యూనస్ నేతృత్వంలోని కేర్‌టేకర్ ప్రభుత్వం ఆమెను, ఆమె పార్టీని ఎంతగా ఇబ్బందులు పాలుచేయాలో అంతగాను చేసింది. ఈ రెండేళ్ల కాలంలో హాసీనా పార్టీ కేడర్ నాయకులు నిర్బంధాలకు గురయ్యారు. వందలాది మందిని జైలుపాలు చేసారు. పార్టీ కేడర్ ఛిన్నాభిన్నం అయింది. ఈలోపు అనుకోకుండా వచ్చిన ఎన్నికల్లో ఆమె ప్రత్యర్థి పార్టీ బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ బిఎన్‌పి విజయం సాధించడం మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిక్ అన్వర్ లండన్‌లోని తన ప్రవాసం నుంచి వచ్చి ఎన్నికల్లో పోటీచేసి గెలవడం ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం వంటివి చకచకా సాగిపోయాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే హాసీనా ఇప్పుడు హఠాత్తుగా తన స్వదేశం వెళతానని తెగేసి ప్రకటించడం వెనుక జరిగిన హఠాత్పరిణామాలేమిటన్న అంశంపైనే ఇప్పుడు ఎక్కువ చర్చలు సాగుతున్నాయి. భారత్ నుంచి ఒత్తిడి పెరుగుతోందా? లేక బంగ్లా ప్రభుత్వం ఆమెను అప్పగించాలని అంతర్జాతీయంగా భారత్‌పై ఒత్తిడిని పెంచుతుందా అన్నది ఒక అంచనా అయితే మరోవైపు అక్కడి స్థానిక ఎన్నికల్లో హాసీనా పార్టీ అవామీ లీగ్‌కు పట్టు పెరుగుతున్నదని తెలుస్తోంది.దీనికితోడు నిషేధం ఉన్నప్పటికీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆమె పార్టీ రివ్వున ఎగిసి పడుతోంది. స్థానిక ఎన్నికల్లో మంచి పట్టుకూడా వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా తారిక్ రెహమాన్ ప్రభుత్వం అవామీ లీగ్ పార్టీని స్థానిక ఎన్నికల్లో పోటీకి అనుమతించింది.అయితే వారు పార్టీ గుర్తుపై కాకుండా స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేయాలని షరతులు విధించింది. బంగ్లాదేశ్ ప్రజలకున్న రాజకీయ హక్కులు, దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ, శాంతి భద్రతలు, విముక్తి పోరాటం స్ఫూర్తిని కొనసాగించేందుకే తాను బంగ్లాదేశ్‌కు తక్షణమే వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు బాహాటంగానే హాసీనావైఖరి ఉత్కంఠ కలిగిస్తోంది. యూనస్ సర్కార్ హయాంలో మానవాళిపై ఆమె పార్టీ ప్రభుత్వం హయాంలో నిర్వహించిన నేరాలకు సంబంధించి ఆమెకు మరణశిక్ష విధిం చిన వైనాన్ని అటు బిఎన్‌పి, ఇటు జమాత్ ఇస్లామి పార్టీలు ఆమెను హెచ్చరిస్తున్నాయి. వీటికితోడు అనేక కేసులు ఆమెపై కోర్టుల్లో విచారణకు సిద్ధంగా ఉన్నాయి. వీటిపై స్పందించిన హాసీనా 1975లోనే నా తల్లితండ్రులు, సోదరులు ఇంచుమించు మొత్తం కుటుంబాన్ని పోగొట్టుకున్నానని, తనపై హత్యాయత్నాలు కూడా జరిగాయని ఆమె గుర్తుచేసారు. తనను అంతం చేసేందుకు అనేక కుట్రలు జరిగాయని, ప్రతి కుట్రను భగ్నం చేసామని ఆమె చెపుతున్నారు. బంగ్లాదేశ్ ప్రజలవైపు తాను ఉన్నందువల్లనే వారి ఆశీస్సులే తనను రక్షించాయని చెపుతున్న హాసీనా ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో తన పార్టీ కేడర్ పోటీ చేసేవిధంగా వారిలో మరింత నైతిక స్థైర్యం నింపేందుకే బంగ్లాదేశ్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. బిఎన్‌పి సర్కారు, యూనస్ కేర్‌టేకర్ సర్కారుపై ఆమె లెక్కలేనన్ని విమర్శలుచేసారు. ఇన్నీ ఆమె చెప్పేందుకు సజావుగానే ఉన్నప్పటికీ బంగ్లాదేశ్‌లో కాలుపెట్టిన వెంటనే ఆమెను అరెస్టు చేయకుండా ఉంటారా? పెండింగ్ కేసులను విచారణ షురూ చేయకపోతారా అన్నదే ఇప్పుడు ఆమె కేడర్‌లో నలుగుతున్న ప్రధాన చర్చ. అన్నింటికంటే ప్రధానంగా అత్యున్నత న్యాయస్థానం యూనస్ హయాంలో ఆమెకు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఈ కేసు ఇప్పుడు ఎటువెళుతుంది. తారిక్ అన్వర్ ప్రభుత్వం ఈకేసులను కొట్టివేస్తుందా? అంతర్జాతీయ సమాజం తారిక్ సర్కార్‌పై ఒత్తిడి పెంచుతుందా? అన్నదే తేలాల్సి ఉంది. అటు చైనా, ఇటు పాకిస్థాన్‌లవైపే మొగ్గుచూపిస్తున్న తారిక్ అన్వర్ ప్రభుత్వ ధోరణులు చూస్తుంటే చైనా చెప్పినట్లు చేసేందుకు తారిక్ అన్వర్ ప్రభుత్వం తలూపుతున్నదనే భావన రాజకీయ నిపుణుల్లో వ్యక్తం అవుతోంది. అదే జరిగితే భారత్ ఉపేక్షించే పరిస్థితులు ఎంతమాత్రం ఉండవు. తారిక్ అన్వర్ ప్రభుత్వం అంతర్జాతీయంగా తమపై ఒత్తిడి పెంచేందుకే హాసీనా వ్యూహాత్మక జిమ్మికులకు పాల్పడుతున్నట్లు చెప్పుకొచ్చినా హాసీనా బంగ్లాదేశ్‌లో తిరిగి కాలుమోపడం మాత్రం ఖాయం అన్నది ఖరారయిపోయింది. అపుడు బంగ్లాదేశ్‌లో అవామీ లీగ్‌పార్టీ నేతలు, కేడర్‌కు కొత్త చైతన్యం వచ్చినట్లవుతుంది. అయితే నిషేధం కొనసాగుతున్న తరుణంలో హాసీనా బంగ్లాదేశ్‌కు వెళ్లి ఎలా నెగ్గుకు రాగలరన్నదే ఇప్పుడు అంతుబట్టని ప్రశ్న.అలాగే శిక్షలు పడిన కేసులనుంచి ఆమె ఎలా తప్పించుకోగలరన్నదే మిలియన్‌డాలర్ల ప్రశ్నగా మారుతోంది. ●



షేక్ హాసీనా

# ఐరోపా హీట్ డోమ్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తాజా హెచ్చరిక

**డి జె మోహన రావు**

ఐరోపాను కమ్మేసిన ఈ అసాధారణ వేడి మరో సాధారణ వేసవి కాదు. వాతావరణ మార్పు ఇకపై పర్యావరణ సమస్య మాత్రమే కాదని, అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ వాణిజ్యం, ప్రజారోగ్యం, వలసలు, భద్రతను ఒకేసారి ప్రభావితం చేసే సంక్షోభంగా మారిందని ఈ హీట్‌డోమ్ స్పష్టం చేస్తోంది. ఐరోపా ప్రస్తుతం తన ఆధునిక చరిత్రలోనే అత్యంత తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటోంది. సాధారణంగా ఆహ్లాదకరమైన వేసవులకు పేరుగాంచిన స్పెయిన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, హంగేరీ వంటి దేశాల్లో జూన్, జులై నెలల్లోనే ఉష్ణోగ్రతలు 40నుంచి 45డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. ఈ అసాధారణ పరిస్థితికి కేంద్రబిందువుగా నిలిచింది హీట్ డోమ్ అనే వాతావరణ వ్యవస్థ. శాస్త్రీయంగా చూస్తే హీట్ డోమ్ అనేది ఒక ప్రాంతంపై బలమైన అధిక పీడన వ్యవస్థ చాలా రోజుల పాటు స్థిరంగా కొనసాగడం వల్ల ఏర్పడే పరిస్థితి. ఈ అధిక పీడన మండలం ఒక మూతలా పనిచేసి భూమి నుంచి పైకి వెళ్లే వేడి గాలిని బయటకు వెళ్లనివ్వదు. బదులుగా ఆ గాలిని మళ్లీ కిందికి నొక్కడం వల్ల వేడి నిరంతరం పేరుకుపోయి ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతాయి. అదే సమయంలో మేఘాల అభివృద్ధి, వర్షపాతం కూడా అణచివేయబడతాయి. సహారా ఎడారి నుంచి వచ్చే వేడి గాలులు చేరితే పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. ఇలాంటి హీట్ డోమ్‌లు ఏర్పడటానికి ఎగువ వాయుమండలంలో ఏర్పడే ఒమేగా బ్లాక్ అనే స్థిరమైన గాలి ప్రవాహ నమూనా కూడా ప్రధాన కారణాల్లో ఒకటిగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈప్రభావం పగటిపూటకే పరిమితం కావడం లేదు. అనేక ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 20డిగ్రీల సెల్సియస్ కంటే దిగువకు పడిపోకపోవడంతో ట్రాపికల్ నైట్స్ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అంటే సూర్యాస్తమయం తర్వాత కూడా చల్లదనం లేకుండా ఉక్కపోత కొనసాగుతోంది. ప్రపంచ సగటుతో పోలిస్తే ఐరోపా దాదాపు రెండు రెట్లు వేగంగా వేడెక్కుతోంది. అందువల్ల ఇలాంటి తీవ్ర ఉష్ణోగ్రత ఘటనలు మరింత తరచుగా, మరింత తీవ్రంగా నమోదవుతున్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఐరోపాలో ఈపరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారడానికి అక్కడి భౌగోళిక పరిస్థితులు, మౌలిక సదుపాయాలే ఒక కారణం. అక్కడి భవనాలు తీవ్రమైన చలిని తట్టుకునేలా నిర్మించబడటంతో వేసవిలో వేడిని బయటకు పంపకుండా లోపలే నిల్వ చేస్తాయి. పగటిపూట రహదారులు, కాంక్రీటు నిర్మాణాలు, పట్టణ ప్రాంతాలు గ్రహించిన వేడిని రాత్రిపూట కూడా విడుదల చేస్తుంటాయి. ఫలితంగా ప్రజలకు ఉపశమనం లభించడంలేదు. వృద్ధులు, చిన్నపిల్లలు, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్నవారిపై దీని ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. తీవ్ర ఉష్ణోగ్రతలు అదనపు మరణాల ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతున్నాయని ప్రజారోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పుల మరో కీలక ప్రభావం క్లైమేట్ మైగ్రేషన్. ఉత్తర ఆఫ్రికా, మధ్య ప్రాచ్యదేశాల్లో తీవ్రమైన వేడి, నీటి కొరత, వ్యవసాయ సంక్షోభం మరింత పెరిగితే లక్షలాది మంది ఐరోపావైపు వలస వెళ్లేపరిస్థితులు ఏర్పడవచ్చు.ఇది ఇప్పటికే సవాలుగా మారిన వలస సమస్యను మరింత తీవ్రతరం చేయడంతో పాటు రాజకీయ, సామాజిక, భద్రతాపరమైన ఒత్తిడిని పెంచే అవకాశంఉంది. ఆర్థికంగా కూడా ఈ ప్రభావం తీవ్రమైనదే. దీర్ఘకాలం కొనసాగే హీట్‌డోమ్ నిర్మాణ, తయారీ, బహిరంగ పనుల రంగాల్లో ఉత్పాదకతను గణనీయంగా తగ్గిస్తుంది. కరువు పరిస్థితులు ఏర్పడితే రైన్, డాన్యూబ్ వంటి ప్రధాననదుల్లో నీటి మట్టాలు తగ్గి జలరవాణాకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో రవాణా వ్యయాలు పెరిగి పరిశ్రమలపై ప్రభావం పడుతుంది. వ్యవసాయ దిగుబడులు తగ్గి ఆహార భద్రతపై ఒత్తిడి పెరుగుతుంది. శీతలీకరణ అవసరాలు పెరగడంతో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోంది. కొన్ని



ప్రాంతాల్లో తీవ్ర వేడికి రైల్వేపట్టాలు వంగిపోవడం, అడవుల్లో కార్చిచ్చులు చెలరేగడంవల్ల రవాణా, పర్యాటక రంగాలు కూడా దెబ్బతింటున్నాయి. ఇది ఇక ఐరోపాకు మాత్రమే పరిమితమైన వాతావరణ ఘటన కాదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఇంధన భద్రత, అంతర్జాతీయ వాణిజ్యం, సరఫరా గొలుసులపై ప్రభావం చూపుతున్న ప్రపంచస్థాయి సవాలుగా మారింది. ఐరోపాలో పారిశ్రామిక ఉత్పత్తి మందగిస్తే రసాయనాలు, యంత్రాలు, ఆటోమొబైల్ విడిభాగాల ప్రపంచ సరఫరా దెబ్బతింటుంది. గోధుమలు, ఆలివ్ ఆయిల్, వైన్ వంటి వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులు తగ్గడం ప్రపంచ ఆహార ధరలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఐరోపా సమాఖ్య భారత్‌కు మూడో అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. 2025లో ఇరుపక్షాల మధ్య వస్తువుల వాణిజ్య విలువ సుమారు12.74 లక్షల కోట్లకు చేరింది. అందువల్ల అక్కడి వాతావరణ సంక్షోభం భారత్‌పై కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఐరోపాలో పారిశ్రామిక ఉత్పత్తి, వినియోగం మందగిస్తే భారతదేశం నుంచి ఎగుమతి అయ్యే వస్త్రాలు ఇంజినీరింగ్ ఉత్పత్తులు, రసాయనాలు, ఆటోమొబైల్ విడి భాగాలు, రత్నాలు, ఆభరణాలకు డిమాండ్ తగ్గవచ్చు.నౌకాశ్రయాలు, అంతర్గత జల మార్గాలు, రైల్వేలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు ఏర్పడితే భారత ఎగుమతులు ఆలస్యమవడంతో పాటు రవాణా వ్యయాలు పెరిగి ఎగుమతిదారుల పోటీతత్వం దెబ్బ తినే అవకాశంఉంది. అయితే ఈ సంక్షోభం కొన్ని అవకాశాలను కూడా సృష్టిస్తుంది. ఐరోపాలో వ్యవసాయ దిగుబడులు తగ్గితే ఆహార దిగుమతుల అవసరం పెరుగుతుంది. దీనిని భారత్ వ్యవసాయ ఉత్పత్తులు, సముద్ర ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతులను విస్తరించుకునే అవకాశంగా మలుచుకోవచ్చు. అయితే ఇందుకు ఐరోపా నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు, ఆహార భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. మరోవైపు, తక్కువ కార్బన్ ఉద్గారాలతో తయారైన ఉత్పత్తులకు ఐరోపా మరింత ప్రాధాన్యం ఇస్తోంది. ఇందుకోసం కార్బన్‌బోర్డర్ అడ్జస్ట్మెంట్ మెకానిజం అమలు చేస్తోంది. అధిక కార్బన్ ఉద్గారాలతో తయారైన దిగుమతి ఉత్పత్తులపై అదనపు కార్బన్ వ్యయాన్ని విధించే ఈ విధానం వల్ల భారతీయ ఉక్కు, అల్యూమినియం, సిమెంట్ వంటి ఉత్పత్తుల ఎగుమతుల వ్యయం పెరిగే అవకాశంఉంది. అందు వల్ల భారత పరిశ్రమలు గ్రీన్‌టెక్నాలజీ, ఇంధన సామర్థ్యం, తక్కువకార్బన్ ఉత్పత్తి విధానాల వైపు వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. ఈ కోణంలో చూస్తే, ఐరోపా హీట్ డోమ్ భారత్‌కు ఒక హెచ్చరిక మాత్రమే కాదు, గ్రీన్ తయారీ ద్వారా ప్రపంచ మార్కెట్లో కొత్త అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశాన్ని కూడా కల్పిస్తోంది. హీట్ డోమ్‌లు సాధారణంగా వాతావరణ ప్రసరణలో మార్పులు వచ్చిన తర్వాతే బలహీనపడతాయి. 2003, 2022, 2023 హీట్‌వేవ్‌ల నుంచి పాఠాలు నేర్చుకున్న ఐరోపా దేశాలు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, కూలింగ్ సెంటర్లు, హీట్ యాక్షన్ ప్లాన్‌లు, ప్రజారోగ్య చర్యలను బలోపేతం చేశాయి. అయినప్పటికీ, గ్లోబల్‌వార్మింగ్ కొనసాగుతున్న నేపథ్యంలో ఇటువంటి తీవ్రమైన ఉష్ణోగ్రత ఘటనలు మరింత తరచుగా, మరింత కాలం కొనసాగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఐరోపాలో కనిపిస్తున్న ఈ హీట్ డోమ్ ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. వాతావరణ మార్పును ఇకపై పర్యావరణ సమస్యగా మాత్రమే చూడలేం. ఇది ప్రపంచ ఆర్థికవ్యవస్థ, ఆహార భద్రత, ఇంధన విధానం, అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడులు, వలసలు, జాతీయ భద్రతలను ఒకేసారి ప్రభావితం చేసే బహుముఖ సంక్షోభంగా మారింది. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడం, వాతావరణ అనుకూల మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెంచడం, దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం ఇకపై ఒక ఎంపిక కాదు. ప్రపంచ భవిష్యత్తుకు అత్యవసర అవసరం. ●

# సంక్షోభ వేళ.. సరైన నిర్ణయాలు

**• ఇంధన సమస్యలను జాగ్రత్తగా పరిష్కరించాం.. • పశ్చిమాసియా యుద్ధ ప్రభావాన్ని తగ్గించాం: ప్రధాని మోడీ**

**జోద్‌పూర్,జులై 4:** ప్రపంచ ఇంధన సంక్షోభ సమయంలో ఆచరణాత్మక, విధానపరమైన, దౌత్యపరమైన స్థాయిలలో భారతదేశం తీసుకున్న సున్నితమైన, దూరదృష్టితో కూడిన నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయని ప్రధాని మోడీ అన్నారు. ఈ చర్యలు దేశాన్ని ఒక పెద్ద సంక్షోభం నుండి కాపాడటంలో కీలక పాత్ర పోషించాయి. భారతదేశం తన ఎల్‌పిజి అవసరాలలో సుమారు 60 శాతాన్ని దిగుమతి చేసుకుంటుంది, మరియు ఈ దిగుమతి చేసుకున్న ఎల్‌పిజిలో అధిక భాగం గల్ఫ్ దేశాల నుండి వస్తుంది. పశ్చిమ ఆసియాలో యుద్ధం సరఫరాలకు అంతరాయం కలిగించే ప్రమాదం ఏర్పడింది, ఇది దేశంలో తీవ్రమైన సంక్షోభానికి దారితీసే అవకాశం ఉంది.

**సంక్షోభ సమయంలో ఎల్‌పిజి ఉత్పత్తిలో పెరుగుదల**

మధ్యప్రాచ్య యుద్ధాన్ని ప్రస్తావిస్తూ, ఏప్రిల్ నుండి జూన్ మధ్య కాలంలో పెట్రోల్, డీజిల్ కంపెనీలు మాత్రమే 75 వేల కోట్ల నష్టాన్ని చవిచూశాయని ప్రధాని మోడీ అన్నారు. రాజస్థాన్‌లోని బలోత్రాలో పచ్‌పద్ర రిఫైనరీని ప్రారంభించిన అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఘనత సాధించినందుకు రాజస్థాన్‌ను అభినందిస్తూ, దేశం దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ఇంధన సంక్షోభం పరిష్కారం కోసం ఎదురుచూపులు ఇప్పుడు ముగిశాయని



ఆయన అన్నారు. దేశానికి అవసరమైన 90 ఎల్‌పిజి హోర్ముజ్ జలసంధి ద్వారా వచ్చేది. అకస్మాత్తుగా, యుద్ధ పరిస్థితులు ఈ సరఫరాను నిలిపివేశాయి. కానీ, సవాళ్లను ఎదుర్కోవడం రాజస్థాన్ గడ్డ మనకునేర్పింది. సంక్షోభం ప్రారంభమైన వెంటనే మేము రిఫైనరీపై దృష్టి సారించాము. ఈ మొత్తంతో ఒక రిఫైనరీని నడపవచ్చు. ఏడు రోజుల్లోనే ఎల్పీజీ ఉత్పత్తి పెరిగింది. గతంలో ఉత్పత్తి 35వేల మెట్రిక్ టన్నులు ఉండగా, సంక్షోభ సమయంలో అది 54వేల మెట్రిక్ టన్నులకు పెరిగిందని, గతంలో ఎల్పీజీని ఉత్పత్తి చేయని రిఫైనరీలు కూడా ఉత్పత్తిని ప్రారంభించాయని గుర్తుచేసారు. దాదాపు 11 లక్షల ఇళ్లకు పిఎన్‌జీ కనెక్షన్లు కూడా అందించబడ్డాయి. 54 వేల మంది యువతకు నియామక పత్రాలు అందజేశారు.

ఈ సమావేశంలో ఆయన రాజస్థాన్‌కు చెందిన సుమారు 54వేల మంది యువకులకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను కూడా అందజేశారు. నియామకాలు పొందిన యువకులందరినీ అభినందిస్తూ, ఈ అవకాశం వారి ఉజ్వల భవిష్యత్తుకు కొత్త బలాన్ని ఇస్తుందని, రాష్ట్ర అభివృద్ధిలో వారు కీలక పాత్ర పోషిస్తారని ప్రధానమంత్రి అన్నారు.



## నా వార్తలే చదువుతా..

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, జులై 4:** తాను ఖాళీ సమయాల్లో ఎక్కువగా వార్తాపత్రికలే చదువుతానని, అందులోనూ తన గురించి వచ్చిన కథనాలే చూస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. 'స్టోరీ టైమ్ విత్ సెకండ్ లేడీ' పేరిట అమెరికా ఉపాధ్యక్షుడి సతీమణి ఉషావాన్స్ హోస్ట్ చేసిన పాడ్‌కాస్ట్‌లో అధ్యక్షుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైట్‌హౌస్ హిస్టారికల్ అసోసియేషన్ ప్రచురించిన 'ప్రెసిడెంట్స్ ప్లే!' పుస్తకాన్ని చదివి వినిపించారు. అందులో ప్రస్తావించిన మాజీ అధ్యక్షుల ఆసక్తుల గురించి పేర్కొన్నారు. వైట్‌హౌస్ ప్రాంగణంలో నిర్మిస్తోన్న బాల్‌రూమ్ గురించి మాట్లాడారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సం (జులై 4) సందర్భంగా ఈ పాడ్‌కాస్ట్ విడియోను ఉష ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ఈ 'ప్రెసిడెంట్స్ ప్లే!' పుస్తకంలో ఒక అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో సూపర్ బౌల్ (యేటా జరిగే ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్) లైవ్ చూసిన ఫొటోను పొందుపర్చారు. ఆదృశ్యాన్ని ట్రంప్ ఈ పాడ్‌కాస్ట్‌లో చూపిస్తూ.. 'ఇది చూస్తే నాకు ఒక ఐడియా వచ్చింది. ఫుట్‌బాల్ చూసేందుకు బరాక్ ఒమాబా, జో బైడెన్, బుష్ కుటుంబాలను ఆహ్వానిస్తే బాగుంటుందేమో. ప్రెసిడెంట్స్ రీయూనియన్ మాదిరిగా ఉంటుంది. అదే జరిగితే ప్రెస్ హోరెత్తుతుందేమో' అని సరదాగా అన్నారు. అమెరికాకు అధ్యక్షులుగా పనిచేసిన వారు ఖాళీ సమయంలో ఏమి చేసేవారో ట్రంప్ వెల్లడించారు. 'మామూలుగా ఒక అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో గడిపే సమయం చాలా తక్కువ. ప్రజల కోసం పనిచేస్తాం కాబట్టి అక్కడ ఉండటం ఒక గౌరవం. బిల్‌క్లింటన్ తన కోసం నిర్మించిన ట్రాక్‌పై జాగింగ్ చేసేవారు. ఈ విషయం నాకు ఇటీవలే తెలిసింది. నేనైతే అలా చేయలేను అనుకుంటా. క్లింటన్ మంచి మనిషి ఆయనంటే నాకు ఇష్టమే' అంటూ కొనియాడారు.



## ఎప్పటికీ జరగని పెళ్లికి టికెట్ బుక్‌చేయాలా?

### సియాగోయల్ స్నాప్‌చాట్‌పై పోలీస్ దర్యాప్తు

**పుణె,జులై 4:** పుణే వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసు దర్యాప్తు ముందుకెళుతున్న కొద్దీ విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితురాలు సియా గోయల్‌కు చెందినట్లు చెబుతున్న స్నాప్‌చాట్ చాటింగ్ ఇప్పుడు కీలకంగా మారింది. ఎప్పటికీ జరగని పెళ్లికోసం టికెట్ బుక్ చేయాలంటే నీ ఆధార్ కార్డు పంపు అంటూ సియా తన స్నేహితురాలికి మెసేజ్‌పంపినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఈ చాట్ నిజమైనదేనా? హత్యకు ముందు పక్కాప్రణాళికలో భాగమేనా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు. పెళ్లి ఏర్పాట్లు కొనసాగుతున్నాయనే భావన కల్పించి అనుమానాలు రాకుండా చేసేందుకే విమాన టికెట్లు బుక్ చేయాలని భావించినట్లు అనుమానిస్తున్నారు. అయితే ఈ చాట్ ప్రామాణికత ఇంకా నిర్ధారణ కాలేదని అధికారులు స్పష్టం చేశారు. పోలీసుల దర్యాప్తులో మరో కీలకవిషయం బయటపడింది. సియా గోయల్, చేతన్ చౌదరి తమ ఫోన్లలో కోడ్ భాష, మారుపేర్లతో మాట్లాడినట్లు డిలీట్‌చేసిన డేటా రికవరీలో గుర్తించారు. దర్యాప్తును తప్పుదారి పట్టించేందుకే ఈ పద్ధతి అనుసరించినట్లు భావిస్తున్నారు. ఇద్దరినీ ఎదురెదురుగా కూర్చోబెట్టి విచారించేందుకు మరో మూడు రోజుల పోలీసు కస్టడీ ఇవ్వాలని పోలీసులు కోర్టునుకోరారు. అయితే కోర్టు ఆ అభ్యర్థనను తిరస్కరించింది. దీంతో సియా, చేతన్‌లను 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపింది.



## ప్రపంచాన్ని తప్పదారి పట్టించేందుకే తెరపైకి సింధుజలాల ఒప్పందం

**న్యూఢిల్లీ,జులై 4:** ఉగ్రవాదానికి పుట్టినిల్లుగా పేరుపడ్డ పాకిస్థాన్, ఇప్పుడు అంతర్జాతీయ సమాజం దృష్టిని మళ్లించేందుకు కొత్త ఎత్తుగడకు తెరలేపింది. తన దేశంలో నెలకొన్న తీవ్ర నీటి సంక్షోభానికి భారత్ కారణమంటూ ఓ కొత్త నాటకాన్ని రక్తికట్టిస్తోంది. దేశంలో భరించలేని ఉష్ణోగ్రతల కారణంగా నీటి కొరత ఏర్పడుతుందన్న భయంతో పాకిస్థాన్ హడావుడిగా ఓ అంతర్జాతీయ సదస్సు నిర్వహించింది.

సింధు జలాల ఒప్పం దాన్ని భారత్ నిలిపివేయడం వల్లే తమకు ఈ దుస్థితి వచ్చిందని ప్రచారం చేయడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. వాస్తవానికి పాకిస్థాన్‌లో పెరుగు తున్న నీటి కష్టాలకు దాని దశాబ్దాల వైఫల్యాలే కారణం. 2025లో పహల్గామ్‌పై జరిగిన ఉగ్రదాడి తర్వాతే భారత్ సింధు జలాల ఒప్పందాన్ని నిలిపి వేసింది. పహల్గామ్ దాడి తర్వాత సహనం నశించి, "రక్తం, నీళ్లు కలిసి ప్రవహించవు" అని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకునే వరకు ఒప్పందాన్ని పునరుద్ధరించేది లేదని భారత్ స్పష్టం చేసింది. ఈ వాస్తవాలను దాచిపెట్టి పాకిస్థాన్ మంత్రులు, బిలావల్ భుట్టో వంటి నేతలు అణుయుద్ధం వస్తుందంటూ బెదిరింపులకు దిగుతున్నారు.

**పాకిస్థాన్ వైఫల్యాలే అసలు కారణం**

పాకిస్థాన్ ఆరోపిస్తున్నట్టుగా ఈ నీటి సంక్షోభం భారత్ వల్ల వచ్చింది కాదు. దశాబ్దాలుగా నీటి యాజమాన్యాన్ని నిర్లక్ష్యం చేయడం, సరైన నిల్వ సామర్థ్యం లేకపోవడం, ప్రావిన్సుల మధ్య అంతర్గత వివాదాలే దీనికి మూల కారణాలు. నీటి ఎద్దడి ఉన్నదేశంలో వరి, చెరకువంటి అధిక నీటిని వినియోగించే పంటలను విరివిగా పండించడం కూడా ఈసంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది.

## ఖమేనీ అంతిమయాత్ర ఆరంభం



**ఎర్ర జెండాలతో వేలాదిగా వచ్చిన అభిమానులు**

**'డెత్ ఆఫ్ అమెరికా' అంటూ నినాదాలు**

**టెహ్రాన్, జులై 4:** ఇరాన్ దివంగత నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీ అంతిమయాత్ర అధికారికంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఖమేనీతోపాటు మృతి చెందిన కుటుంబసభ్యుల శవపేటికలనూ మద్దతుదారుల సందర్శనార్థం రాజధాని నగరం టెహ్రాన్‌లో ఉంచారు. వాటిల్లో ఆయన 14 నెలల మనవరాలు జహ్రా మొహమ్మదీ శవపేటిక కూడా ఉంది. దాని పక్కనే ఆ చిన్నారి ఫొటో ఫ్రేమ్‌ను ఉంచారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ నిర్వహించిన సంయుక్త దాడుల్లో 86 యేళ్ల ఖమేనీతోపాటు ఆయన కుటుంబసభ్యులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. నాలుగునెలల తర్వాత వీరి అంతిమ సంస్కారాలను నిర్వహిస్తున్నారు. ఇరాన్, ఇరాక్‌లోని ఐదు నగరాల్లో ఏడు రోజులపాటు ఈ అంత్యక్రియలు జరగనున్నాయి. ఖమేనీ పార్థివదేహాన్ని ఆయన సొంత పట్టణం ఇరాన్‌లోని మషహద్‌లో ఈ నెల 9న ఖననం చేయనున్నారు. ఈ రోజు ఆయన భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆయనకు శ్రద్ధాంజలి ఘటించేందుకు వేలాది మంది తరలివచ్చారు. వారంతా ప్రతీకారానికి గుర్తుగా ఎర్ర జెండాలను పట్టుకొని.. 'డెత్ ఆఫ్ అమెరికా' అంటూ నినాదాలు చేసినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. కాగా.. ఖమేనీతో సన్నిహితంగా పనిచేసిన నాయకులు ఉద్వేగానికి గురయ్యారు. విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ ఆయనను గుర్తుచేసుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు.

**ట్రంప్ వ్యాఖ్యలు వివాదాస్పదం..**

ఈ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. 'ఇరాన్‌ను చిత్తుగా ఓడించాం. దాంతో వారు రాజీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మనం మంచివాళ్లం కాబట్టి.. అంత్యక్రియల కోసం వీకాఫ్ ఇచ్చాం' అని సౌత్ డకోటాలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు.

**కనిపించని మొజ్తాబా ఖమేనీ..**

కాగా అలీ ఖమేనీ అంత్యక్రియల్లో కుమారుడు మొజ్తాబా ఖమేనీ కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి బయటి ప్రపంచానికి కనిపించని ఆయన.. ఇప్పుడు తండ్రి అంత్యక్రియలకూ రాకపోవడం గమనార్హం. పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరతలతో భద్రతాపరమైన ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన తండ్రి అంత్యక్రియలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని సమాచారం.

## బలూచిస్థాన్‌లో భారీ ఉగ్రదాడి



**30 మంది భద్రతా సిబ్బంది మృతి**

**గ్వదర్,జులై 4:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రాంతంలో మరో భారీ దాడి జరిగినట్లు బలూచ్ లిబరేషన్ ఆర్మీ ప్రకటించింది. గ్వదర్ జిల్లాలోని జీవానీ పరిధిలో ఉన్న పన్వాన్ ప్రాంతంలోని పాకిస్థాన్ కోస్ట్ గార్డ్స్ క్యాంపును లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు తెలిపింది. ఈ ఘటనలో 30 మందికిపైగా భద్రతా సిబ్బంది మృతి చెందారని, మరికొందరు గాయపడ్డారని పేర్కొంది. బిఎల్ఎ చేసిన ఈ ప్రకటనపై పాకిస్థాన్ సైన్యం లేదా కోస్ట్ గార్డ్స్ నుంచి అధికారిక ధ్రువీకరణ రాలేదు. బలూచ్ లిబరేషన్ ఆర్మీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, తమ మజీద్ బ్రిగేడ్‌కు చెందిన సభ్యుడు పేలుడు పదార్థాలతో నింపిన మాజ్దా వాహనాన్ని కోస్ట్ గార్డ్స్ క్యాంపులోకి తీసుకెళ్లి పేల్చినట్లు బిఎల్ఎ పేర్కొంది. ఈ భారీ పేలుడు కారణంగా కోస్ట్ గార్డ్స్ క్యాంపు తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలిపింది. పేలుడు అనంతరం తమ ఫతేహ్ స్క్వాడ్‌కు చెందిన సభ్యులు క్యాంపుపై దాడి చేసినట్లు వెల్లడించింది. పేలుడు నుంచి బయటపడిన భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగించినట్లు పేర్కొంది.

ఘటనలో 30 మందికిపైగా పాకిస్థాన్ భద్రతా సిబ్బంది మృతి చెందినట్లు బిఎల్ఎ ప్రకటించింది. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారని తెలిపింది. శిథిలాల కింద మరికొంత మంది చిక్కుకుని ఉండవచ్చని, గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నందున మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఘటన జరిగిన వెంటనే పాకిస్థాన్ సైన్యం లేదా కోస్ట్ గార్డ్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ దాడికి పాల్పడిన వ్యక్తి వివరాలను కూడా బిఎల్ఎ తన ప్రకటనలో వెల్లడించింది. అతడిని అత్తావుల్లా బలోచ్ అలియాస్ అజ్మల్‌గా పేర్కొంది.

## 23 మందిని ఉగ్రవాదులుగా ప్రకటించిన కేంద్రం

**వారిలో 17 మంది పాకిస్థానీయులు, ఆరుగురు భారతీయులు**

**న్యూఢిల్లీ, జులై 4:** పాకిస్థాన్ గడ్డపైనుంచి ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్న 23 మందిని చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) కింద ఉగ్రవాదులుగా కేంద్రం ప్రకటించింది. వీరిలో జైష్‌ఎమహ్మద్ (జెఇఎం), లష్కరే తోయిబా (ఎల్‌ఇటి)తో పాటు వాటి అనుబంధ సంస్థలకు చెందిన కీలక నేతలు ఉన్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఉగ్రదాడులు, ఉగ్రవాదుల నియామకం, నిధుల సమీకరణ, ఆయుధాల అక్రమ రవాణా, సరిహద్దు చొరబాట్లు, ఉగ్ర సంస్థలకు సహకారం వంటి కార్యకలాపాల్లో వీరు పాల్గొంటున్నట్లు పేర్కొంది.

ఈ 23 మందిలో 17 మంది పాకిస్థాన్ పౌరులు, ఆరుగురు భారతీయులు ఉన్నారు. ప్రస్తుతం వీరంతా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి ఉగ్ర కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని కేంద్రం తెలిపింది. ఈ జాబితాలో జైష్‌కు చెందిన మసూద్ ఇల్యాస్ కశ్మీరీ, మొహమ్మద్ ముసద్దిక్, ముఫ్తీ మహ్మద్ అస్గర్ ఖాన్, అబ్దుల్లా జెహాదీ వంటి కీలక నేతలు ఉన్నారు. వీరు ఉగ్రవాదుల శిక్షణ, నియామకం, భారత్‌లోకి చొరబాట్లు, దాడుల ప్రణాళికలో కీలక పాత్ర పోషించినట్లు కేంద్రం ఆరోపించింది. 2022 సుంజ్వాన్ దాడి, 2016 నాగ్రోటా ఆర్మీ క్యాంప్‌పై దాడులతోనూ వీరికి సంబంధాలు ఉన్నట్లు పేర్కొంది. లష్కరే తోయిబాకు చెందిన ఫిర్దౌస్ అహ్మద్ భట్, హారూన్ రషీద్ గనాయ్ తో పాటు మరికొందరినీ ఉగ్రవాదుల జాబితాలో చేర్చారు. వీరు ఆయుధాల సరఫరా, యువతను ఉగ్రవాదంలోకి ఆకర్షించడం, దాడులకు అవసరమైన లాజిస్టిక్ సహాయం అందించినట్లు ప్రభుత్వం తెలిపింది.

2019లో యూఏపీఏ సవరణల తర్వాత ఉగ్ర సంస్థలతో పాటు వ్యక్తులను కూడా నేరుగా ఉగ్రవాదులుగా ప్రకటించే అధికారం కేంద్రానికి లభించింది. అదే అధికారాన్ని వినియోగిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## మెసేజింగ్‌యాప్ టెలిగ్రామ్‌కు కేంద్ర ఐటిశాఖ నోటీసులు




**న్యూఢిల్లీ,జులై 4:** పైరసీ కంటెంట్ విషయంలో ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌కు కేంద్ర ప్రభుత్వం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. తమ ప్లాట్‌ఫామ్‌పై చట్టవిరుద్ధంగా చలామణి అవుతున్న పైరేటెడ్ సినిమాలు, ఓటిటి కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని ఆదేశించింది. దీనిపై తీసుకున్న చర్యల గురించి 15 రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నేడు టెలిగ్రామ్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న క్రియేటర్ ఎకానమీ, చిత్ర పరిశ్రమ, బ్రాడ్‌కాస్టర్లు, ఓటిటి ప్లాట్‌ఫామ్‌లు, నిర్మాతలు, పంపిణీదారులను డిజిటల్ పైరసీ బారి నుంచి కాపాడే లక్ష్యంతో కేంద్రం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు విడుదలైన కొద్ది గంటల్లోనే టెలిగ్రామ్ ఛానెళ్ల ద్వారా పైరసీకి గురవుతుండటంతో పరిశ్రమ వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం రంగంలోకి దిగింది.

నీట్‌యూజీ 2026 పునఃపరీక్ష సందర్భంగా మోసాలను అరికట్టేందుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ జూన్ 22 వరకు టెలిగ్రామ్‌ను తాత్కాలికంగా బ్లాక్ చేసిన విషయం తెలిసిందే. పరీక్షలో అక్రమాలకు పాల్పడేందుకు కొన్ని ముఠాలు ఈ యాప్‌ను వ్యవస్థీకృతంగా వాడుతున్నాయని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టెలిగ్రామ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా చుక్కెదురైంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం చట్టప్రకారమే తన అధికారాలను ఉపయోగించిందని, ఈ ఆంక్షలు సమంజసమేనని జస్టిస్ తేజస్ కరియా ధర్మాసనం తీర్పునిచ్చింది. ఒకవైపు టెలిగ్రామ్‌కు పైరసీపై ఆదేశాలు జారీ చేసిన కేంద్రం, మరోవైపు మెటా యాజమాన్యంలోని వాట్సాప్‌పైనా దృష్టి సారించింది. వాట్సాప్ తీసుకురావాలనుకుంటున్న యూజర్‌నేమ్ ఫీచర్‌పై సంప్రదింపులు పూర్తయ్యే వరకు దానిని భారత్‌లో ప్రారంభించవద్దని మెటాను ఆదేశించింది. దీనిపై స్పందించిన వాట్సాప్, ఈ ఫీచర్ ఐచ్ఛికమని, మోసాలు, నకిలీ ఖాతాలను నివారించేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వానికి వివరణ ఇచ్చింది.

## వేడి తీవ్రతతో స్వాతంత్ర్య దినోత్సవ పెరేడ్ రద్దు




**వాషింగ్టన్,జులై 4:** అమెరికా తన 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాషింగ్టన్‌లో నిర్వహించాల్సిన సాంప్రదాయ స్వాతంత్ర్య దిన పరేడ్‌ను తీవ్ర వేడి కారణంగా రద్దు చేశారు. ఈ ఉదయం జరగాల్సిన ఈపరేడ్ అత్యధిక ఉష్ణోగ్రత వల్ల రద్దు అయిందని నిర్వాహకులు ప్రకటించారు. జాతీయ వాతావరణ సంస్థ ప్రకారం, సుమారు 16 కోట్ల అమెరికన్లు తీవ్ర వేడి హెచ్చరికలు ఎదుర్కొంటున్నారు. తూర్పు అమెరికాలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాషింగ్టన్‌లోని నేషనల్ మాల్‌లో జరిగే ఉత్సవాలు కూడా వేడి తీవ్రత కారణంగా మధ్యాహ్న భాగం రద్దు చేయాల్సి వచ్చింది. మరోవైపు, వేడిమికి తట్టుకోలేక అస్వస్థతకు గురైన ఒక యువతిని ఆసుపత్రికి తరలించారు. గ్రేట్ అమెరికన్ స్టేట్ ఫేర్ కార్యక్రమాన్ని కూడా తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. న్యూయార్క్‌లో హీట్ ఇండెక్స్ 105 ఫారెన్‌హీట్ (41 డిగ్రీల సెల్సియస్)కి చేరుకుంది. విద్యుత్ గ్రిడ్లపై భారీ ఒత్తిడి పడుతోంది. వేలాది మందికి విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఈ తీవ్ర వేడి అమెరికా స్వాతంత్ర్య దినోత్సవాలు, ఫిఫా వరల్డ్ కప్ మ్యాచ్‌లు, విద్యుత్ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫిఫా ఈ వరల్డ్ కప్ మ్యాచ్‌ల్లో హైడ్రేషన్ బ్రేకులు తప్పనిసరి చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ వేడిని ఎదుర్కోవడానికి కూలింగ్ సెంటర్లు, స్విమ్మింగ్ పూల్స్ సమయం పొడిగించడం వంటి చర్యలు తీసుకుంటోంది. ఈ ఏడాది అమెరికా స్వాతంత్ర్యానికి 250 ఏళ్లు పూర్తవుతున్న విశేష సందర్భం కావడంతో భారీ ఉత్సవాలకు ప్రణాళిక రూపొందించారు. అయితే ప్రకృతి వైపరీత్యాలు ఆ ఉత్సవాలపై పెను ప్రభావం చూపాయి.

# సంక్షిప్త వార్తలు

## ఉమర్‌ఖలీద్, షార్జిల్ ఇమామ్‌ల బెయిల్‌పై తీర్పు రిజర్వు



**న్యూఢిల్లీ,జులై 4:** ఢిల్లీలో 2020 నాటిఅల్లర్ల వెనుక కుట్రకు పాల్పడ్డారన్న ఆరోపణలతో అరెస్టయిన ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ దాఖలు చేసిన తాజా బెయిల్ పిటిషన్లపై ఢిల్లీ కోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. శనివారం ఇరుపక్షాల వాదనలను విన్న అదనపు సెషన్స్ జడ్జి సమీర్ బాజ్‌పాయ్, తీర్పు వెల్లడిని సాయంత్రానికి వాయిదావేశారు. విచారణ ప్రారంభం కాకుండానే తాము సుదీర్ఘ కాలంగా జైలులో ఉన్నామని, ఇది రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనని ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ తమ పిటిషన్లలో పేర్కొన్నారు. మారిన పరిస్థితుల్లో దృష్ట్యా, విచారణలో జాప్యం జరిగితే కఠినమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) కింద కూడా బెయిల్ మంజూరు చేయవచ్చని సుప్రీంకోర్టు ఇటీవల పలు కేసుల్లో స్పష్టం చేసిన విషయాన్ని వారు ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు.

## టేలర్ స్విఫ్ట్ వివాహావేడుకలో వజ్రాలగిఫ్ట్‌లు!

**న్యూయార్క్,జులై 4:** ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆసక్తి రేపిన పాప్ సింగర్ టేలర్ స్విఫ్ట్, అమెరికన్ ఫుట్‌బాల్ స్టార్ ట్రావిస్ కెల్సీల వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. న్యూయార్క్‌లోని ప్రఖ్యాత మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఈ జంట ఒక్కటైన విషయం తెలిసిందే. అయితే, పెళ్లికి ముందు రోజు జరిగిన రిహార్సల్ డిన్నర్‌లో అతిథులకు వారు ఇచ్చిన ఖరీదైన బహుమతులు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ఈ వేడుకకు హాజరైన ప్రతిఒక్కరికీ వజ్రాలు పొదిగిన షాంపైన్ గ్లాసులు బహుమతిగా ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లోని ఇన్ఫోసిస్ థియేటర్‌లో ఈ రిహార్సల్ డిన్నర్ జరిగింది. సుమారు 100మంది సన్నిహితులు, కుటుంబ సభ్యులు, సెలబ్రిటీలు ఇందులో పాల్గొన్నారు.

## మమతకు మరోషాక్: రాష్ట్ర అధ్యక్షురాలు రాజీనామా

**కోల్‌కతా, జులై 4:** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయ సంక్షోభం మరింత తీవ్ర రూపం దాల్చింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితురాలిగా గుర్తింపు పొందిన సీనియర్ నాయకురాలు, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రిమ భట్టాచార్య తన పదవులన్నింటికీ రాజీనామా చేశారు. శనివారం ఆమె ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కేవలం రాష్ట్ర అధ్యక్షపదవికే కాకుండా, పార్టీ బ్యాంకు ఖాతాల ఆథరైజ్డ్ సిగ్నేచరీగా, ఎన్నికల సంఘం వద్ద పార్టీ ప్రతినిధిగా కూడా తన బాధ్యతల నుంచి ఆమె తప్పుకున్నారు. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టిఎంసి ఘోర పరాజయాన్ని చవిచూసిన విషయం తెలిసిందే. చంద్రిమ రాజీనామాపై మమత బెనర్జీ వర్గం నేతలు స్పందించారు. పార్టీలో కీలక పదవులను అనుభవించి, ఇప్పుడు ఇలా వ్యవహరించడం సరైనది కాదని ఎమ్మెల్యే కునాల్ ఘోష్ అభిప్రాయపడ్డారు. టిఎంసి క్రమంగా తన ప్రాభవాన్ని కోల్పోతోందనడానికి ఇదే నిదర్శనమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య వ్యాఖ్యానించారు.

## ముస్లిం మైనార్టీలే లక్ష్యంగా కూల్చివేతలు

**న్యూఢిల్లీ, జులై 4:** దేశంలోని రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల్లో మసీదులు, దర్గాలు, నివాస ప్రాంతాలపై జరుగుతున్న కూల్చివేతల చర్యలు ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని నిర్వహిస్తున్నవేనని జమాత్‌ఏఇస్లామీ హింద్ ఆరోపించింది. సంస్థ ఉపాధ్యక్షుడు సలీం ఇంజినీర్ మాట్లాడుతూ మతపరమైన నిర్మాణాలపై ఎంపికచేసి చర్యలు తీసుకోవడం అత్యంత ఆందోళనకరమన్నారు. అభివృద్ధి, భద్రతపేరుతో చట్టబద్ధమైన విధానాలను పాటించకుండా కూల్చివేతలు చేపడుతున్నారని, ప్రజల్లో భయం సృష్టించే ప్రయత్నమే జరుగుతోందని విమర్శించారు. అలాగే ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కూడా జమాత్‌ఏఇస్లామీ హింద్ అభ్యంతరం వ్యక్తం చేసింది.

## వైద్యురాలి హత్యకేసులో బీహార్ ఎమ్మెల్యేకు నాలుగేళ్ల జైలు

**పాట్నా,జులై 4:** బీహార్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రాజు కుమార్ సింగ్‌కు ఢిల్లీ కోర్టు షాకిచ్చింది. మహిళా వైద్యురాలిని చంపిన కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. 2018 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జరిగిన సెలబ్రేటరీ ఫైరింగ్‌లో మహిళా వైద్యురాలు డాక్టర్ అర్చనా గుప్తా మృతి చెందిన కేసులో దోషిగా తేల్చిన కోర్టు.. నాలుగేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు ఆయుధ చట్టం ఉల్లంఘన కేసులో మరో రెండు నెలల జైలు శిక్ష విధించింది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గొగ్నే ఈ తీర్పు వెలువరించారు.

# 20 యేళ్లలో రేవంత్ అద్భుత రాజకీయ ప్రస్థానం

## జడ్పీటిసి నుంచి సిఎం దాకా అలుపెరుగని నాయకుడు

### శుభాకాంక్షలు తెలిపిన పిసిసి చీఫ్ మహేష్‌గౌడ్

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం జడ్పీటిసి నుంచి ముఖ్యమంత్రి వరకు 20 యేళ్లలో అద్భుతమైన రీతిలో సాగిందని ఇది ఆయన నాయకత్వపటిమకు నిదర్శనమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మిడ్జిల్ మండల జడ్పీటిసిగా స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించి మొక్కవోని ధైర్యంతో అనేక రాజకీయ పత్రిక్షాలను తట్టుకొని ధీరోదత్త రాజకీయాలు చేసి తన లక్ష్యాన్ని సాధించిన రేవంత్‌రెడ్డి మరిన్ని మంచి పదవులు అధిరో హించాలని ఆయన ఆకాంక్షను వ్యక్తీకరించారు. స్థానిక సంస్థల ప్రతినిధిగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యే గా ఎంపీగా, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, టిపిసిసి అధ్యక్షులుగా రాజకీయాల్లో అన్ని వ్యవస్థలలో పని చేసిన గొప్ప అనుభవం ఉన్న నాయకులు రేవంత్ రెడ్డి అని కొనియాడారు. రెండున్నర యేళ్ల ప్రజా పాలనలో ముఖ్యమంత్రి గా అత్యంత ప్రజాదారణ పొందిన దేశంలో ఏ రాష్ట్రంలో చేయనంత సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేసి మంచి ఆదరణ పొందిన రేవంత్ రెడ్డికి నా అభినందనలు అంటూ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

**సిఎంకు శుభాకాంక్షలు తెలిపిన షబ్బీర్‌అలీ**

జడ్పీటిసి సభ్యునిగా ప్రారంభమైన మీ రాజకీయ ప్రస్థానం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదగడం మీ అంకితభావం, పట్టుదల, ప్రజాసేవ పట్ల మీ అచంచల నిబద్ధతకు నిదర్శనం అని ముఖ్యమంత్రికి శుభా కాంక్షలు తెలుపుతూ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత రెండు దశాబ్దాలుగా మీ నాయకత్వం ప్రజలకు స్ఫూర్తినిస్తూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సంక్షేమానికి విశేష సేవలందిస్తోందని కొనియాడారు. మీ సమర్థవంతమైన నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి, ప్రగతి, సుసంపన్నత సాధించాలని ఆకాంక్షిస్తూ, ఈ అరుదైన మైలురాయి సందర్భంగా మరోసారి హృదయ పూర్వక అభినందనలు మరియు శుభా కాంక్షలు తెలియజేస్తున్నాను అని షబ్బీర్ అలీ ప్రకటనలో పేర్కొన్నారు.

**గాంధీభవన్‌లో స్వీట్లు పంపిణీ**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు దశాబ్దాల రాజకీయ జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా గాంధీ భవన్ లో శనివారం స్వీట్లు పంపిణీ చేసి కార్యకర్తలు, నేతలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి తన 20 ఏళ్ళ రాజకీయ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారని, అయినా తన లక్ష్యం వీడలేదని కొనియాడారు. తన లాంటి నేటి యువ నేతలకు సీఎం రేవంత్ రెడ్డి లైఫ్ జర్నీ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. తాము సీఎం రేవంత్‌రెడ్డిని ఆదర్శం గా తీసుకుని రాజకీయాల్లో కొనసాగుతున్నానని మెట్టు సాయికుమార్ తెలిపారు.

# రెండు దశాబ్దాల ప్రజాజీవితంపై సిఎం రేవంత్‌కు మంత్రులు పొన్నం, సీతక్క, దామోదర శుభాకాంక్షలు

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** ప్రజా జీవితంలో 20 ఏళ్లు పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, దామోదర రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా జీవితంలో విజయవంతంగా 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవ పట్ల ఆయన చూపుతున్న అంకితభావం, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సాగిస్తున్న పాలన మరింత విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. జడ్పీటీసీగా ప్రారంభమైన రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం ఆయన పట్టుదల, ప్రజల పట్ల నిబద్ధత, నిరంతర కృషికి నిదర్శనమని పేర్కొన్నా రు. ప్రతి పదవిని ప్రజా సేవకు వేదికగా మలుచుకుంటూ, ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న నాయ కుడిగా ఎదిగారని కొని యాడారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, సంక్షేమం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, పేదలు, ఆదివాసి గిరిజనులు, బలహీన, అణగారిన వర్గాల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు తెలంగాణ అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందిస్తూ, సంక్షేమం అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని మంత్రులు అభిప్రాయపడ్డారు. ప్రజా జీవితంలో రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీటీసీగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, అనతికాలంలోనే ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం ఒక వ్యక్తి రాజకీయ ఎదుగుదల మాత్రమే కాదని.. ఆయన కృషి, పట్టుదల, నిరంతర పోరాటం, ప్రజాసేవ పట్ల అంకితభావానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి రెండు దశాబ్దాల ప్రయాణం నేటి యువతకు ఆదర్శప్రాయమని, భావితరాలకు స్ఫూర్తిదాయకమని మంత్రి పేర్కొన్నారు. రాజకీయ జీవితానికి పునాది వేసిన మిడ్జిల్ గడ్డను మరువకుండా అక్కడే కృతజ్ఞత సభ నిర్వహించడం ముఖ్యమంత్రి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. పదవులు, హోదా మారినా... ప్రజలతో ఉన్న అనుబంధాన్ని మరువకుండా కృతజ్ఞత చాటుకోవడం ఆయన సంస్కారానికి నిదర్శనమన్నారు.

# తెలంగాణ పర్యాటక సంస్కరణలకు నీతి ఆయోగ్ ప్రశంస

## రాష్ట్ర విధానాలు దేశానికే ఆదర్శం: మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై 4:** పర్యాటక, ఆతిథ్య రంగ అభివృద్ధిలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలను నీతి ఆయోగ్ ప్రశంసించడం రాష్ట్రానికి దక్కిన గౌరవమని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు.

ఇటీవల నీతి ఆయోగ్ విడుదల చేసిన 'అన్‌లాకింగ్ గ్రోత్ ఇన్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ' నివేదికలో పర్యాటక రంగంలో తెలంగాణ అమలు చేస్తున్న విధానాలను ప్రత్యేకంగా ప్రస్తావించడం ఆనందదాయకమని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పరంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలించాలని నీతి ఆయోగ్ సూచించడం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు లభించిన గుర్తింపేనని అన్నారు.

హోటళ్ల నిర్మాణానికి సంబంధించి నిబంధనల సరళీకరణ, పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు, భూమి వినియోగంలో వెసులుబాటు, ఫ్లోర్ ఏరియా రేషియో పెంపు, పార్కింగ్ నిబంధనల సరళీకరణ, సింగిల్ విండో విధానం బలోపేతం వంటి చర్యలు తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించాయని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ పర్యాటక విధానం-2025 2030 ఇప్పటికే విశేష ఫలితాలను ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ఇప్పటికే వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు మార్గం సుగమమైందని తెలిపారు.

గతంలో కూడా తెలంగాణ పర్యాటక రంగంలోని పలు ఉత్తమ కార్యక్రమాలు, పర్యాటక ప్రాంతాలకు నీతి ఆయోగ్ నివేదికల్లో స్థానం దక్కిందని మంత్రి గుర్తు చేశారు. తాజాగా మరోసారి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణను ఆదర్శంగా పేర్కొనడం రాష్ట్ర పర్యాటక రంగం సరైన దిశలో ముందుకు సాగుతోందనడానికి నిదర్శనమని అన్నారు. భవిష్యత్తులో పెట్టుబడిదారులకు మరింత అనుకూలమైన విధానాలు అమలు చేస్తూ, ప్రపంచ స్థాయి పర్యాటక మౌలిక వసతులు కల్పించి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.

# ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

## ఎంపిలకు తపస్ వినతిపత్రాలు

**హైదారబాద్, జులై 4, ప్రభాతవార్త:** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు తపస్ నేతలు శనివారం ఎంపీలకు వినతిపత్రాలను సమర్పించారు. యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ విషయంలో రాజ్యాంగబద్ధమైన చిక్కులు తొలగించాలని కోరుతూ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కోవా లక్ష్మణ్‌కి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్‌కి వినతిపత్రాలు ఇచ్చినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఓడ్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, రాష్ట్ర సంఘటన కార్యదర్శి హనుమంతరావు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దుబాసి భాస్కర్‌లు తెలిపారు. టెట్‌పై ఉద్యమంలో మొదటి దశలో భాగంగా పిఆర్‌సీ, డీఏ, పెండింగ్ బిల్లుల ప్రకటన కోసం మండలస్థాయిలో నిరసన కార్యక్రమం చేసి తహసీల్దార్‌ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి మెమోరాండంను ఇచ్చినట్టు తెలిపారు. ఈ నెల 14 వరకు సమస్యల పరిష్కారంకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోతే జిల్లా కలెక్టరెట్ల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

# విద్యుత్ వివాదాల పరిష్కార వేదిక చైర్‌పర్సన్లు

## దరఖాస్తుకు గడువు తేదీ 18

### ఉత్తర తెలంగాణ విద్యుత్ సంస్థ నోటిఫికేషన్

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగదారుల వివాదాల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) 1 (వరంగల్), సీజీఆర్ఎఫ్ 2 (నిజామా బాద్) కేంద్రాల చైర్‌పర్సన్ల నియామకానికి ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తుకు తుది గడువు జూలై 18గా నిర్ణయించింది. విద్యుత్ బిల్లుల్లో వివాదాలతో పాటు, విద్యుత్ సరఫరా, కొత్త కనెక్షన్ల జారీలో జాప్యం, రీ కనెక్షన్, కేటగిరీ, పేరు, చిరునామా మార్పిడి వంటి అంశాలపై వినియోగదారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించాల్సి ఉంటుంది. ఆ విధంగా వచ్చిన వాటిపై విచారణ జరిపి తీర్పులు వెలువరించాలని వెల్లడించింది. ఆసక్తి గల అర్హులు పూర్తి వివరాలను టీజీఎన్‌పీడీసీఎల్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా పరిశీలించవచ్చు. ఈ చైర్‌పర్సన్లకు సంబంధించి జిల్లా జడ్జిగా లేదా జ్యుడీషియల్ అధికారిగా 20 ఏళ్ల పాటు సేవలందించిన వారు, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లు/ చీఫ్ జనరల్ మేనేజర్లు (ఎలక్ట్రికల్) అర్హులని వెల్లడించింది. వయోపరిమితి కనీసం 55 ఏళ్లు ఉండాలి, అదే సమయంలో 63 ఏళ్లు మించరాదని స్పష్టం చేసింది. ఎంపికైన వారు మూడేళ్ల పాటు లేదా 65 ఏళ్లు వచ్చే వరకు ఏది ముందైతే అది ఈ చైర్‌పర్సన్ల పదవిలో కొనసాగుతారు.

# డిఎంఇ(అకడమిక్)గా డాక్టర్ రమాదేవి నియామకం

## ఉత్తర్వులిచ్చిన ప్రభుత్వం

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) అకడమిక్‌గా డాక్టర్ ఎం రమాదేవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పనిచేస్తున్న డాక్టర్ ఎం రమాదేవికి తాత్కాలిక పదోన్నతిపై డిఎంఇగా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో డిఎంఇగా పదోన్నతి పొం దిన నేపథ్యంలో డిఎంఇ(అకడమిక్)గా పోస్టింగ్ ఇస్తూ వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ జిఒ నంబర్ 291ను జారీ చేశారు. 0

# ఖమ్మం విజయ డెయిరీ మూసివేత!

## వరంగల్‌కు తరలించాలని నిర్ణయం

### ప్రైవేటు సంస్థకు భూమి లీజుకు అవకాశం

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** ఖమ్మంలోని విజయ డెయిరీ భవితవ్యం అగమ్యగోచరంగా ఉంది. ప్రభుత్వం దాని కార్యకలాపాలను మూసివేయాలని యోచిస్తుండటంతో పాటు, డెయిరీకి చెందిన విలువైన భూమిని ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఖమ్మంలో 10 ఎకరాల స్థలంలో తెలంగాణ పాడి అభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో ఈ డెయిరీ నడుస్తోంది. రోజుకు 20 వేల లీటర్ల పాలను శుద్ధి చేసే సామర్థ్యంతో దీన్ని 1977 నవంబర్‌లో ప్రారంభించారు. దాదాపు 50 వేల మంది పాడి రైతులు ఈ డెయిరీకి పాలు సరఫరా చేసి జీవనోపాధి పొందుతున్నారు. అలాగే ఖమ్మం డెయిరీ ఆధ్వర్యంలో కొత్తగూడెం, ఎల్లందు, కామేపల్లి, కల్లూరు, సత్తుపల్లి, ఎర్రుపాలెంలో సుమారు 280 పాల సేకరణ కేంద్రాలతో పాటు, ఆరు బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్లు కూడా పనిచేస్తున్నాయి. అయితే డెయిరీ కార్యకలాపాలను వరంగల్‌కు తరలించాలని ప్రభుత్వ నిర్ణయించినట్లు తెలియవచ్చింది. దీంతో పాడి రైతుల జీవనోపాధి దెబ్బతినడంతో పాటు, సిబ్బంది భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే సికింద్రాబాద్‌లోని లాలపేటలో ఉన్న విలువైన విజయ డెయిరీ భూమిని ఒక ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇచ్చింది. తాజాగా ఖమ్మం డెయిరీలో కూడా అదే తరహా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. ఖమ్మం విజయ డెయిరీని మూసివేయడం, ఇక్కడ సేకరించిన పాలను వరంగల్‌కు తరలించడం, అక్కడి నుంచి పాలు సేకరించడం వల్ల ఉత్పత్తి వ్యయాలు పెరగడంతో పాటు, వినియోగదారులపై ఆర్థిక భారం పడుతుందని పాడి రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

# కల్తీ ఆహారపదార్థాల కట్టడికి నిరంతర తనిఖీలు చేపట్టాలి

## ఆహార భద్రతపై సిఎస్ సంజయ్‌జాజు సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 4:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆహార భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, కల్తీ ఆహార పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం తనిఖీలు చేపట్టాలని సిఎస్ పేర్కొన్నారు. సచివాలయంలో శనివారం సిఎస్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్ కంట్రోలర్ విభాగం, ఫుడ్ సేఫ్టీ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ రాష్ట్రంలో ఆహార భద్రతా ప్రమాణాల అమలు, నాణ్యతలపై నిరంతరం తనిఖీలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఉన్న రెండు విభాగాలను ఏకతాటిపై నడిపేందుకు తగిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా సిద్ధం చేయాలని సిఎస్ సూచించారు. దీంతో ఆయా విభాగాలు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అవకాశం ఉందన్నారు. ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న విధానాన్ని అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కూడా తగిన విధంగా అమలు చేసేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో సిఎం సలహాదారు, ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి సి.వి.ఆనంద్, సిఎంఒ ప్రిన్సిపల్ సెక్రటరీలు శేషాద్రి, ఎన్.శ్రీధర్, జిఎడి ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీం, అడిషనల్ డిజి(ఇంటెలిజెన్స్) విజయ్‌కుమార్, వైద్యశాఖ ప్రిన్సి పల్ సెక్రెటరీ క్రిస్టినా చొంగ్తూ, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, వైద్యశాఖ కమిషనర్ సంగీతా, డ్రగ్ కంట్రోలర్ డిజి అవినాష్ మొహంతి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోలీసు అకాడమిలో రవాణా శాఖ ఎంవిఐ పాసింగ్ పెరేడ్



రవాణా శాఖ ఎంవిఐ పాసింగ్ పెరేడ్ అనంతరం వారితో ఫొటో దిగిన రవాణా శాఖ అదనపు కమిషనర్ రమేష్

## ముఖ్యఅతిథిగా హాజరైన రవాణా శాఖ అదనపు కమిషనర్ రమేష్

**హైదారబాద్, జులై 4, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు అకాడమిలో రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల (ఎఎంవిఐ) పాసింగ్ ప రేడ్ శనివారం ఘనంగా జరిగింది. హిమాయత్ సాగర్‌లో గల అకాడమిలో జరిగిన ఈ పరేడ్‌కు రవాణా శాఖ అదనపు కమిషనర్ రమేష్ ము ఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐదు నెలల పాటు కొనసాగిన 15 మంది ఎఎంవిఐ శిక్షణలో అనేక అంశాలను అకాడమి అధికారులు నేర్పారని ర వాణా శాఖ అదనపు కమిషనర్ రమేష్ ఈ సందర్భంగా తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అధికారులను ఆయన అభినందించి సర్టిఫికేట్లను ప్రధాన ం చేశారు. దేశంలోని అత్యుత్తమ పోలీసు శిక్షణా సంస్థగా గుర్తింపు పొందిన రాష్ట్ర పోలీసు అకాడమిలో తమ అధికారులు శిక్షణ పొందడం గొ ప్పగా వుందని ఆయన తెలిపారు. రాష్ట్ర పోలీసు అకాడమిలో ఉన్నత ప్రమాణాలతో శిక్షణ వుంటుందని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో రహ దారి భద్రతకు పెద్ద పీట వేస్తున్నామని, ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. శిక్షణ పొందిన అధికారు లు ఉద్యోగంలో ఉన్నతంగా రాణించాలని, ప్రభుత్వ లక్ష్యాలను అందుకోవాలని ఆయన సూచించారు. విధి నిర్వహణలో రాజీపడకుండా వుండా లని ఆయన కోరారు. విలువలు, నిజాయితీ, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, వృత్తిపరమైన ప్రతిష్టను, గౌరవాన్ని కాపాడాలని రమేష్ కోరా రు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా టెక్నాలజిని వాడాలని, తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ఆయన కోరారు. ప్రజలకు రోడ్డు భద్రత పై వివరించాలని, సోషల్ మీడియాను బాధ్యతగా వినియోగించాలని ఆయన కోరారు. శిక్షణ సమయంలో అకాడమి డైరెక్టర్ అభిలాష్ బిస్త్‌తో పాటు ఇతర అధికారులు, తమ విభాగం కమిషనర్ ఇలంబర్తి అందించిన సహకారం ఎంతో విలువైనదిగా ఆయన తెలిపారు. అనంతరం జరిగి న కార్యక్రమంలో శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి ఆయన ట్రోఫీలు అందించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు పలువురు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మూడు నెలలపాటు అన్న, అక్క మెంటార్‌షిప్

## 6 నుంచి టెన్త్ వరకు విద్యార్థులకు ఎఐ, డిజిటల్ లెర్నింగ్ తరగతులు

### మార్గదర్శకాలు జారీ చేసిన పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్‌నికోలస్

**హైదారబాద్, జులై 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) అండ్ డిజిటల్ లెర్నింగ్ క్లాసులను బోధించనున్నారు. ప్రభుత్వ పాఠశాలలతోపాటు జిల్లా పరిషత్, మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో చదువుతున్న 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మూడు నెలలపాటు ఈ క్లాసులను బోధించనున్నారు. జులై నుంచి సెప్టెంబర్ వరకు మూడు నెలలపాటు కొనసాగించనున్నారు. డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యార్థులు ఈ క్లాసులను బోధించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రోగ్రామ్‌ను అన్న అక్క మెంటర్‌షిప్‌గా కొనసాగించాలని నిర్ణయించి పాఠశాల విద్య శాఖ అందుకు సంబంధించిన మార్గదర్శకాలను పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ జారీ చేశారు. జులై నుంచి సెప్టెంబర్ వరకు ఈ మెంటర్‌షిప్‌ను కొనసాగించనున్నారు. దశల వారీగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్ పేరుతో ఏఐ క్లాసులను బోధించనున్నా రు. ప్రతి విద్యార్థికి ఇంటర్న్‌షిప్‌లో 30 గంటలపాటు ఏఐకి సంబంధించిన ప్రాక్టికల్ క్లాసులను బోధించనున్నారు.

# రోశయ్య రాజకీయ నిబద్ధత కలిగిన ఆదర్శమూర్తి

## పిసిసి చీఫ్ మహేశ్‌గౌడ్

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య రాజకీయ నిబద్ధత కలిగిన ఆదర్శమూర్తి అని ఆయన జీవితం అనుసరణీయమని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 93వ జయంతి సందర్భంగా గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రోశయ్య ప్రజా జీవితంలో నిజాయితీ, నిబద్ధత, రాజకీయ విలువలకు ప్రతీకగా నిలిచారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన రోశయ్య సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలు, విలువలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని రోశయ్యకు ఘన నివాళులర్పించారు.

# 6 నుంచి 14 వరకు అప్రెంటిస్‌షిప్ కమ్ జాబ్‌మేళా

## ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నిర్వహణ

### స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ సహకారంతో ఏర్పాటు

**హైదారబాద్, జులై 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ నెల 6 నుంచి అప్రెంటిషిప్ కమ్ జాబ్ మేళాను నిర్వ హించనున్నారు. ఈ జాబ్ మేళాను ఈ నెల 14 వరకు నిర్వహించ నున్నట్టు ఇంటర్ విద్య డైరెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రీజినల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్ మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఆర్‌డీఎస్‌డీఈ) సహకారంతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్య క్రమం స్కిల్‌ఇండియా మిషన్ అండ్ నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్(ఎన్ఏపీఎస్-2) ఆధ్వర్యంలో యువర్ స్కిల్స్, యువర్ ఫ్యూచర్, అవర్ మిషన్ అనే థీమ్‌తోజరుగుతుందని తెలిపారు. వృత్తి విద్యార్థులు, కొత్తగా ఉత్తీర్ణులైన యువతను ప్రముఖ పరిశ్రమలతో అనుసంధానం చేసి అప్రెంటిషిప్స్, ఉద్యోగ అవకాశాలను కల్పించడం ప్రధాన ఉద్దేశమని ఇంటర్ విద్య డైరెక్టర్ స్పష్టం చేశారు.

యువతకు ఉపాధి అవకాశాలు, మేళాకు హాజరయ్యే అభ్యర్థులకు తక్షణ ఇంటర్వ్యూలు, నిపుణుల కెరీర్ మార్గదర్శ కత్వం, పారామెడికల్, నాన్‌పారామెడికల్ రంగాల్లో వివిధ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రకటించారు. ఎంపికైన అభ్యర్థులకు అప్రెంటిషిప్ టట్టం, 1992 ప్రకారం నెలకు రూ. 9,600/ స్టైఫండ్ అందజేయబడుతుందని తెలిపారు. 2023-26 బ్యాచ్‌లకు చెందిన ఒకేషనల్ విద్యార్థులు అర్హులైని ప్రకటించారు. అదీకూడా అప్రెంటిషిప్‌పూర్తి చేసిన వారు మాత్రమే అర్హులని ప్రకటించారు.

ఈ నెల 6న ఎస్‌కెపిఎం ప్రభుత్వ వృత్తి జూనియర్ కళాశాల, కుత్బుల్లాపూర్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, ఈ నెల 7న కస్తూర్బాగాంధీ జూనియర్ కళాశాల, మారేడ్‌పల్లి, సికిందరాబాద్, ఈ నెల 13న ప్రభుత్వ వృత్తి జూనియర్ కళాశాల, హన్మ కొండ, ఈ నెల 14న ప్రభుత్వ వృత్తి జూనియర్ కళాశాల, మహబూబ్‌నగర్, నల్గొండ. ఉదయం పారా మెడికల్ విభాగంలో, మధ్యాహ్నం నాన్ పారా మెడికల్ విభాగంలో జాబ్ మేళాను నిర్వహించ నున్నట్టు తెలిపారు.

# ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సమస్యలను పరిష్కరించాలి

## ఇంటర్ విద్య డైరెక్టర్‌కు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ విజ్ఞప్తి

**హైదారబాద్, జులై 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అలాగే 2023 బ్యాచ్ అధ్యాపక సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 డిమాండ్ చేసింది. అసోసియేషన్ నేతలు శనివారం ఇంటర్ విద్య డైరెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వస్కుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ తెలిపారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని ముఖ్యమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. కాలేజీల్లో పనిచేస్తున్న 2023 బ్యాచ్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని కోరినట్టు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమలు చేస్తున్న విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్నం భోజన పథకాన్ని స్వాగతిస్తున్నామని, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అమలు చేస్తున్న ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన పథకాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమలు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న అటెండర్ పోస్టుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని, అతిథి అధ్యాపక పోస్టులను రెన్యువల్ చేసి, ఖాళీగా ఉన్న వాటిని వెంటనే భర్తీ చేయాలన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల మంచినీటి కొరకు ఏర్పాటుచేసిన మంచినీటి శుద్ధి యంత్రాలలో కొన్ని కళాశాలలో పనిచేయట్లేదు వాటిని రిపేర్ చేయాలని కోరారు. 2023 బ్యాచ్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాన్నారు. 20 సంవత్సరాలు పైగా ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి, విద్యా బోధనకు కృషి చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చర్లను జీవో నెంబర్ 16 ప్రకారం 2023 మే నెలలో క్రమబద్ధీకరించడం జరిగిందని, కానీ వీరికి సెకండ్ ఇంక్రిమెంట్ చేసే విషయంలో ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్స్ నుంచి డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వెళ్లడానికి డిగ్రీ కళాశాలల కమిషనర్ ప్రొసీడింగ్స్ జారీ చేయడం జరిగిందన్నారు. ఇంటర్ విద్య డైరెక్టర్ స్పందిస్తూ సాను కూలంగా పరిష్కరిస్తామన్నారని అసోసియేషన్ నేతలు తెలిపారు.



ఉన్నత విద్యామండలి ముందు ధర్నాకు దిగిన ఎంపి ఆర్.కృష్ణయ్య

# పెండింగ్ ఫీజు బకాయిలను తక్షణమే చెల్లించాలి: ఆర్.కృష్ణయ్య

## ఉన్నత విద్యామండలి ముందు భారీ ధర్నా

**హైదారబాద్, జులై 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్నత విద్య పేద విద్యార్థులకు అందని ద్రాక్షలా మారిందని, ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని రాజ్య సభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. మూడు సంవత్సరాలుగా పేరుకుపోయిన 8 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా రూ. 300 కోట్లు చెల్లిస్తే ఏమూలాకు సరిపోతాయని ప్రశ్నించారు. పెండింగ్ లో ఉన్న రూ. 8 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి ముందు బి.సి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్ల గొర్ల మోదీ రాందేవ్ యాదవ్, బీసీ యువజన సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు బిఆర్ఎస్, బిజెపి, వామపక్షాలు, ప్రజాసంఘాలు, బీసీ విద్యార్థులు పడుతున్న బాధలు పై పోరాడాలని కోరారు. ఆచరణలో సాధ్యం కానీ జీవో నెంబర్ 9 ను వెంటనే తొలగించి పాత పద్ధతిని కొనసాగించాలన్నారు.

## అమెరికా స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై4:** అమెరికా సంయుక్త రాష్ట్రాల స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అక్కడి ప్రజలకు, ప్రవాస భారతీయులకు, ముఖ్యంగా అమెరికాలో నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణకు చెందిన వైద్యులు, ఇంజనీర్లు, ఐటీ రంగ నిపుణులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పారిశ్రామికవేత్తలు తమ ప్రతిభ, కృషి, అంకిత భావంతో అమెరికా అభివృద్ధిలో విశేష పాత్ర పోషిస్తూ మన రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్నారని ఒక సందేశంలో అన్నారు. ప్రపంచ స్థాయిలో తమ ప్రతిభను చాటుతూ తెలంగాణ పేరును మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్న ప్రతి తెలుగు బిడ్డకు అభినందనలు. అమెరికాలోని తెలంగాణ సమాజం కేవలం వృత్తిపరమైన విజయాలకే పరిమితం కాకుండా, రెండు దేశాల మధ్య సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసే వారధిగా నిలుస్తోంది. మన భాష, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందిస్తూ తెలంగాణ ఆత్మను ప్రవాస వ్యాప్తంగా చాటుతోంది అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాస తెలంగాణవాసులతో సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని, రాష్ట్ర అభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని ఎల్లప్పుడూ స్వాగతిస్తామని స్పష్టం చేశారు.అమెరికా స్వాతంత్య్ర దినోత్సవం మరింత స్నేహం, శాంతి, సమృద్ధి, పరస్పర సహకారానికి దోహదపడాలని ఒక సందేశంలో ఆకాంక్షించారు.

# హిందువుల ఓట్ల తొలగింపునకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర

### కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్

**భీమారం/మేడిపల్లి/కథలాపూర్, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను దుర్వినియోగం చేస్తూ హిందువుల ఓట్లను తొలగించే కుట్రకు పాల్పడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాల్లో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్ఐఆర్ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు తగిన సహకారం అందించడం లేదని, దీంతో క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి అధికారులు వెళ్లడం లేదని విమర్శించారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మజ్లిస్‌తో కుమ్మక్కై హిందువుల ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. గ్రామీణాభివృద్ధికి నాణ్యమైన రహదారులే పునాది అని పేర్కొన్న బండి సంజయ్, ఎంపీగా ఎన్నికైనప్పటి నుంచి రోడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చానన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సహకారంతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి భారీ స్థాయిలో కేంద్ర నిధులు తీసుకొచ్చామని తెలిపారు. గత ఏడు సంవత్సరాల్లో రూ.22 వేల కోట్లకు పైగా కేంద్ర నిధులు సమకూర్చగా, అందులో రూ.10 వేల కోట్లకు పైగా రహదారుల అభివృద్ధికే వినియోగించినట్లు వెల్లడించారు. వేములవాడ నియోజకవర్గంలో మల్యాల-కావారం, సిరికొండ-వేములవాడ, మేడిపల్లి-గోవిందారం తదితర రహదారుల నిర్మాణ పనులు కోట్ల రూపాయల వ్యయంతో కొనసాగుతున్నాయని తెలిపారు. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి పనులు దాదాపు పూర్తయ్యాయని, దసరా నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని వెల్లడించారు. ఎల్కతుర్తి-సిద్దిపేట జాతీయ రహదారి పనులు వేగంగా సాగుతున్నాయని, కరీంనగర్-జగిత్యాల రహదారి విస్తరణకు రూ.2,003 కోట్లకు పైగా నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు రాష్ట్రాన్ని అప్పులపాలు చేశాయని, అవినీతి, అక్రమాలు, దోపిడీతో తెలంగాణ ఆర్థిక పరిస్థితిని దెబ్బతీశాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రస్తుత గ్రామ అభివృద్ధి ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులపైనే ఆధారపడి ఉందన్నారు. 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామాల అభివృద్ధికి వినియోగించాల్సిన చోట విద్యుత్ బిల్లులు, ఉద్యోగుల వేతనాల చెల్లింపులకు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసిన బండి సంజయ్, కష్టపడి పనిచేసే వారికే ప్రజల్లో గౌరవం ఉంటుందని అన్నారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏర్పడితేనే కేంద్ర నిధులు సమర్థవంతంగా వినియోగమై రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయ పడ్డారు. అంతకు ముందు మేడిపల్లి, భీమారం మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. కాచారంలో రూ.18 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించడంతో పాటు రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులకు, దమ్మన్నపేటలో రూ.8.50 లక్షల సీసీ రోడ్డు పనులకు, మన్నెగూడెంలో రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. దేశాయిపేటలో ఎంపీ లాడ్స్ నిధులతో రూ.9 లక్షల వ్యయంతో నిర్మించిన బస్టాండ్‌ను ప్రారంభించడంతో పాటు రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును కూడా ప్రజలకు అంకితం చేశారు. కథలాపూర్ మండలంలో మధ్యాహ్నం 3 గంటలకు బొమ్మెన గ్రామంలో పిడుగు ఆనంద్ రెడ్డి బిజెపి నాయకులు పరామర్శించి, గంభీర్పూర్ గ్రామంలో డ్రైన్ నిర్మాణం కొరకు భూమి పూజ చేశారు.

తండ్రియాల టీ జంక్షన్ వద్ద కార్యకర్తలతో మాట్లాడి, పోసానిపేట గ్రామంలో బీసీ కాలనీలో సిసి రోడ్, దుంపేట గ్రామంలో సిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో భీమారం మండల బీజేపీ అధ్యక్షులు నాగం శివకుమార్, జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, రాష్ట్ర అధికార ప్రతినిధి వేములవాడ నియోజకవర్గం ఇంచార్జ్ చెన్నమనేని వికాస్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చెన్నమనేని సత్యారావ్, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, కో కన్వీనర్ క్యాతం ధశరత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కరండ్ల మధుకర్, సర్పంచులు ఎనుగుల లచ్చయ్య, దుంపల నివేదిత మనోజ్ రెడ్డి, కోటగిరి గంగరాజు లింగం, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు అన్నాడి జలపతిరెడ్డి, మండల అధ్యక్షులు మల్యాల మారుతి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వరరావు బిజెపి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కోడిపెల్లి గోపాల్ రెడ్డి, నాయకులు నరెడ్ల రవి, బద్రి సత్యం, కాసోజీ ప్రతాప్, ముంజ శ్రీనివాస్, కాటిపెల్లి జగన్ రెడ్డి, జంగ మధు, సాయిరెడ్డి, గంగారెడ్డి, వంశీ, సత్తయ్య, పవన్, రాము, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం కరీంనగర్ జిల్లాలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్



## మంత్రి శ్రీధర్‌బాబుతో విక్టోరియా విప్ లీటార్లామిస్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 4:** విక్టోరియా(ఆస్ట్రేలియా) శాసనమండలి ప్రభుత్వ విప్ లీటార్లామిస్ శనివారం సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో ప్రధానంగా తెలంగాణ – విక్టోరియా మధ్య వాణిజ్య, సాంకేతిక సహకారంపై చర్చించారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్, స్టార్టప్ ఎకోసిస్టమ్, విద్య, నైపుణ్యాభివృద్ధి, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, గేమింగ్, విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్, ఎంటర్ టైన్ మెంట్ తదితర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా... తెలంగాణను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా తీర్చి దిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలను మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా రాష్ట్రంలో ఇండస్ట్రియల్ ఎకో సిస్టంను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో... అంతర్జాతీయ భాగస్వామ్యాలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణ అత్యంత అనుకూలమని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా స్థానిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కోరారు. తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నాం. ఏయే అంశాల్లో కలిసి పని చేసేందుకు అవకాశాలున్నాయో గుర్తించి... ఆ దిశగా సమగ్ర రోడ్డు మ్యాప్ ను సిద్ధం చేసుకుని ముందుకెళ్తాం' అని విప్ లీ టార్లామిస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎస్ సంజయ్‌జాజు పాల్గొన్నారు.

# సిద్దిపేటకు రేవంత్ గ్రహణం

### కాంగ్రెస్ పాలనలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలు

### ప్రజలు సరైన నిర్ణయం తీసుకుంటే మళ్లీ బిఆర్ఎస్ ఖాయం: హరీశ్‌రావు



మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** సిద్దిపేటకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూపంలో గ్రహణం పట్టిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేటలో నిర్వహించిన రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రియల్ ఎస్టేట్ రంగం బాగుంటే దానికి అనుబంధంగా ఉన్న సిమెంట్, స్టీల్, టైల్స్, శానిటరీ, మార్బుల్స్ వంటి అనేక రంగాలు అభివృద్ధి చెందుతాయని, ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ ఆదాయం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిందని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ రంగం మందగించడం వల్ల చిన్న వ్యాపారాలు, టీ హోటళ్లు, దుకాణాలు, ఇతర అనుబంధ రంగాలు తీవ్రంగా నష్టపోయాయని, వ్యాపారులు ఆర్థిక ఇబ్బందులతో వాహనాల ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితి నెలకొన్నదని, కుటుంబాలు పిల్లల ఫీజులు కూడా చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సిద్దిపేటలో కలెక్టరేట్, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, కేంద్రీయ విద్యాలయం, రైల్వే స్టేషన్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలతో రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో భూముల విలువలు కూడా పెరిగాయని పేర్కొన్నారు. ఒకప్పుడు సిద్దిపేటలో భూముల కోసం ఇతర జిల్లాలు, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ నుంచి పెట్టుబడిదారులు వచ్చేవారని, ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. కోటి రూపాయల విలువ చేసే ఆస్తులు కూడా అమ్ముడుపోని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా రెండేళ్లు ఓపిక పట్టాలని, ప్రజలు సరైన నిర్ణయం తీసుకుంటే మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సిద్దిపేట అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సిద్దిపేట ఫ్రెండ్స్ టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు.



## అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి

### అల్లూరి సీతారామరాజుకు అదే నిజమైన నివాళి: డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త :** అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేయడమే మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు మనం ఇచ్చే నిజమైన నివాళని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అల్లూరి సీతారామరాజు 129వ జయంతిని పురస్కరించుకుని మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద శనివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించడం సీతారామరాజు నైజమన్నారు. కేవలం 27 ఏళ్ల ప్రాయంలోనే దేశ స్వాతంత్ర్యం కోసం, గిరిజనుల హక్కుల కోసం అల్లూరి చేసిన త్యాగం అనిర్వచనీయమని కొనియాడారు. ప్రజల కోసం, ప్రజల ద్వారా, ప్రజల కోసమే సాగిన ఆయన విప్లవ పోరాటం నేటి తరానికి నిరంతర స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అల్లూరి కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని, స్వేచ్ఛాకాంక్ష గల ప్రతి భారతీయుడి గుండెల్లో కొలువై ఉన్న ఒక గొప్ప శక్తి అని ఆయన అభివర్ణించారు. ఈ జయంతి వేడుకల్లో భాగంగా, క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో సమకూర్చిన అంబులెన్స్‌ను విక్రమార్క మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ అధికారులకు అందజేశారు. పోలీసుల విధి నిర్వహణలో, ముఖ్యంగా అత్యవసర సమయాల్లో ఈ అంబులెన్స్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## రైతుల ఖాతాల్లో రూ.7,135.77 కోట్లు

### 5 నుంచి 6 ఎకరాల వరకు రైతు భరోసా

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** ఈ ఖరీఫ్ సీజనుకు సంబంధించి రైతు భరోసా కింద ఇప్పటి వరకూ 67.45 లక్షల మంది బ్యాంకు ఖాతాల్లో రూ.7,135.77 కోట్లను జమ చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ రికార్డు స్థాయిలో రైతు భరోసా నిధులను వారి ఖాతాల్లో జమ చేస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా శనివారం 5 నుంచి 6 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు రూ.545.41 కోట్లను జమ చేసినట్లు వెల్లడించారు. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా 1.69 లక్షల మంది రైతులు రైతు భరోసా సాయం పొందారని తెలిపారు. ఇప్పటికే తొలి నాలుగు విడతలలో 4 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతులకు ఈ నిధులు విడుదల చేశామని వివరించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల అభ్యున్నతే లక్ష్యమని పేర్కొన్నారు.

## తక్కువ నీటి పంటలకు మారాలి

### మినీ వర్శిటీలుగా కృషి విజ్ఞాన్ కేంద్రాలు

### ఉద్యాన వర్సిటీ వైస్-చాన్సలర్ రాజిరెడ్డి

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం, తగ్గుతున్న జలాశయాల నీటి మట్టాలపై ఆందోళనల నేపథ్యంలో, లాభదాయకతను మెరుగుపరచుకోవడానికి తెలంగాణ రైతులు కూరగాయలు, ధాన్యాలు, నూనెగింజలు, పప్పుధాన్యాలు వంటి తక్కువ నీరు అవసరమయ్యే పంటలను పండించాలని తెలంగాణ ఉద్యానవన వర్సిటీ సూచించింది. ఇందుకు గాను సమీకృత వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని తెలిపింది. ప్రధానంగా కృష్ణా, గోదావరి జలాశయాలలో నీటిమట్టాలు తగ్గుతాయని అంచనాల ఉండటంతో, తక్కువ నీటితో పంటలను పండించాలని ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి. రాజిరెడ్డి రైతులకు సూచించారు. రాజేంద్రనగర్‌లోని ఉద్యానవన కళాశాలలో తెలంగాణలోని 16 కృషి విజ్ఞాన్ కేంద్రాలు (కేవీకేలు) నిర్వహించిన వార్షిక కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో ప్రసంగిస్తూ, డాక్టర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రం ఏర్పడినప్పుడు ఐదు ప్రధాన పంటలను సాగు చేసేవారని, అయితే అప్పటి నుండి సాగు ప్రధానంగా వరి, పత్తికి మాత్రమే పరిమితమైందని పేర్కొన్నారు.

ఈ మార్పు ఇతర పంటల ధరలు విపరీతంగా పెరగడానికి దారితీసిందని ఆయన వెల్లడించారు. ఎల్ నినోతో ముడిపడి ఉన్న వర్షపాత హెచ్చుతగ్గులను ప్రస్తుతం ప్రధానంగా ఉన్న పంటలు తట్టుకోలేవని పేర్కొంటూ, పర్యావరణ అనుకూల పంటలను ఎంచుకోవాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. ఎల్ నినో ప్రభావాన్ని ఒక అవకాశంగా మలచుకోవడానికి ఉద్యానవన పంటలను విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

సమీకృత వ్యవసాయ పద్ధతులను అవలంబించడం వల్ల వ్యవసాయ, ఉద్యానవన, పాడి రంగాలకు ఊపు వస్తుందని, తద్వారా రైతులకు నికర లాభాలు చేకూరుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కృషి విజ్ఞాన్ కేంద్రాలు మినీయూనివర్శిటీలు గా అభివృద్ధి చెందాలని ఆయన అభిప్రాయపడ్డారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించడంలో కేవీకేలు కీలక పాత్ర పోషిస్తాయని అటారీ జోన్10 డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన పంటలలో స్థానిక, దేశీయ రకాలను సాగు చేయాలని కూడా ఆయన సూచించారు.

# దేశ ఆర్థిక క్రమశిక్షణకు రోశయ్య ప్రణాళికలే ఆదర్శం

### రోశయ్య 93వ జయంతి వేడుకలో కార్మిక మంత్రి గడ్డం వివేక్

### రోశయ్య జీవితం తెరిచిన పుస్తకం : మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జులై 4, ప్రభాతవార్త :** కొణిజేటి రోశయ్య సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థికశాఖ మంత్రిగా అత్యధికసార్లు బడ్జెట్ రూపకల్పన చేసి రాష్ట్ర ఆర్థిక క్రమశిక్షణతో వ్యవస్థను విజయవంతంగా నడిపించి దేశానికి ఆదర్శంగా నిలిచారని తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉపాధి శిక్షణ గనులశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో రోశయ్య 93వ జయంతి సభ అధికారికంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి జి.వివేక్ ఇతర అతిథులతో కలిసి రోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతిప్రకాసనంచేసి ఘననివాళులర్పించి, ప్రముఖ ప్రవచనకర్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఆధ్యాత్మికవేత్త డా. గరికిపాటి నరసింహారావు దంపతులను ఘనంగా సత్కరించి ప్రసంగించారు. విలువలతో కూడిన రాజకీయవేత్తగా ఎన్నో పదవులు హుందాగా నిర్వహించిన రోశయ్య రాజకీయ నాయకులందరికీ రోల్‌మోడల్ అన్నారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు రోశయ్య ప్రతిపక్ష నాయకుడుగా బడ్జెట్‌లో ఉన్న అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన ప్రశ్నలు, సలహాలు అందించేవారని చెప్పారు. రాష్ట్ర ఆర్థికమంత్రిగా రాష్ట్రాన్ని అభ్యుదయమార్గంలో పయనింపజేస్తూ అవసరమైన సంక్షేమపథకాలను సక్రమంగా అందిస్తూ ముందుకు నడిపించారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం గురించి కొట్లాడినప్పుడు ఇరురాష్ట్రాల భవిష్యత్తు ఆలోచించమని ఉద్బోధించే వారని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం, ఉపయోగం కోసం అర్ధరాత్రి కూడా సెక్రటేరియట్‌లో ఉండి ఫైల్స్ క్లియర్ చేసేవారని గుర్తుచేశారు.

తెలంగాణ రాష్ట్ర రోడ్లు, రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థి రాజకీయాల్లో ఎన్ఎస్‌యుఐ నాయకుడిగా ఉన్ననాటి నుండి యువకుడిగా ఆయనతో సన్నిహితంగా అనేక సందర్భాల్లో ఎన్నో విషయాలు చర్చించే విషయంలో, రాజకీయ అవగాహన చేసుకోవడంలో కొణిజేటి రోశయ్యకు ఏకలవ్య శిష్యుడుగా నేర్చుకున్నానని, అలాగే ఆర్థికంగా క్రమశిక్షణ ఉంటే కుటుంబానికి, వ్యక్తులకే కాదు రాష్ట్రానికి, దేశంలో ఆర్థికశాఖ మంత్రులకు, ఆర్థిక వ్యవహారాలు చూసే ప్రతీఒక్కరికీ రోశయ్య జీవితం ఒక తెరిచిన పుస్తకం, మార్గదర్శకత్వమని స్పష్టం చేశారు.

అనంతరం రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు కోలేటి దామోదర్‌గుప్తా ప్రసంగించారు. ఉప్పల శ్రీనివాసగుప్తా మాట్లాడుతూ 14సార్లు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టి ఆర్థిక వ్యవస్థకే వన్నెతీసుకొచ్చి దేశంలోనే ఎన్నో ముఖ్యరాజకీయ పదవులు అలంకరించి ఏమంత్రి చేయలేని పనిని రోశయ్య చేశారన్నారు. ఎదిగేకొద్దీ ఒదిగుండాలని తదితర ఆశయాలు కొనసాగిస్తే అత్యున్నతస్థాయికి చేరుకుంటామని స్పష్టం చేశారు. అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ రోశయ్య జయంతి వర్ధంతులను అధికారికంగా జరుపుతున్నా మనవంతుగా తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో కెఎస్ఆర్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్‌ను ఈ సంవత్సరమే ఏర్పాటు చేశామని, దానిద్వారా ప్రతీ సంవత్సరం మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని నిర్ణయిచుకోగా ఈ సంవత్సరం 200మంది విద్యార్థులకు ఈరోజు ఇదే వేదిక నుండి అందజేస్తున్నట్లు ప్రకటించారు. చివరిగా మంత్రులు జి.వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్‌లు, బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే వినోద్, ఎ.వాణీప్రసాద్, కెవిపి.రామచందర్‌రావు, టి.జి.వెంకటేష్, కోలేటి దామోదర్ గుప్తా, అమరవాది లక్ష్మీనారాయణ, కాల్వ సుజాత, గణేష్‌గుప్తా, కె.మల్లికార్జున్, కొణిజేటి శివ సుబ్బారావు, డా. ఏనుగు నరసింహారెడ్డి, దైవజ్ఞశర్మ తది తరులు కెఎస్ఆర్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ లోగోను ఆవిష్కరించి, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు.



గరికిపాటి నరసింహారావు దంపతులను ఘనంగా సత్కరిస్తున్న వివేక్, ప్రభాకర్, మహేష్‌కుమార్‌గౌడ్, టి.జి.వెంకటేష్, దామోదర్‌గుప్తా, శ్రీనివాసగుప్తా, దైవజ్ఞశర్మ, ఎ.నరసింహారెడ్డి, లక్ష్మీనారాయణ, వాణీప్రసాద్ తదితరులు

## ఉచిత రైతు డిస్కంపై అభ్యంతరాలు

### భవిష్యత్ ప్రణాళికపై అనుమానాలు

### అరకొర ఏర్పాట్లతో ఎలా సాధ్యం?

### సిబ్బంది కొరతతో అందని సేవలు

**హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త:** మూడో ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థ రైతు డిస్కం లైసెన్సుకు సంబంధించి తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఈఆర్‌సీ) పలు అభ్యంతరాలను వ్యక్త చేసింది. రైతు డిస్కమ్ ఏర్పాటుకు సంబంధించిన లైసెన్సు, విధివిధానాలపై పలు అనుమానాలు, షరతులు వ్యక్తం చేసింది. సుమారు 30 లక్షల వ్యవసాయ కనెక్షన్లు, 42 శాతం విద్యుత్ వాటా కలిగిన ఈ డిస్కమ్ నిర్వహణ తీరుపై కమిషన్ లేవనెత్తిన ప్రధాన అంశాల్లో సిబ్బంది కొరత వల్ల మెరుగైన సేవలు ఎలా సాధ్యమని ప్రశ్నించింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు గానూ కేవలం 2,000 మంది సిబ్బందిని మాత్రమే కేటాయించడంపై ఈఆర్‌సీ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. వినియోగంలో 42 శాతం వాటా ఉన్నప్పుడు ఉద్యోగులు కూడా అదే నిష్పత్తిలో ఉండాలని స్పష్టం చేసింది. మండలానికి ఒక్క ఉద్యోగి చొప్పున కేటాయించి, అంతపెద్ద డిస్కమ్ కార్యకలాపాలను ఏ విధంగా నిర్వహిస్తారని ఇంధన శాఖను ఈఆర్సీ ప్రశ్నించింది.

ఇంత భారీ నెట్‌వర్క్‌ను పర్యవేక్షించడానికి ప్రభుత్వం 2 వేల మంది సిబ్బందిని మాత్రమే కేటాయించాలని నిర్ణయించడంతో వినియోగదారులకు పూర్తి స్థాయిలో సర్వీసులు ఎలా అందించగలరని నిలదీసింది. అలాగే భవిష్యత్తు ప్రణాళికపై పలు అనుమానాలు వ్యక్తం చేసింది.

పాత కండక్టర్లు, లోవోల్టేజ్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల కాలిపోవడం వంటి సమస్యలను పరిష్కరించేలా సమగ్ర ప్రణాళిక ఉండాలని స్పష్టం చేసింది. మండలి అన్ని అభ్యంతరాలను, డిస్కమ్ అధికారుల వివరణలను పరిగణనలోకి తీసుకొని లైసెన్సు జారీపై తుది ఉత్తర్వులు జారీ చేసే ప్రక్రియను చేపట్టనుంది.

# అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం పెంచాలి

### క్యూర్ పరిధిలో అర్బన్ హౌసింగ్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

### అధికార యంత్రాంగానికి మంత్రి పొంగులేటి దిశానిర్దేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 4:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో వేగం పెంచాలని, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలో అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ స్కీమ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతమైంది. ఇది దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇదే స్ఫూర్తిని క్యూర్ పరిధిలో చేపట్టబోయే అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్‌పై కూడా చూపించాలని చెప్పారు. క్యూర్ పరిధిలో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలో ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వ ఆలోచనల మేరకు రెవెన్యూ, హౌసింగ్ విభాగాల అధికారులు సమిష్టిగా సమన్వయంతో పనిచేయాలన్నారు.

వీలైనంత త్వరితగతిన పేదలకు ఇళ్లు అందించే విధంగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికే ఖరారైన స్థలాలలో పొజిషన్ తీసుకొని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన కార్యాచరణను వేగవంతంగా రూపొందించాలని పేర్కొన్నారు. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించి తక్షణమే ఖరారు చేయాలి.క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాలకు గాను ప్రతి నియోజకవర్గంలో తొలి విడతలో 500 ఇళ్లు నిర్మిస్తున్నాం. ఈ ఇళ్లకు సంబంధించి టెండర్లను వీలైనంత త్వరలో ఖరారు చేస్తామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా పది ఆర్డీవో, 107 తహశీల్దార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రెండు డిఐజి, నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ భవనాలన్నీ ఒకే డిజైన్‌లో ఉంటాయి. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సదుపాయాలతో, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తున్నామని చెప్పారు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో సోలార్ పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి వి.పి. గౌతమ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



## డి.సిఎం పవన్‌ను దూషించిన కేసు
# యూట్యూబర్ జోసెఫ్ రావణ్ మళ్లీ అరెస్ట్

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను దూషించిన కేసులో యూట్యూబర్ జోసెఫ్ రావణ్‌పై రాష్ట్రంలో పలుచోట్ల కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన వరుసగా నాలుగోసారి అరెస్టయ్యారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంకోర్టు శుక్రవారం రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత అతనికి బెయిల్ మంజూరు చేసింది. కొద్దిసేపటికే శనివారం తెల్లవారు జామున అనకాపల్లి జిల్లా పాయకరావుపేట పోలీసులు మచిలీపట్నంలో అతన్ని మళ్లీ అదుపులోకి తీసుకున్నారు.జూన్ 30న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హిందుత్వవాది రాధా మనోహర్ దాస్‌లను లక్ష్యంగా చేసుకుని జోసెఫ్ రావణ్ తన యూట్యూబ్ ఛానల్‌లో అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు అప్‌లోడ్ చేశారు. దీనిపై కూటమి శ్రేణులు, జనసేన నేతలు రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. తొలుత పిఠాపురం పోలీసులు ఫిర్యాదుతో గత బుధవారం హైదరాబాద్‌లో అరెస్టయిన రావణ్‌కు అక్కడి కోర్టు బెయిల్ ఇచ్చింది. అయితే, ఆ వెంటనే కాకినాడ జిల్లా సర్పవరం పోలీసులు మరో కేసులో అతన్ని అరెస్ట్ చేశారు. ఆ కేసులోనూ బెయిల్ లభించింది. ఇదే క్రమంలో శుక్రవారం ఉదయం కృష్ణా జిల్లా మచిలీపట్నం పోలీసులు పాత కేసుల ఆధారంగా రావణ్‌ను అదుపులోకి తీసుకుని, ఇనగుదురు పోలీస్ స్టేషన్‌లో విచారించి మచిలీపట్నం మొబైల్ కోర్టు జడ్జి ఎదుట హాజరుపర్చగా రావణ్ తరపు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదనలు విన్న న్యాయస్థానం అతనికి బెయిల్ మంజూరు చేసింది.ఒంగోలుతో పాటు అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో జనసేన నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇప్పటికే అక్కడ కేసులు నమోదు కావడంతో మచిలీపట్నం కోర్టు బయట అదుపులోకి వెంటనే పాయకరావుపేట పోలీసులు అతన్ని మళ్లీ అరెస్ట్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ పశ్చిమ బైపాస్‌పై రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. ప్రమాద సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారిని రాజమండ్రికి చెందిన పురోహితుడు దువ్వూరి హరిప్రసాద్, మార్కాపురం జిల్లాకు చెందిన వీఆర్‌ఏ గురవయ్యగా పోలీసులు గుర్తించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పురోహితుడు హరిప్రసాద్ ప్రయాణిస్తున్న కారులో బ్రేక్, ఎక్సలేటర్ మధ్య కొబ్బరి బొండం ఇరుక్కుపోయింది. దీంతో కారు డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ముందుగా అదే మార్గంలో వెళ్తున్న వీఆర్‌ఏ గురవయ్య బైక్‌ను వెనక నుంచి బలంగా ఢీకొట్టడంతో పాటు ముందున్న కంటైనర్‌ను కూడా ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో పురోహితుడు దువ్వూరి హరిప్రసాద్, వీఆర్‌ఏ గురవయ్య ఇద్దరూ ఘటనాస్థలంలోనే మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## ముగ్గురు మహిళల బలవన్మరణం

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లాలోని గూడూరు మండలం అనంతవరప్పాడు గ్రామంలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఒకే ఇంట్లో ముగ్గురు మహిళలు హనుమకొండ రజిని కుమారి, మధుబాల, గౌరీదేవి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు మహిళల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన వెనుక కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యలు లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలపై గూడూరు పోలీసులు సమగ్ర విచారణ చేపట్టారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల నుంచి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## అల్లూరి సీతారామరాజుకు సిఎం
## చంద్రబాబు, మంత్రి లోకేష్ నివాళులు

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ నివాళులర్పించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ అల్లూరి త్యాగం, ధైర్యం, దేశభక్తి భారత జాతికి చిరస్మరణీయమని ముఖ్యమంత్రి కొనియాడారు. అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా ఆ మహావీరుడికి ఘన నివాళులు అర్పిస్తున్నాను అని చంద్రబాబు పోస్ట్ చేశారు.ఇక మన్యం వీరుడి పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యమని, తెలుగుజాతికి, దేశానికి స్ఫూర్తిప్రదాతగా నిలిచిన అల్లూరి సీతారామరాజు సేవలను ఈ సందర్భంగా స్మరించుకుందాం అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

**పింగళి వెంకయ్యకు సిఎం నివాళులు**
పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా సీఎం చంద్రబాబు,మంత్రి నారా లోకేష్‌లు నివాళులు అర్పించారు. మన జాతీయ పతాకాన్ని రూపొందించిన వెంకయ్య దేశభక్తి అపూర్వమన్నారు.

**మాజీ సీఎం రోశయ్యకు చంద్రబాబు నివాళులు**
మాజీ సీఎం రోశయ్య జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. విలువలతో కూడిన రాజకీయాలు, ఆర్థిక క్రమశిక్షణకు రోశయ్య ప్రతీక అని కొనియాడారు. ప్రజాజీవితంలో రోశయ్య చెరగని ముద్ర వేశారని అన్నారు. రోశయ్య నిబద్ధతతో కూడిన రాజకీయవేత్త అన్నారు.ఆయన ఆర్థిక మంత్రిగానూ పనిచేసి మంచి సేవలు అందించారన్నారు.

**అల్లూరికి డి.సిఎం పవన్ నివాళి**



మన్యం వేదికగా విప్లవ పోరాటాన్ని నిర్వహించిన స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఘన నివాళులు అర్పించారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలనను ధైర్యంగా ఎదిరించి, గిరిజన ప్రజల హక్కులు, గౌరవం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ పోస్టు పెట్టారు. **వంగవీటి రంగాకు నివాళి:** విజయవాడ తూర్పు నియోజకవర్గ దివంగత శాసనసభ్యుడు వంగవీటి మోహనరావు(రంగా) జయంతి సందర్భంగా ఆయనకు 'ఎక్స్' వేదికగా పవన్ నివాళి అర్పించారు.ఆశయ సాధన కోసం జీవితాన్ని త్యాగంచేసిన మహనీయుడు రంగా అన్నారు. నిరుపేదలు,బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి మరువలేదన్నారు,

# ప్రకాష్‌రాజ్, జోసెఫ్ రావణ్ సంఘ విద్రోహశక్తులు

## సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** చలనచిత్ర నటుడు ప్రకాష్‌రాజ్, యుట్యూబర్ జోసెఫ్ రావణ్ సంఘవిద్రోహ శక్తులుగా మారారని ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆరోపించారు.ప్రకాష్‌రాజ్‌కు జోసెఫ్ రావణ్‌తో ఏమైనా సంబంధం ఉందా? అనే అనుమానాలు వ్యక్తం చేశారు.శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రకాశ్‌రాజ్, బచ్చలకూరి జోసఫ్ వ్యాఖ్యలపై మంత్రి కందుల ఆగ్రహం వ్యక్తం చేశారు. జస్ట్ ఆస్కింగ్ అంటున్న ప్రకాశ్‌రాజ్, జోసఫ్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. అందుకు మా వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. జోసఫ్ ప్రశ్నించగానే జస్ట్ ఆస్కింగ్ అంటూ ప్రకాశ్‌రాజ్ వస్తారు. పవన్ కల్యాణ్ లక్ష్యంగా ఇద్దరూ కలిసి కుట్రలు చేస్తున్నారు. తెర ముందు వీరు ఉంటే, తెర వెనుక ఎవరున్నారో తేలాలి. తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లోనే ఈ కుట్ర సాగుతుంది. కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కుట్రలు చేస్తున్నారు. ఇలాంటి సంఘవిద్రోహ శక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్సీపీ పాలనలో జస్ట్ ఆస్కింగ్ అని ఎందుకు అడగలేకపోయారు? పవన్ కల్యాణ్‌ను ఒక కుల చట్రంలో బంధించేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. ప్రశ్నించడం అంటే బూతులు తిట్టడం, వ్యక్తిగత విమర్శలు చేయడమా అని కందులు దుర్గేష్ ప్రశ్నించారు.

## 9 మంది డిఎస్పీలకు అదనపు
# ఎస్పీలుగా పదోన్నతి

**విజయవాడ,జూలై 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 9మంది డీఎస్పీలు అదనపు ఎస్పీలుగా పదోన్నతి పొందారు.ఈ మేరకు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేసారు. పదోన్నతి పొందిన వారిలో ఎం.రాజగోపాల్‌రెడ్డి, పి.శ్రీకాంత్, టి.శ్రీనివాసులు, జి.శివప్రభాకర్ రెడ్డి,డి.సోమన్న, ఎ.ఎస్.చక్రవర్తి, ఎం.అంబికా ప్రసాద్, ఎస్. వాసుదేవ్, ఎ.నరసింహామూర్తి ఉన్నారు.వీరంతా పోలీసు హెడ్‌క్వార్టర్స్ మంగళగిరిలో రిపోర్ట్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# విశాఖలో ఆరుగురు బిఎల్‌ఒల సస్పెన్షన్

## విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై కలెక్టర్ సీరియస్

**విశాఖపట్నం, జూలై 4 ప్రభాతవార్త:** విశాఖ జిల్లాలో ఆరుగురు సర్‌బూత్ లెవెల్ అధికారుల(బిఎల్‌ఓ)పై జిల్లా కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు.ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్రసవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఆరుగురు బూత్ లెవల్ అధికారుల్ని (బీఎల్‌వోలు) సస్పెండ్‌చేస్తూ విశాఖకలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. భీమిలి నియోజకవర్గ పరిధిలో భీమిలి అర్బన్‌కు చెందిన బీఎల్వో సువర్ణ (పోలింగ్ స్టేషన్177), వి. వెంకటసాయి శరణ్ (పీఎస్359), దక్షిణ నియోజకవర్గపరిధిలో ఎం.డి.షాహిద్ (పిఎస్66), బి.లక్ష్మీనిహారిక(పీఎస్220), తూర్పు నియోజకవర్గ పరిధిలో చిట్టిబోయిన గంగాజలం (పీఎస్272), చేపలరామాంజనేయులు(పోఎస్‌లు114, 123)పై ఈ చర్యలు తీసుకున్నారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తమ విధుల్ని సక్రమంగా నిర్వర్తించకపోవడంతో పాటు, రిప్రెజెంటేషన్ ఆఫ్ దిపీపుల్స్ యాక్ట్1950లోని సెక్షన్32 నిబంధనలకు విరుద్ధంగా వారంతా వ్యవహరించినట్టు గుర్తించిన నేపథ్యంలో కలెక్టర్ ఈకఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ఓటరుజాబితా సవరణ ప్రక్రియలో విధి నిర్వ హణలో బాధ్య తారాహిత్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కలెక్టర్ హెచ్చరించారు.

# ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అల్లూరి


## టిటిడి ఆధ్వర్యంలో జయంతి



**తిరుమల,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని, ఆయన త్యాగం, ధైర్యం, దేశభక్తి నేటి యువతకు ఆదర్శమని మన్యం జిల్లా సీతంపేటకు చెందిన సాంఘిక శాస్త్రఉపాధ్యాయుడు ఆర్. మోహన్‌రావు నాయుడు పేర్కొన్నారు. టిటిడి సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో తిరుపతి అన్నమాచార్య కళా మందిరంలో శనివారం అల్లూరి సీతారామరాజు 129వ జయంతి జరుపుకున్నారు. మోహన్‌రావు నాయుడు మాట్లాడుతూ బ్రిటిష్ పాలనలో ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులు తీవ్ర దోపిడీ, అణచివేత, అన్యాయాలకు గురయ్యారని తెలిపారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో గిరిజనులకు అండగా నిలిచిన అల్లూరి సీతారామరాజు వారిని ఏకం చేసి, దురలవాట్లకు దూరం చేసి, యుద్ధ విద్యలు, గెరిల్లా పోరాట పద్ధతుల్లో శిక్షణ ఇచ్చి బ్రిటిష్ పాలకులను ధైర్యంగా ఎదుర్కొన్న మహోన్నత నాయకుడని కొనియాడారు. టిటిడి డిప్యూటీ ఇఒ ఆనందరాజు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు తన అసమాన త్యాగం, వీరోచిత పోరాటంతో మన్యానికి చిరస్థాయి కీర్తిని తీసుకువచ్చారన్నారు. ఆయన సేవా స్ఫూర్తిని ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆడిట్ అధికారి వెంకటేశ్వర్లు,అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు టిటిడి సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో అల్లూరి సీతారా మరాజు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అన్నమయ్య విగ్రహానికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు.

# తిరుపతి శివార్లలో చిరుత కలకలం

## ఓ ఇంట్లోకి చొరబడేందుకు యత్నం



**తిరుపతి, జులై 4 ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం అడవులకు ఆనుకునే ఉన్న తిరుపతి నగర శివార్లలోని కరకంబాడి ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి ఓ చిరుతపులి ఏకంగా ఇంట్లోకి జొర బడింది. ఇంటి ఆవరణలో పూర్తిగా సంచరిం చింది. ఆ ఇంటి ఆవరణలో అమర్చిన సిసి కెమెరాల్లో ఈ దృశ్యాలు కనిపించడంతో ఇంటి కుటుంబ సభ్యులు భయంతో వణికిపోయారు. అందరూ కలసి గట్టిగా కేకలు వేయడంతో చిరుతపులి అక్కడ నుండి అడవిలోకి పరుగులు తీసింది. గత కొంతకాలంగా శేషాచలం అట వీప్రాంతం నుండి చిరుతపులులు, ఏనుగులు, ఎలుగు బంట్లు జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. ప్రధానంగా అడవికి ఆనుకునే ఉంటున్న కాలనీల్లోకి యధేచ్ఛగా జంతువులు సంచరించడం మామూలైంది. తిరుపతి నగర శివార్లలో చిరుత పులుల సంచారం ప్రజలను భయాం దోళనలకు గురిచేస్తోంది. రేణిగుంట మండలం వెంకటాపురం గ్రామంలో నివాసముంటున్న అధ్యాపకుడు బాలాజీ ఇంటికి అర్ధరాత్రి ఓ చిరుత పులి జొరబడింది. ఇంటి సిసి కెమెరాల్లో గమనించిన కుటుంబసభ్యులు గట్టిగా కేకలు వేయడంతో చిరుత దారిమళ్లి అడవిలోకి వెళ్ళిపోయింది. ఆహారంకోసం ఇలా దారితప్పి వచ్చినట్లు అటవీశాఖ వర్గాలు పేర్కొన్నాయి. చిరుతపులి సంచారానికి సంబంధించిన దృశ్యాలు ఇంటి ఆవరణలో ఉన్న సిసి కెమెరాలో రికార్డయ్యాయి. అర్ధరాత్రివేళ చిరుత పిల్లిలా నక్కినక్కి రావడం, ఇంట్లోకి దూరాలని చూడటం ఆ ఫుటేజీలో కనిపించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకుని పరిశీలించారు. ప్రజలు రాత్రివేళల్లో ఒంటరిగా తిరగవద్దని, అప్రమ త్తంగా ఉండాలనిహెచ్చరించారు. చిరుతను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

## దేవునిపై విశ్వాసంతో కొండకు..
# అలిపిరి మెట్లెక్కివచ్చిన 116 యేళ్ల అవ్వ



**తిరుమల,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** దేవునిపట్ల విశ్వాసం..ఆపై వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలనే పట్టుదల ఆ శతాధిక వృద్ధురాలి వయసు ముందు ఓడిపోయిందనే చెప్పవచ్చు. ఏకంగా అలిపిరి మెట్లదారిలో శతాధిక వృద్ధురాలు అలుపుసొలుపు లేకుండా అమాంతం 3,550 మెట్లు మార్గాన్ని ఎవరి సహాయం తీసుకోకుండా, చేతిలో కేవలం ఒక కర్రను ఆసరాగా పట్టుకుని, గోవిందా. గోవిందా అంటూ ఒక్కో మెట్టు ఎక్కుతూ శనివారం ఉదయం తిరుమల చేరు కున్నారు. ఇప్పుడు ఈ బామ్మ వీడియో యువతలో స్ఫూర్తిని నింపేలా మారింది. ఇంత వృద్ధాప్యంలోనూ లభించిన శారీరక, మానసికశక్తి వేంకటేశ్వరస్వామి అనుగ్రహమేనని తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మరికొందరు మాత్రం ఆమె సంకల్పం, జీవనశైలి, మానసిక దృఢత్వమే కారణంగా భక్తులు చెబుతున్నారు. ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసం, భక్తి చూసిన సహ యాత్రికులు ఆశ్చర్యపోయారు. ఈ ఘటనను చూసిన పలువురు భక్తులు, ఇంత వృద్ధాప్యంలోనూ ఆమెకు లభించిన శారీరక, మానసిక శక్తి వేంకటేశ్వరస్వామి అనుగ్రహమేనని తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఏది ఏమైనా, 116ఏళ్ల వయస్సులో అలిపిరి మెట్ల మార్గంలో తిరుమల చేరిన భీమవ్వ ప్రయాణం ఇప్పుడు వేలాది మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. ఈ వీడియోను చూసిన నెటిజెన్లు అభినందిస్తూ పోస్టింగ్స్ పెడుతున్నారు. ఈమె కర్ణాటకకు చెందిన మహిళగా తెలిసింది. 116 ఏళ్ల బామ్మ తన కుటుంబసభ్యులతో కలిసి తిరుమల మెట్లు ఎక్కుతుండటాన్ని చూసిన మరో భక్తురాలు వీడియో తీశారు.

## రావణ్‌పై ఎపిలో కక్షసాధింపు చర్యలు: ప్రకాశ్‌రాజ్

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** యూట్యూబర్ రావణ్‌పై ఏపీలో కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని "ఎక్స్" మాధ్యమంగా చలనచిత్రనట్టుడు,సామాజిక వేత్త ప్రకాశ్‌రాజ్ ఆరోపించారు. ఏలూరులో పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు వైరల్ అయిన తర్వాత పిఠాపురం పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. కాకినాడ కోర్టు బెయిల్ మంజూరు చేయగా, వెంటనే సర్పవరం పోలీసులు మరో పాత కేసులో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. రావణ్‌పై మొత్తం 30 కేసులు ఉన్నాయని, ఇది స్పష్టమైన ప్రతీకార చర్య అని ప్రకాశ్ రాజ్ ఆరోపించారు. జనసేన కార్యకర్తలు పోలీస్ వాహనాన్ని అడ్డుకున్న ఘటనను కూడా ఆయన ప్రస్తావిస్తూ ప్రశ్నిస్తే చంపేస్తారా? అని ప్రశ్నించారు. జోసెప్ విషయంలో అరెస్ట్.. బెయిల్.. మళ్లీ అరెస్ట్. మీరు తప్పు చేస్తున్నారని మీకు కోర్టులు స్పష్టంగా చెప్పడం లేదా? మీ కక్షపూరిత రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు" అంటూ ప్రకాశ్ రాజ్ విమర్శలు గుప్పించారు. ప్రశ్నించే వారిని అధికారాన్ని దుర్వినియోగం చేసి అణచివేయడం ఎంతవరకు సాగుతుంది? కోర్టు బెయిల్ ఇచ్చిన వెంటనే మరో కేసు తెరిచి వేధించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు.

# తిరుమల సమాచారం



## వారాంతం రద్దీ: శ్రీవారి దర్శనానికి 24గంటలు

**తిరుమల,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం సెలవులతో తిరుమల శనివారం ఉదయానికి పూర్తిగా నిండిపోయింది. ఉదయం 5గంటలకే వైకుంఠమ్ 2క్యూకాంప్లెక్స్,నారాయణగిరి షెడ్లు నిండి భక్తుల లైన్లు మూడుకిలోమీటర్లు శిలాతోరణం వరకు చేరాయి. దీంతో స్వామివారి దర్శనానికి 24గంటల సమయం నిరీక్షణ తప్పలేదు. ఆదివారం కూడా భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పరిస్థితిని పూర్తిస్థాయిలో అదుపులో ఉంచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. శనివారం ఉదయానికి లక్షమందిపైగా భక్తులు తిరుమలకు చేరారు.శుక్రవారం రాత్రి వరకు 71,668మంది భక్తులకు మహాలఘులో స్వామివారి దర్శనం చేయించారు. శనివారం సాయంత్రం వరకు 43 వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారు.

# 17న ఆణివార ఆస్థానం, 14న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సాలకట్ల ఆణివార ఆస్థానంపర్వదినం 17వతేదీ శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహిం చనున్నారు.ఆలయం లోపల ఈ వేడుక జరిపిస్తారు.ఈ సందర్భంగా 14వతేదీ మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. ఆలయ అర్చకులు, అధికారులు మహాయజ్ఞులా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయం అంతటా సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధిచేయనున్నారు. ఆలయంలోపల బంగారువాకిలి నుండి ఉపఆలయాలు, మహాద్వారం వరకు నీటితో శుభ్రం చేయనున్నారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం,గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పరిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేస్తారు, అష్టదళపాదపద్మారాధన సేవ రద్దయ్యింది. 17వతేదీ ఆలయంలో ఆణివార ఆస్థానం జరగనుంది. ఆ రోజు సాయంత్రం ఉభయదేవేరులతో కలసి మలయప్పస్వామి సువాసనల పుష్పపల్లకిపై ఊరేగుతారు. ఈ రెండు పర్వదినాల సందర్భంగా 13వతేదీ సోమవారం, 16వతేదీ గురువారం దర్శనాలకు ఫార్సు లేఖలు స్వీకరించరు. జూలై 17న కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలను రద్దు చేశారు.



# టిటిడి కపిలేశ్వరస్వామి ఉన్నతపాఠశాల విద్యార్థులకు నగదుతో సన్మానం

**తిరుమల,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ తాటితోపువెంకటపతి నగర్‌లో నిర్వహిస్తున్న కపిలేశ్వరస్వామి ఉన్నత పాఠశాల విద్యార్థులకు నగదు సన్మానం చేశారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు పాఠశాల పూర్వ విద్యార్థులు నగదు వెండి డాలర్లతో సన్మానించారు.ఈ పాఠశాలలో చదివిన 10వ తరగతిలో 562/600 మార్కులు సాధించిన ప్పి. జనని ప్రథమ స్థానంలో నిలిచింది.విద్యార్థినికి పూర్వ విద్యార్థులు 25వేల రూపాయలు నగదు బహుమతి, 10గ్రాముల వెండి డాలరు బహూకరించారు. పాఠశాల పట్ల వారికున్న భక్తిని ఔదార్యాన్ని చాటుకున్నారు. రెండవ ర్యాంక్ సాధించిన 545/600 మార్కులు సాధించిన చిరంజీవి విజయ దుర్గకు 10వేల నగదు,10 గ్రాముల వెండి డాలర్‌తో సత్కరించారు.ఈ పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు పండిట్ నాగేంద్ర నాయక్ ఇద్దరు విద్యార్థులకు 1,500రూపాయలు , వెయ్యి వెయ్యి రూపాయలు నగదుతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు నంబూరి రెడ్డి దినేష్, దొరబాబు,శివ కృష్ణ,దీనా రెడ్డి ,వసంత, అశోక్ పాల్గొన్నారు. మంచిగా చదువుకుంటే అన్ని సమస్యలకు సమాధానమని మన స్థితిగతులను మార్చే శక్తివంతమైన సాధనమని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులందరూ బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని పిలుపునిచ్చారు. రాబోయే విద్యా సంవత్సరంలో 540 మార్కులు పైబడిన విద్యార్థులకు వెండి డాలర్లతో సత్కరిస్తానని హామీ ఇచ్చారు. బాగా చదివే విద్యార్థులకు ఎల్లవేళలా తాము అండగా నిలబడతామని భరోసా ఇస్తూ ప్రస్తుతం పదవ తరగతిలో ఉన్న విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.కృష్ణమూర్తి పూర్వ విద్యార్థుల సహృదయతను, ఔదార్యాన్ని అభినందించి వారిని దుశ్శాలువలతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.టిటిడి యాజమాన్యం కల్పించిన సౌకర్యాలను తల్లిదండ్రులు వారి బిడ్డల కోసం సద్వినియోగం చేసుకొని తమ బిడ్డల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.

# భార్యపై విచక్షణారహితంగా భర్త దాడి

**తిరుపతి,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** ప్రవర్తన సరిగా లేదని, మాట వినడంలేదని భార్యపై భర్త విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటన తిరుపతి నగరం తూర్పు పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల చేను లో చోటు చేసుకుంది. చింతల చేనుకు చెందిన మహిళకు చిత్తూరుకు చెందిన రాజేష్‌తో కొన్నేళ్ళ క్రిందట వివాహమైంది.వీరికి 14యేళ్ల బాలిక, 12 యేళ్ల బాలుడు ఉన్నారు. వివాహమైన రెండు సంవత్సరాలు అత్తమామల సంపాదనలతో కుటుంబం సాగింది.పది సంవత్సరాల నుండి బలవంతంగా పడుపు వృత్తిలోకి దింపి ధనార్జన చేయిస్తున్నారు. ఆమె కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై ఆ వృత్తిని వదలిపెట్టింది. దీంతో భర్త పెట్టే వేధింపులు తట్టుకోలేక ఆమె పుట్టింటికి చేరింది. భర్త చేసిన తప్పులు బయటపడతాయని మహిళ తమ్ముడుప్రసాద్ తన కూతురిపై అసభ్యంగా ప్రవర్తించాడంటూ మహిళా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులకు ఆశ్చర్యం కలిగించే విషయాలు తెలిశాయి. మామయ్యపై మా నాన్న బలవంతంగా తప్పుగా చెప్పించాడని బాలిక వెల్లడించింది. తనకు సం బంధించిన విషయాలు బయటపెడుతుందని భార్యపై భర్త బంధువులు దాడికి దిగారు. ఆయన స్వప్రయోజనాలకులోను తీసుకొని 50లక్షలతో నిర్మించుకున్న రెండు అంతస్తుల భవనానికి అప్పు తీరే వరకు కాపురానికి రమ్మంటున్నాడని ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. 112కు కాల్ చేసిన బాధితురాలు తనకు ప్రాణహాని ఉందని పోలీసులు రక్షణ కల్పించాలంటూ వాపోయింది.

# వ్యవసాయ భూముల బదలాయింపు సులభతరం

## వారసత్వ భూములకు ఆటో మ్యుటేషన్ విధానం

## రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే రెవెన్యూ రికార్డుల్లో వారసుల పేర్లు

## రూ.10లక్షల లోపు విలువైన భూమికి స్టాంప్ డ్యూటీ కేవలం రూ.100

## వీలునామా లేకపోతే రిజిస్ట్రేషన్ సమయంలో ఎఫ్ఎంసి తప్పనిసరి

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూముల బదలాయింపు ప్రక్రియను ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. ఇప్పటికే నామమాత్రపు స్టాంప్ డ్యూటీతో రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతించింది. ఈ క్రమంలోనే మరో నిర్ణయం అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. వారసత్వ ఆస్తుల పంపకాల దస్తావేజు రిజిస్ట్రేషన్ పూర్తికాగానే, ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ (రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్పిడి) జరిగేలా కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ నిర్ణయంతో భూ యజమానులు మ్యుటేషన్ కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు తప్పనున్నాయి.గతంలో కుటుంబ పెద్ద మరణానంతరం వారసులు తమ పేర్ల మీదకు భూమిని మార్చుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవారు. ముందుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ (ఎఫ్ఎంసీ) కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత రెవెన్యూ అధికారులను ఆశ్రయించి మ్యుటేషన్ చేయించుకోవాల్సి వచ్చేది. ఈ ప్రక్రియ ఆలస్యం కావడంతో పాటు, రైతులకు శ్రమ, ఖర్చుతో కూడుకున్నదిగా ఉండేది.తాజా విధానం ప్రకారం, కుటుంబ సభ్యులు తమ మధ్య ఆస్తులను పంచుకుంటూ రాసుకున్న పంపకాల దస్తావేజును సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించిన వెంటనే, ఆ సమాచారం ఆన్‌లైన్‌లో రెవెన్యూ శాఖకు చేరుతుంది. దీని ఆధారంగా రెవెన్యూ రికార్డుల్లో వారసుల పేర్లను నమోదు చేసే ఆటో మ్యుటేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. దీంతో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఏకకాలంలో జరిగిపోతాయి. వీలునామా లేకపోతే ఎఫ్ఎంసీ తప్పనిసరి అవుతుంది.అయినప్పటికి ఈ ప్రక్రియలో ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిబంధనను చేర్చింది. కుటుంబ పెద్ద (తాత, తండ్రి లేదా తల్లి) ఎలాంటి వీలునామా రాయకుండా మరణిస్తే, వారసులు ఆస్తి పంపకాల దస్తావేజును రిజిస్ట్రేషన్ చేసే సమయంలో తప్పని సరిగా ఎఫ్ఎంసీ సమర్పించాల్సి ఉంటుంది. వీలునామా ఉంటే ఈ నిబంధన వర్తించదు.గతంలో ఏపీ ప్రభుత్వం వారసత్వ భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. రూ. 10లక్షల లోపు విలువైన వ్యవసాయ భూమికి కేవలం రూ. 100స్టాంప్ డ్యూటీగా, రూ.10లక్షలు దాటితే రూ. 1,000గా నిర్ణయించింది. ఇప్పుడు రిజిస్ట్రేషన్‌ను మ్యుటేషన్‌తో అనుసంధానించడం వల్ల రైతులకు పూర్తిస్థాయిలో హక్కులు వేగంగా లభిస్తాయి. పట్టాదారు పాస్‌పుస్తకాలు సకాలంలో చేతికి అందడంతోపాటు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు పొందడంకూడా సులభతరమవుతుంది. ఈ సమీకృత విధానం పరిపాలనలో పారద ర్శకతను పెంచడంతో పాటు, రైతులకు భరోసా కల్పిస్తుందని అధికారులు వివరిస్తున్నారు.

# అమరావతి రైతులను మోసగించిన సిఎం: మాజీ మంత్రి పేర్ని నాని

**విజయవాడ.జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రైతులను సీఎం చంద్రబాబు మోసం చేసారని మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. అమరావతిలో కట్టడాలకే వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని, రైతులకు ఎప్పుడు న్యాయం చేస్తారని ప్రశ్నించారు. అమరావతిని అప్పుల కుప్పగా మార్చుతున్నారని, ఎప్పటి లోగా నిర్మాణాలు పూర్తి చేస్తారో చెప్పటం లేదని వ్యాఖ్యానించారు. అసలు అమరావతికి ఎంత ఖర్చు చేస్తున్నారు.. ఎంత అవసరమో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఇప్పటికే రూ 50 వేల కోట్లు రాజధాని పేరుతో అప్పులు చేసారని చెప్పు కొచ్చారు. జగన్ పైన విమర్శలు చేసేందుకు.. తిట్టేందుకు ముందుకు వచ్చే మంత్రులు తమ శాఖల పని తీరు గురించి మాత్రం మాట్లాడరని మండిపడ్డారు. మావిగన్ అంటే మంత్రులు భయ పడుతున్నారని వ్యాఖ్యానించారు.సింగపూర్ తరహా రాజధాని నిర్మాణంచేస్తామని, చివరకు మున్సిపాల్టీ చేస్తున్నారని పేర్ని నాని చెప్పుకొచ్చారు. రాజధానిలో పేదలకు ఇచ్చిన 50 వేల పట్టాలు రద్దు చేసారని గుర్తు చేసారు. రాజధాని పేరుతో దోపిడీ ప్రజలకుకళ్లకు కట్టినట్లుగా కనప డుతోందని చెప్పారు. అమరావతి రైతులను కలి సేందుకు వెళ్తేదాడులుచేస్తారని, ఇదేం రాజకీ యమని ప్రశ్నించారు. రైతుల కష్టాలు చూసేం దుకు మళ్లీ అమరావతి వెళ్తాం, రైతులను కలుస్తామని పేర్ని నాని ప్రకటించారు.

# అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవం: ముళ్లపూడి రేణుక

**విజయవాడ జూలై 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాల్లో వేగంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసహనం, భయంతో కొత్త వివాదాలకు తెరలేపుతున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక విమర్శించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజల దృష్టిని అభివృద్ధి నుంచి మళ్లించేందుకే 'మామిగం' వంటి కొత్త రాజకీయ నాటకాలకు శ్రీకారం చుడుతు న్నారని ఆరోపించారు.

గతంలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టిన జగన్‌కు ప్రజలు ఎన్నికల్లోనే గట్టి తీర్పు ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. అయినప్పటికీ అమరావతిపై మళ్లీ రాజకీయాలు చేయడం ఆయన రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. అమరావతి కేవలం ఒక ప్రాంతం కాదని, అది ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని రేణుక స్పష్టం చేశారు. పార్లమెంట్ ఆమోదించిన చట్టబద్ధ రాజధానిపై ఇష్టానుసార వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ వ్యవస్థల పట్ల గౌరవం లేకపోవడానికే నిదర్శనమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధాని అమరావతి అయితే, జగన్ శాశ్వత నివాసం మాత్రం బెంగళూరు ప్యాలెస్ అని ఆమె విమర్శించారు.

# చింతాకు సాక్షిగా..



## పులిహోరలో..

**కావలసినవి :** చింతచిగురు–కప్పు, పొడి అన్నం– రెండు కప్పులు, వేరు సెనగ పప్పు–మూడు పెద్ద చెంచాలు, సెనగపప్పు–రెండు పెద్ద చెంచాలు, ఆవాలు–అర టీ స్పూను, మినపప్పు–పెద్ద చెంచా, పసుపు–కొద్దిగా, కరివేపాకు–నాలుగు రెబ్బలు, ఎండు మిర్చి–మూడు, నూనె–తగినంత, ఉప్పు–రుచికి సరిపడా, ఇంగువ–చిటికెడు.

**తయారీ :** అన్నం (ఉడుకుతున్నప్పుడే ఒక చెంచా నూనె, చిటికెడు ఉప్పు కలిపి) పొడిగా వండి చల్లార్చాలి. అర టీ స్పూను నూనెలో చింత చిగురును పచ్చివాసన పోయేవరకు చిన్నమంటపై వేయించి పక్కనుంచాలి. అదే కడాయిలో నూనె వేసి ఎండుమిర్చి వేరుసెనగ గింజలు, సెనగపప్పు, మినపప్పు, ఆవాలు, కరివేపాకు పసుపు, ఇంగువ ఒక్కొకనకటిగా వేగనిచ్చిత తాలింపుని చిగురుతో పాటు అన్నంలో కలిపితే సరి.

## కొబ్బరి పచ్చడిలో..

**కావలసినవి :** చింతచిగురు– కప్పు, తాజా కొబ్బరి





ముక్కలు– కప్పు, పసుపు– చిటికెడు, ఉప్పు– తగినత, పచ్చి మిర్చి– అయిదు, ఎండుమిర్చి–ఏడు, ఆవాలు–అరచెంచా, మినప్పప్పు– చెంచా, మెంతులు–కొద్దిగా, ఇంగువ– చిటికెడు, నూనె– మూడు చెంచాలు. **తాలింపు కోసం:** ఆవాలు, జీలకర్ర, మినపప్పు– చెంచా చొప్పున, కరివేపాకు– రెండు రెమ్మలు, ఎండుమిర్చి– ఒకటి. **తయారీ :** బాణలిలో నూనె పోసి కాగాక చింత చిగురు, కొబ్బరి ముక్కలు, ఉప్పు, పచ్చిమిర్చి తప్ప మిగిలినవన్నీ వేసుకుని ఎర్రగా వేయించుకోవాలి. అవి చల్లారాక మిక్సీలో వేసి ఒసారి తిప్పాలి. ఈ మిశ్రమానికి మిగిలిన పదార్థాలు కూడా చేర్చి మెత్తగా రుబ్బు కోవాలి. దీనికి చివరగా తాలింపు వేస్తే పచ్చడి తయారవుతుంది. అన్నంలోకి ఈ పచ్చడి చాలా బాగుంటుంది.



## చిన్న చేపలతో ..

**కావలసినవి :** చిన్న చేపలు–అరకిలో, చింత చిగురు–పావు కప్పు, ఉప్పు–రుచికి సరిపడా, ధనియాలపొడి–చెంచా, పసుపు కొద్దిగా, కారం–మూడు చెంచాలు, టొమాటో–చిన్నది, ఉల్లి పాయలు–మూడు, పచ్చి మిర్చి– నాలుగు, కరివేపాకు–రెండు రెబ్బలు.

**తయారీ :** ముందుగా చేపల్ని శుభ్రంగా కడిగి ఓ గిన్నెలోకి తీసుకోవాలి. ఇప్పుడు చింతాకుని చేత్తో పొడిలా నలిపి అందులోకి వేసుకోవాలి. ఆపై సన్నగా కోసి పెట్టుకున్న ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కల్ని, ధనియాల పొడి, కారం, ఉప్పు, పసుపు అన్నీ సంగం చొప్పున అందులో వేసి కలిపి మూత పెట్టి ఓ గంట పక్కనుంచాలి. ఈలోగా పొయ్యి వెలిగించి బాణలీలో ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమర్చి వేయించాలి. అవి రంగు మారాక మిగిలిన ఉప్పు, పసుపు, కారం, ధనియాలపొడి వేసి మూతపెట్టేయాలి. కాస్త నూనె పైకి తేలాక కలిపి పెట్టు కున్న చేపల్ని కూడా వేసి గరిటె పెట్టకుండా గిన్నె పైకి ఎత్తి కదపాలి. ఇలా చిన్న మంటమీద కాసూపు మగ్గనిచ్చాక నీళ్ల పోసుకోవాలి. అవన్నీ ఆవిరై కూర దగ్గర పడ్డాక కొంచెం కొత్తిమీర చల్లుకుంటే సరి.

## మటన్‌తో ..

**కావలసినవి :** చింత చిగురు–కప్పు, మటన్–అర కేజీ, ఉల్లిపాయలు–నాలుగు, పచ్చిమిర్చి– ఐదు, ఉప్పు, కారం–రుచికి తగినంత, అల్లం వెల్లుల్లి పేస్ట్–పెద్ద చెంచా, పసుపు– చిటికెడు, ధనియాల పొడి, గరం మసాలా– రెండు పెద్ద చెంచాల చొప్పున, నూనె– కొద్దిగా, జీలకర్ర– చెంచా, బిర్యానీ ఆకులు– మూడు.



**తయారీ :** మటన్‌ని కడిగి పక్కన పెట్టుకోవాలి. తర్వాత చింత చిగురును శుభ్రం చేసుకుని చేతులతో నలిపి పొడి చేసు కోవాలి. ఇప్పుడు, ఉల్లి, పచ్చిమిర్చిలను సన్నగా కోసి పెట్టుకోవాలి. కుక్కర్‌లో కొద్దిగా నూనెపోసి కాగాక.. జీలకర్ర, బిర్యానీ ఆకులు, ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు వేసి రంగు మారే వరకూ మగ్గనివ్వాలి. ఆపై వెల్లుల్లి పేస్టుని చేర్చి పచ్చివాసన పోయే వరకూ ఉంచి, తర్వాత మటన్ వేసి మూత పెట్టాలి.ఇది మగ్గాక ఉప్పు, కారం, పసుపుతో పాటు రెండు నిమిషాలాగి ధనియాలపొడి, గరం మసాలా, కొత్తిమీర తరుగు కూడా చల్లి మూత పెట్టాలి. ఇందులో నీళ్ల పోసి నూనె పైకి తేలే వరకూ మంట మధ్యస్థంగా ఉంచి అడుగంట కుండా తిప్పాలి. అప్పుడు కొన్ని నీళ్ల పోసి మూతకు విజిల్ పెట్టి ఆరు కూతలు వచ్చే వరకూ ఉడికించాలి.చల్లారాక ముక్క ఉడికిందో లేదో చూసి చింత చిగురు కలిపి మరో ఆరేడు నిమిషాలు సిమ్‌లో ఉంచి ఉడకనివ్వాలి. ఈ కూరను వేడి వేడి అన్నంలోకి తింటే భలే రుచిగా ఉంటుంది. దింపేయాలి.

## నీటి స్వచ్ఛతకు.. !

తాగ దానికి, వంటకు ఉపయోగించే నీళ్ల పరిశుభ్రంగా ఉంటే సగం జబ్బులు రావు. నీటి కాలుష్యాన్ని నివారించ దానికి వాటర్ క్యాన్ తెప్పించు కుంటాం కదా! దానికి వాటర్ డిస్పెన్సర్ బిగిస్తే నీళ్లు పరిశుభ్రంగా ఉంటాయి. వంపడం తేలికవుతుంది. పనయ్యాక తీసి ఇంకోదానికి అమర్చవచ్చు. ఇది మేలురకం ప్లాస్టిక్‌తో రూపొందడం హానికరం కాదు. దీన్ని శుభ్రపరచడమూ సులువే.



# అమ్మయ్యాక అందంగా ..



అమ్మతనం మనలో ఎన్నో మార్పులు తీసుకొస్తుంది. ఈ దశలో అటు శారీరకంగానే కాదు.. ఇటు సౌందర్య పరంగానూ పలు మార్పులు రావడం గమనించచ్చు. ముఖ్యంగా ముఖంపై మొటిమలు– మచ్చలు, చర్మంపై పిగ్మెంటేషన్–స్ట్రెచ్ మార్క్స్, విపరీతంగా జుట్టురాలి పోవడం.. ఇలా తొలిచూలు వారు అందం పరంగా వివిధ రకాల సమస్యల్ని ఎదుర్కొంటుంటారు. బిడ్డ పుట్టాక తల్లుల శరీరంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టరాన్. వంటి హార్మోన్ల స్థాయులు ఒక్కసారిగా పడిపోవడమే ఇందుకు కారణ మంటున్నారు నిపుణులు. అలాగని ఈ సమస్యల్ని పరిష్కరించుకోలేమా అంటే.. అందుకు చిన్న చిన్న చిట్కాలను పాటించాలని సూచిస్తున్నారు. మరి, అవేంటో తెలుసుకుందాం..

**ఎలాంటి సమస్యలొస్తాయంటే..**

గర్భిణిగా ఉన్న సమయంలో హార్మోన్ల స్థాయుల్లో పెరుగుదల కారణంగా జుట్టు రాలడం తగ్గిపోతుంది. అదే డెలివరీ తర్వాత హార్మోన్ల స్థాయులు తిరిగి సాధారణ స్థితికి చేరుకోవడం/ తగ్గుదల వల్ల జుట్టు రాలడం అధికమవు తుంది. అయితే ఇది తాత్కాలికమే అని మహా అయితే 6–12 నెలల పాటు ఈ సమస్య ఎక్కువగా ఉండచ్చంటు న్నారు. ప్రసవం తర్వాత హార్మోన్లలో మార్పులు, ఒత్తిడి, అలసట.. వంటివన్నీ ముఖంపై మొటిమలు రావడానికి కారణమవుతాయి. ముఖ్యంగా ఈ దశలో ప్రొజెస్టరాన్ హార్మోన్ స్థాయుల్లో వచ్చే మార్పుల వల్ల సెబేషియస్ గ్రంథులు ఎక్కువ నూనెల్ని విడుదల చేస్తాయి. తద్వారా ముఖంపై మొటిమలు, వాటి తాలూకు మచ్చలు ఏర్పడు తుంటాయి. ప్రసవం తర్వాత సౌందర్యపరంగా వచ్చే మరో సమస్య పిగ్మెంటేషన్/మెలస్మా. ఈ క్రమంలో చర్మంపై నల్లటి ప్యాచుల్లాంటి మచ్చలు ఏర్పడడం గమనించవచ్చు. ఇక బిడ్డ పుట్టాక నిద్రలేమి, హార్మోన్ల స్థాయుల్లో మార్పులు, విపరీతమైన అలసట.. వంటివన్నీ కళ్ల ఉబ్బడం, కళ్లకింది నల్లటి వలయాలు ఏర్పడడం వంటి సమస్యలకు దారితీస్తాయి.

**ఈ చిట్కాలతో తిరిగి అందంగా...** ప్రసవానంతరం ఎదురయ్యే మొటిమల సమస్యను దూరం చేసుకోవలంటే రోజుకు రెండుసార్లు గాఢత తక్కువగా ఉండే క్లెన్సర్‌తో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇక ఇలాంటి వారు ఉపయోగించే ఫేస్‌ప్యాక్స్‌లో కలబంద, యూకలిప్టస్ ఆయిల్. వంటి పదార్థాలను చేర్చుకుంటే ఫలితం ఉంటుంది. అంతేకాదు.. బయటికి వెళ్లేటప్పుడు మాయిశ్చరైజర్ రాసుకోవడం తప్పనిసరి. అది కూడా ఆయిల్ రహితమైనదై ఉండాలన్న విషయం గుర్తుపెట్టుకోండి. పిగెమంటేషన్ సమస్యను తొలగించుకోవడానికి ప్రస్తుతం మార్కెట్లో ప్రత్యేకమైన మాయిశ్చరైజర్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిని నిపుణుల సలహా మేరకు వాడితే సరి.

అంతర్వాణి

# క్షమాగుణం ఉండాల్సిందే..

ఒక తండ్రికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అతనికి మిక్కిలి ఆస్తి ఉంది. ఒకరోజు చిన్న కుమారుడు 'నాన్న ఆస్తిలో నాకు రావాల్సిన వాటాను ఇవ్వండి..నేను మీవద్ద ఉండలేను' అని కోరాడు. అందుకు ఆ తండ్రి 'సరే'నని కుమారులిద్దరికీ ఆస్తిని పంచి ఇచ్చాడు. చిన్న కొడుకు ఆస్తిని తీసుకెళ్లి, దూరదేశానికి వెళ్లిపోయాడు. తనవద్ద ఉన్న డబ్బుతో జల్సాలు చేసి, చెడు అలవాట్లతో ఆస్తి మొత్తాన్ని ఖాళీ చేసుకున్నాడు. అతడివద్ద డబ్బు లేకపోవడం తో స్నేహితులందరూ అతడిని వదిలేశారు. దేశంలో అకస్మా త్తుగా కరువు వచ్చింది. ఆ చిన్న కుమారుడు ఆ దేశం లోని ఒక వ్యక్తివద్దకు వెళ్లి ఉద్యోగం ఇవ్వమని అడిగాడు. అతడు తన వద్ద ఉన్న పందుల మందను మేపేందుకు ఆ యువకుడి ని నియమించాడు. కరువుతో అతడికి ఎవరూ తిండి పెట్ట లేదు. చివరికి పందులు తినేపొట్టుతో తన కడుపు నింపుకోవా లని ఆశించాడు. కానీ అది కూడా దొరకలేదు. అప్పుడు ఆ కుమారుడికి తన తండ్రి గుర్తుకు వచ్చాడు. 'నా తండ్రి వద్ద పనివారు చాలామంది ఉన్నారు, వారు మా నాన్నవద్ద ఆహారాన్ని సమృద్ధిగా తింటున్నారు. నేను అయితే ఆకలితో చచ్చిపోతున్నాను.. కాబట్టి నేను మళ్లీ నాన్న వద్దకు వెళ్లి, క్షమించమని వేడుకుంటాను' అని మనసులో అనుకుని తండ్రి వద్దకు వెళ్లాడు.

దూరం నుంచి ఆ తండ్రి చిన్నకుమారుడిని చూచి, ఆదరించాడు. ఆనందంతో గొప్ప వేడుకలను చేశాడు. పొలం నుంచి ఇంటికి వచ్చిన పెద్ద కుమారుడు ఇంట్లో జరుగుతున్న వేడుకల్ని చూశాడు. కోపంతో అలిగి, బయటికి వెళ్లిపోయాడు. నాన్న బ్రతిమిలా డినా లోపలికి రాడు. తండ్రికి క్షమాగుణం అన్నకు లేదు. తన తమ్ముడు చెడిపోతే, జాలితో ఆదరించి, సరి చేసేందుకు ప్రయత్నించలేదు. నేడు చాలా మంది క్రైస్తవులు ఇలాగే ఉన్నారు. ఇంట్లోనే ఉంటారు, తల్లి దండ్రుల వద్ద జీవిస్తారు. కానీ అమ్మానాన్నల మనసును గ్రహించ లేరు. సొంత తోబుట్టువులను చేరదీసి, ఆశ్రయాన్ని ఇవ్వలేరు. తమ్ముడు పాపం చేశాడు, తగిన శాస్తి జరిగిందని అనుకుంటున్నాడు. తానే నీతిమంతుడిగా అనుకున్నాడు. కానీ చివరికి తప్పు చేసిన చిన్న కుమారుడు ఇంట్లోకి ప్రవేశిస్తే, నీతిమంతుడిగా భావిస్తున్న పెద్దకుమారుడు వెలుపలనే ఉండి పోయాడు. 'తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమ ర్శకు లోనగును.. ద్రోహీ అని చెప్పువాడు నరకానికి లోనగును' (మత్తయి 5:22). కాబట్టి అందరినీ ప్రేమిద్దాం, క్షమించేందుకు వెనుకడుగు వేయవద్దు.

**- పి.వాణిపుష్ప**

తెర

# హార్ష్ రోషన్, ప్రియాంక ఆచర్ జంటగా నూతన చిత్రం ప్రారంభం



తెలుగు సినిమా రంగంలో ఐకానిక్, పేరెన్నికగన్న నిర్మాణ సంస్థల్లో ఒకటైన ఈవీవీ సినిమా ప్రతిష్మాత్మకంగా తాజాగా ఓ వైవిధ్యమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. లెజెండరీ దర్శకుడు ఈ.వి.వి. సత్య నారాయణ స్థాపించిన ఈ బ్యానర్‌పై గతంలో చాలా బాగుంద్ధి, మా ఆవిడ మీద ఒట్టు మీ ఆవిడ చాలా మంచిద్ధి, 'తొట్టి గ్యాంగ్', 'అత్తిలి సత్తిబాబు ఎల్‌కేజీ', 'ఫిట్టింగ్ మాస్టర్', నువ్వంటే నాకిష్టం, కితకితలు వినోదాత్మక చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. ఇప్పుడు ఈ లెజండరీ బ్యానర్‌పై ఈవీవీ గారి తనయుడు ఆర్యన్ రాజేష్ మరో నిర్మాత ఎన్.వి. కృష్ణారెడ్డి తో కలిసి ఓ సినిమా నిర్మంచబోతున్నారు. నిజ జీవిత కథ ఆధారంగా ఓ ఇంటెన్స్ లవ్ డ్రామాగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హర్ష్ రోషన్ హీరోగా, ప్రియాంక ఆచర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కోర్ట్ చిత్రంతో మంచి ప్రశంసలు అందుకున్న హర్ష్ రోషన్, తెలుగు సినిమాలో ప్రతిభావంతులైన యువ నటుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఇప్పుడు మరో భావోద్వేగ కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు.ఈ చిత్రానికి అరుణ్ బాలాజీ, శ్రీ రంజని సంయుక్తంగా దర్శకత్వం వహిస్తారు. నిజ జీవిత భావోద్వేగాలు, సంబంధాల నేపథ్యంలో ఈ ప్రేమకథను వారు రూపొందించారు. ఈ సినిమా ఇటీవల శుభ ముహూర్తంలో పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది.

# 10న తెలుగులో యాక్షన్ థ్రిల్లర్ 'ఐ, నోబడీ'



మలయాళ టాప్ స్టార్ పృథ్వీ రాజ్ సుకుమారన్ కి తెలుగు లోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. రెగ్యులర్ మాస్ మసాలా సినిమాలు కాకుండా తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిలో సినిమా లు చేస్తుం టారు. రాజమౌళి మహేష్ బాబు కాంబినేషన్లో రూపొందుతున్న ప్రఖ్యాత చిత్రం వారణాస్థి లో కూడా ఆయన ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ తాజాగా నటించిన చిత్రం 'ఐ, నోబడీ' విభిన్న కథాంశాలతో ప్రేక్షకులను అలరిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపా దించుకున్న దర్శకుడు నిస్సాం బషీర్ దర్శకత్వంలో జాతీయ అవార్డు గ్రహీత పార్వతి తిరువోతుతో కలిసి పృథ్వీరాజ్ సుకుమా రన్ నటించిన అత్యంత ఆసక్తికరమైన యాక్షన్ థ్రిల్లర్ 'ఐ, నోబడీ' జూలై 9న మలయాళం లోనూ, జూలై 10న తెలుగులోనూ గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ ఈ సినిమాపై భారీ అంచనాలను నెల కొల్పాయి. ఒక సాధారణ బ్యాంకు ఉద్యోగి రాజు జీవితంలో అనూహ్యంగా జరిగిన సంఘటనలతో కథ ప్రారంభమవుతుంది. భావోద్వేగాలు, సస్పెన్స్, యాక్షన్ అంశాలను సమపాళ్లలో మేళవించిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆద్యంతం ఉత్కంఠకు గురిచేసేలా రూపొందింది. .పృథ్వీరాజ్ సుకుమారన్, పార్వతి తిరువోతు, హకీమ్ షాజహాన్, అశోకన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి దర్శకత్వం: నిస్సాం బషీర్, కథ – స్క్రీన్‌ప్లే – సంభాషణలు: సమీర్ అబ్దుల్, ఛాయాగ్రహణం: దినేష్ పురుషోత్త మన్ , సంగీతం: జేక్స్ బిజాయ్, నిర్మాతలు: ముకేష్ ఆర్ మెహతా, సుప్రియా మీనన్, సి.వి.సారథి.9న పెయిడ్ ప్రీమియర్స్ తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రానికి మంచి క్రేజ్ ఉండడంతో, ఈ నెల 9 న పెయిడ్ ప్రీమియర్స్ ప్లాన్ చేస్తున్నారు నిర్మాతలు.

# '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' టీజర్ విడుదల



ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' టీమ్... మీడియాకు టీజర్‌ని ప్రదర్శించింది. ఈ కార్య క్రమంలో సినిమాలో నటించిన ఇతర నటీనటులతో పాటు డా. శివరాజ్‌కుమార్, డాలీ ధనంజయ, ప్రియాంక మోహన్, అదితి బాలన్, దర్శకుడు హేమంత్ ఎం.రావు, నిర్మాత వైశాక్ జె గౌడ, ఛాయాగ్రాహ కుడు అద్వైత గురు మూర్తి, సంగీత దర్శకుడు చరణ్ రాజ్, ప్రొడక్షన్ డిజైనర్ విశ్వాస్ కశ్యప్ పాల్గొన్నారు. టీజర్‌లో '666 ఆపరేషన్ డ్రీమ్ థియే టర్' మూవీ వరల్డ్‌ని అద్భుతం గా చూపించారు. చిత్రాన్ని స్పై డ్రామాగా తెరకెక్కించారు. లెజెండరీ డా.రాజ్‌కుమార్ 'సీఐడీ999'ని గుర్తుచేస్తూ, నివాళులర్పించేలా ఉందిప్రతి ఫ్రేమ్‌లోనూ తన దర్శకత్వ ప్రతిభను చూపించారు హేమంత్‌రావు. నటీనటుల నుంచి, టెక్నీషియన్ల నుంచి అత్యంత గొప్ప ప్రతిభను రాబట్టుకున్నారు. ఈ ఏడాది విడుదల వుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'కి ప్రత్యేక స్థానం ఉంది. ఈ సినిమాను హేమంత్ ఎం రావు డైరెక్ట్ చేశారు. వైశాఖ్ జె గౌడ నిర్మించారు. వైశాఖ్ జె ఫిల్మ్స్ పతాకంపై తెరకెక్కింది. చరణ్ రాజ్ సంగీతం అందించారు. అద్వైత్ గురుమూర్తి ఛాయాగ్రాహ కుడిగా పనిచేశారు. విశ్వాస్ కశ్యప్ ఈ సినిమాకు ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరించారు. సురేష్ కాస్ట్యూమ్స్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేశారు. టీజర్ విడుదల కార్యక్రమంలో దర్శకుడు హేమంత్ ఎం.రావు మాట్లాడుతూ 'నా తొలి చిత్రం గోది బన్నా సాధారణ మైకట్టు'కి నిర్మాతను వెతుక్కోవడానికి నేనెంతో కష్టపడ్డాను. పదేళ్ల సినిమా జర్నీలో నాకు వైశాఖ్ జె గౌడలాంటి గొప్ప నిర్మాత దొరికారు. నిర్మాత వైశాఖ్ జె గౌడ మాట్లాడుతూ 'పదకొండేళ్లప్పటి నుంచి నేను సినిమాలకు పెద్ద ఫ్యాన్‌ని. మరీ ముఖ్యంగా శివన్న కు వీరాభిమానిని. ఆయన సినిమాలు చూస్తూ పెరిగాను. నాకు అత్యంత స్ఫూర్తిని పంచిన హీరో. కన్నడ సినిమా ఇండస్ట్రీకి 92 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం ఉంది. అన్నారు. డా. శివరాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి లెజండరీ యాక్టర్‌కీ ఓ గురువుండాలి. దర్శకులు అలాంటి పాత్రనే పోషిస్తుంటారు.

# 'కామాఖ్య' నుంచి 'ఏముందో ఏమో'సాంగ్ రిలీజ్



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొందు తున్న థ్రిల్లింగ్ 'కామాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ PVT LTD బ్యానర్ పై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్, ఫస్ట్ సింగిల్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఏముందో ఏమో సాంగ్ ని రిలీజ్ చేశారు.ఈ హార్ట్ టచింగ్ మెలోడీ ప్రేమ, ఎదురుచూపుల భావాలను ఎంతో అందంగా ఆవిష్కరి స్తుంది. హరి చరణ్ హృదయాన్ని తాకే వాయిస్‌తో పాడిన ఈ పాటకు జ్ఞాని మధురమైన ట్యూన్ అందించారు. అనంత శ్రీరామ్ రాసిన అర్థవంతమైన లిరిక్స్ ఈ సాంగ్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ఈ చిత్రానికి రమేష్ కుశేందర్ రెడ్డి డీవోపీ, వరప్రసాద్ ఎడిటర్.


# 'శ్రీనివాస మంగాపురం' 30న గ్రాండ్‌గా రిలీజ్

'శ్రీనివాస మంగాపురం' 30న గ్రాండ్‌గా రిలీజ్ సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని అజయ్ భుపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతు న్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానిని కూడా ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో సీనియర్ నటుడు డాక్టర్ మోహన్ బాబు పవర్ ఫుల్ పాత్రను పోషిస్తున్నారు. నిర్మాత పి. కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అశ్వినిదత్ సమర్పిస్తున్నారు. ఈ రోజు చిత్ర బృందం సినిమా విడుదల తేదీని ప్రకటించింది. ఈ చిత్రం జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. అజయ్ భూపతి శ్రీనివాస మంగాపురంను సరికొత్తగా తెరకెక్కిస్తు న్నారు. తన మార్క్ ఇంటెన్సిటీకి అందమైన ప్రేమకథ, పవర్‌ఫుల్ యాక్షన్‌ను జోడిస్తూ ఈ సినిమాను



తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందుతోంది. జయకృష్ణ ఐఎస్‌సి సినిమాటోగ్రఫీని నిర్వహించగా, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తు న్నారు. మాధవ్ కుమార్ గుళ్ళపాటి ఎడిటర్‌గా వ్యవహరి స్తుండగా, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్. రిలీజ్ డేట్ అనౌన్స్ చేయడంతో ప్రచార కార్య క్రమాలను మరింత ముమ్మరం చేయడానికి చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# 'కిల్లర్' నుంచి జ్యోతి పూర్వజ్ బర్త్ డే పోస్టర్ విడుదల



బిజినెస్ సర్కిల్స్‌లో ఆసక్తి కలిగిస్తున్న మూవీ, బిగ్ డిస్ట్రిబ్యూటర్స్, బయ్యర్స్‌తో జరుగుతున్న బిజినెస్ డిస్కషన్స్ త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతున్న 'కిల్లర్' సినిమా జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సెన్సేషనల్ సై ఫై థ్రిల్లర్ మూవీ 'కిల్లర్'. మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్న ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరి స్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. వీఎఫ్ఎక్స్ వర్క్స్ సహా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకున్న ఈ మూవీ త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది.ఈ రోజు సూపర్ టాలెంటెడ్ హీరోయిన్ జ్యోతి పూర్వజ్ బర్త్ డే సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ 'కిల్లర్' చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు'కిల్లర్' సినిమాలో ప్రేక్షకులు మర్చిపోలేని ఒక ప్రపంచాన్ని డైరెక్టర్ పూర్వాజ్ క్రియేట్ చేస్తున్నారు. ఆయన ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు సీఎన్‌పి ఇంటిగ్రేషన్, రాయ్ ప్రోటోకాల్ కోసం వర్క్ చేసే సైంటిస్ట్‌గా కనిపించబో తున్నారు. 'కిల్లర్' సినిమా ప్రోగ్రెస్ గురించి డైరెక్టర్ పూర్వాజ్ మాట్లాడుతూ మా 'కిల్లర్' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. భారీ వీఎఫ్ఎక్స్ షాట్స్ ఉండటం వల్ల కొంచెం ఎక్కువ సమయం పట్టింది. ఇప్పుడు వీఎఫ్ఎక్స్ వర్క్స్ కూడా పూర్తయ్యాయి.

ఆట



# యూనివర్సల్ బేబీ బాస్ ఆగయా
# వస్తూనే సచిన్ రికార్డు బ్రేక్


**మాంచెస్టర్, జులై 4:** క్రికెట్ బుడ్డోడు, వరల్డ్ బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీ ఎట్టకేలకు టీమిండియా తుది జట్టులోకి అరంగేట్రం చేశాడు. వస్తూ వస్తూనే రికార్డుతో ఎంట్రీ ఇచ్చాడు. క్రికెట్ గాడ్ సచిన్ తెండూల్కర్ రికార్డును బ్రేక్ చేశాడు. కేవలం 15 ఏళ్ల 99 రోజుల వయస్సులోనే టీమిండియాకు ఆడిన అతిపిన్న క్రికెటర్‌గా వైభవ్ అరుదైన ఘనత అందుకున్నాడు.

ఇంతకు ముందు ఈ రికార్డు సచిన్ పేరిట ఉండేది. బ్యాటింగ్ మాస్ట్రో 16 ఏళ్ల 205రోజుల వయసులో టీమ్ ఇండియా తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడగా.. అతనికంటే ఏడాదిన్నరముందే వైభవ్ సూర్యవంశీ తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడేశాడు.

**ఎలాంటి బెరుకు లేకుండా...**

ఇక తొలి అంతర్జాతీయ మ్యాచ్ అంటే ఓ రకమైన బెరుకు, ఒత్తిడి.వైభవ్ టెంపర్‌మెంట్ చూస్తే మరో మ్యాచ్ అన్నంతగా తేలికగా తీసుకున్నాడు. ఎక్కడా భయం, ఒత్తిడి కనిపించలేదు. తాను ఎదుర్కొన్న తొలిబంతి నుంచే ఎదురుదాడికిప్రయత్నించాడు. అయితే మూడో బంతికి సింగిల్‌తో పరుగుల ఖాతా తెరిచిన బుడ్డోడు...అర్చర్ వేసిన తొలి బంతినే ఫైన్‌లెగ్ మీదుగా భారీ సిక్స్ బాదేశాడు. ఒక టాంగ్‌వేసిన మరో ఓవర్ తొలి బంతిని కూడా మిడ్ వికెట్ మీదుగా స్టాండ్స్‌లోకి పంపాడు. ఇక స్పిన్నర్ విల్ జాక్స్ ఓవర్‌లో భారీ షాట్ ఆడేందుకు స్టెప్ అవుట్ కాగా, కీపర్ స్టంప్ చేశాడు. పది బంతుల్లో రెండు సిక్స్‌లతో చేసింది 14 పరుగులైనా... తొలి వికెట్‌కు 50 పరుగుల శుభారంభం అందించాడు. అంతర్జాయ మ్యాచ్‌లు ఆడే సత్తా తనకుందని వైభవ్ చాటిచెప్పాడు.

# మెస్సీ రికార్డుల మ్యాజిక్



**మియామి, జులై 4:** ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ రికార్డుల మోత మోగించాడు. అటు గోల్స్‌తో పాటు ఆడిన మ్యాచ్‌ల పరంగా సరికొత్త మైలురాళ్లను అందుకున్నాడు.రెండు వేర్వేరు ఫిఫా వరల్డ్ కప్ ఎడిషన్లలో ఏడు చొప్పున గోల్స్ సాధించిన తొలి ఫుట్‌బాలర్‌గా మెస్సీ నిలిచాడు. 2022 ఖతార్ వరల్డ్ కప్‌లో 7 గోల్స్ చేసిన అర్జెంటీనాను ఛాంపియన్‌గా నిలబెట్టిన మెస్సీ..ఇప్పుడు ఈ టోర్నీలోనూ అదే జోరును ప్రదర్శిస్తున్నాడు.

కాబో వెర్డేతో మ్యాచ్‌తో ఫిఫా టోర్నమెంట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా మెస్సీ నిలిచాడు. ప్రపంచకప్‌లో అతనికి ఇది 30వ మ్యాచ్. ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలో వరుసగా 8 మ్యాచ్‌లలో గోల్స్ చేసిన మొదటి ఆటగాడిగా మెస్సీ మరో చరిత్ర సృష్టించాడు. 29వ నిమిషంలో మెస్సీ చేసిన గోల్‌తో ఈ అరుదైన ఫీట్‌ను అందుకున్నాడు. ఈ తాజా గోల్‌తో ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలో మెస్సీ ఖాతాలో మొత్తం 20 గోల్స్ చేరాయి. డిపెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాకు వ రుసగా రెండోసారి ఫిఫా కప్ అందించే దిశగా జట్టును మెస్సీ ముందుండి నడిపిస్తున్నాడు. అలాగే గోల్డెన్ బూట్ రేసులో మెస్సీ ఏడు గోల్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఫ్రాన్స్ స్టార్ ఎంబాపే 6 గోల్స్‌తో రెండో స్థానంలో ఉన్నాడు. ఇక 2018లో అర్జెంటీనా మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టఇన స్కలోనీ.. కోచ్‌గా 100వ అంతర్జాతీయ మ్యాచ్ మైలురాయిని చేరుకున్నారు. స్కలోనీ మార్గదర్శకత్వంలోనే అర్జెంటీనా జట్టు కోపా అమెరికా, ఫిఫా ప్రపంచకప్ వంటి ప్రతిష్టాత్మక టోర్నీలను గెలుచుకుంది.

# భారత్‌ను ఓడించిన బెతెల్
## రెండో టి20లో ఇంగ్లాండ్ 4 వికెట్ల విజయం




మాంచెస్టర్, జులై 4: అయిదు టీ ట్వంటీ సిరీస్ లోభాగంగా మాంచెస్టర్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో టీమిండియా పరాజయం పొందింది. జాకబ్ బెతెల్(46 బంతుల్లో 76 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఒంటిచేత్తో ఇంగ్లాండ్‌కు 4 వికెట్ల విజయాన్ని అందించాడు. మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 190 పరుగులు చేయగా, ఈ లక్ష్యాన్ని ఇంగ్లాండ్ మరో ఓవర్ ఉండగానే 6 వికెట్లు కోల్పోయి అందుకుంది.

టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేసిన భారత్‌కు ఓపెనర్లు వైభవ్(14), అభిషేక్ (24 బంతుల్లో 43) 50 పరుగుల మెరుపు ఆరంభం ఇచ్చారు. అయితే 15 రన్స్ తేడాతో ఓపెనర్లను కోల్పోయి కష్టాల్లో పడ్డ టీమిండియాను ఇషాన్ కిషన్(40 బంతుల్లో 49), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(22 బంతుల్లో 37) ఆదుకున్నారు. 13ఓవర్లలో 130 పరుగులకు చేర్చారు. డాసన్, కుర్రాన్ దెబ్బతీయడంతో చివర్లో వేగంగా పరుగులు సాధించలేక పోయింది.తిలక్ వర్మ 11 బంతుల్లో 2 సిక్స్‌లతో 24 పరుగులు చేయడంతో భారత్ 190 పరుగులకు చేరింది.

**దెబ్బతీసిన అర్ష్‌దీప్**

191 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్‌ను తొలి ఓవర్లోనే అర్షదీప్ దెబ్బతీశాడు. ఓపెనర్లు ఫిల్ సాల్ట్, జాస్ బట్లర్‌లను డకౌట్‌గా పెవిలియన్‌చేర్చాడు. కెప్టెన్ హ్యారీబ్రూక్(15బంతుల్లో 39) క్రీజ్‌లో ఉన్నంత సేపు మెరుపులు మెరిపించాడు. బ్రూక్స్ అవుటైన తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన టామ్ బాంటన్(32బంతుల్లో 39) అండగా జాకబ్ బెతెల్(76నాటౌట్)చెలరేగాడు.నాలుగో వికెట్‌కు 67రన్స్ జోడించి ఆదుకున్నాడు. అర్ధ సెంచరీ తర్వఆత బౌలర్లపై సిక్స్‌లు, ఫోర్లతో మరింతగా బెతెల్ విరుచుకుపడ్డాడు. భారత్ గెలుపు ఆశలపై నీళ్లుచల్లాడు. టీమిండియా నుంచి గెలుపును లాక్కొని వెళ్లాడు. దీంతో 19 ఓవర్ల లోనే ఇంగ్లాండ్ లక్ష్యాన్ని అందుకుంది. భారత బౌలర్లలో అర్షదీప్ మూడు వికెట్లు... హర్షిత్ రాణా, అక్షర్ పటేల్, వరుణ్ తలా ఓ వికెట్ పడగొట్టారు. కెప్టెన్‌గా శ్రేయాస్ మూడో పరాజయాన్ని ఖాతాలో వేసుకున్నాడు.

# సెల్ఫ్ గోల్‌తో కాబో వెర్డే ఔట్ - ప్రిక్వార్టర్స్‌కు అర్జెంటీనా
## ముగిసిన రౌండ్-36 * ప్రిక్వార్టర్ సేజ్‌కు చేరిన సాకర్ వరల్డ్ కప్ * నేడు బ్రెజిల్, నార్వే మ్యాచ్

*సాకర్ వరల్డ్ కప్ ప్రి క్వార్టర్ ఫైనల్ స్టేజ్‌కు చేరుకుంది. శనివారంతో ముగిసిన రౌండ్-36 స్టేజ్‌లో అర్జెంటీనా, ఈజిప్ట్, కొలంబియా విజయాలతో ముందంజ వేశాయి. ప్రి క్వార్టర్ ఫైనల్‌కు హాట్ ఫేవరెట్లు అర్జెంటీనా, పోర్చుగల్, బ్రెజిల్, ఫ్రాన్స్‌తో పాటు కెనడా, మొరాకో, పరాగ్వే, నార్వే, మెక్సికో, ఇంగ్లాండ్, స్పెయిన్, అమెరికా, బెల్జియం, ఈజిప్ట్, స్విట్జర్లాండ్, కొలంబియా జట్లు చేరుకున్నాయి. ప్రిక్వార్టర్ ఫైనల్లో తొలి మ్యాచ్ లో కెనడా, మొరాకో తలపడుతుండగా, మిగతా రెండు మ్యాచ్‌ల్లో పరాగ్వేతో ఫ్రాన్స్, బ్రెజిల్‌తో నార్వే ఆడతాయి. ఫిఫా ప్రపంచకప్‌కు అతిథ్యమిస్తు మూడు దేశాలు అమెరికా, కెనడా, మెక్సికో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరడం విశేషం.*



తొలి సాకర్ ప్రపంచకప్‌లోనే అద్భుత ఆటతీరుతో ఆకట్టుకున్న కాబో వెర్డే జట్టు ఆటగాళ్లు

**మియామి, జులై 4:** సాకర్ వరల్డ్ కప్‌లో ఎంట్రీ ఇచ్చిన తొలిసారే సంచలన ఆటతీరుతో నాకౌట్ స్టేజ్‌కు చేరుకున్న చిన్న దేశం కాబో వెర్డే పెద్ద ఆటే కనబరిచింది. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాకు చుక్కలు చూపించింది.ప్రపంచ ఛాంపియన్లను 120 నిమిషాలకు పైగా ఉక్కిరిబిక్కిరి చేసింది. చివరకు సెల్ఫ్ గోల్‌తో ఫిఫా కప్ నుంచి నిష్క్రమించింది. కెప్టెన్ లియోనెల్ మెస్సితో పాటు అనుభవం కలిగిన అర్జెంటీనా చివరకు 3-2తేడాతో కాబో వెర్డేపై అతికష్టంగా విజయం సాధించి ప్రిక్వార్టర్స్‌కు చేరుకుంది. లియోనెల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా ఈ మ్యాచ్‌లో మూడుసార్లు ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. పట్టుదలగా ఆడిన కేప్ వెర్డే జట్టు మొదటి రెండు సార్లు గోల్స్ చేసి స్కోరును సమం చేసినప్పటికీ, మూడో గోల్ మాత్రం చేయలేకపోయింది. మ్యాచ్ అనంతరం కాబో వెర్డే పోరాటానికి ప్రేక్షకులు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు.

**మెస్సీ మెరుపుగోల్**

మొదటి అర్ధభాగంల 29వ నిమిషంలో అర్జెంటీనా తరఫున లియోనెల్ మెస్సీ తొలిగోల్ చేయగా, ఆట మొదలైన గంటకు కేప్ వెర్డే తర ఫున డెరోయ్ దువార్టే అర్హతగా గోల్ చేసి స్కోరును సమంచేశాడు.నిర్ణీత సమయం ముగిసేసరికి ఆట 1-1తో సమంగా ఉండటంతో, రిఫరీ అదనంగా మరో 30 నిమిషాల ఎక్స్‌ట్రా టైమ్ కేటాయించారు. ఎక్స్‌ట్రా టైమ్ తొలి భాగం ఆరంభంలో లిసాండ్రో మార్టినెజ్ గోల్ చేసి అర్జెంటీనాను 2-1 లీడ్‌లోకి తీసుకెళ్లాడు. కొద్ది సేపటికే కాబ్రాల్.. టాప్ కార్నర్‌లోకి రాకెట్ లాంటి అద్భుతమైన షాట్‌ను సంధించి స్కోరును 2-2తో సమం చేశాడు. ప్రస్తుత ఫిఫా కప్‌లో ఇదిఅత్యుత్తమ గోల్‌గా నిలిచింది.ఇక పెనాల్టీ షూటౌట్ తప్పదనుకుంటున్న దశలో అర్జెంటీనాకు గోల్ లభించింది. మెస్సీ పంపిన క్రాస్‌ను రొమెరో హెడర్‌తో గోల్‌గా ప్రయత్నం చేయగా, ఆ బంతి డైనీ బోర్జెస్‌కు తగిలి ఓన్ గోల్‌గా మారింది. దీంతో అర్జెంటీనా ప్రిక్వార్టర్‌కు చేరి ఊపిరిపీల్చుకుంది. గ్రూప్ దశలో స్పెయిన్, ఉరుగ్వే, సౌదీ అరేబియాలను నిలువరిస్తూ డ్రాలతో కాబో వెర్డే నాకౌట్‌కు వచ్చి అందర్నీ ఆశ్చర్యపరిచింది.

**పెనాల్టీ షూటౌట్‌లో...**

ప్రపంచ కప్ ప్రిక్వార్టర్స్‌లోకి ఈజిప్ట్ అడుగు పెట్టింది. ఆస్ట్రేలియాపై పెనాల్టీ షూటౌట్‌లో 4-2తో విజయం సాధించింది. ఆట ఆరంభంలోనే ఇమామ్ ఆషౌర్ (11వ నిమిషం) గోల్ చేసి ఈజిప్ట్‌కు ఆధిక్యం ఇచ్చాడు. అయితే, రెండో అర్ధ భాగం తర్వాత ఆస్ట్రేలియా తరఫున మహమ్మద్ హానీ (55వ నిమిషం) గోల్ చేసి స్కోర్లను సమం చేశాడు. అనంతరం నిర్ణీత సమయంలోగా ఇరు జట్లూ గోల్స్‌ను సాధించలేదు. 1-1గోల్స్‌తో సమంగా నిలిచాయి. పెనాల్టీ షూటౌట్‌లో ఈజిప్ట్ 4-2 తేడాతో ఆసీస్‌ను ఓడించి తదుపరి రౌండ్‌కు చేరుకుంది. 92 ఏళ్ల తర్వాత ఈజిప్ట్ ప్రిక్వార్టర్స్‌లోకి అడుగు పెట్టింది. అర్జెంటీనాతో జులై 7న ఈజిప్ట్ తలపడనుంది.

**ఘనాపై కొలంబియా**

ప్రి క్వార్టర్‌ఫైనల్లోఅడుగు పెట్టిన చివరి జట్టుగా కొలంబియా నిలిచింది. ఘనాపై ఏకైక గోల్‌తో నెగ్గింది. 14వ నిమిషంలోనే కొలంబియా ప్లేయర్ జాన్ అరియాస్ గోల్ కొట్టాడు. ఆ తర్వాత ఇరు జట్లూ గోల్ పోస్ట్‌ల వైపు గురిపెట్టినా ఫలితం రాలేదు.రెండుజట్లు గోల్స్ చేయడంలో విఫల మయ్యాయి. దీంతో ఘనాపై 1-0 గోల్స్‌తో కొలంబియానే విజయం వరించింది. జులై 8న స్విట్జర్లాండ్‌తో ప్రిక్వార్టర్స్‌లో కొలంబియా జట్టు తలపడనుంది.

# ఆరు బిలియన్ డాలర్లు క్షీణించిన
# భారత్ ఫారెక్స్ ఖజానా




**న్యూఢిల్లీ,జులై 4:** భారత విదేశీ మారక నిల్వలు మరోసారి తగ్గాయి. జూన్ 26తో ముగిసిన వారానికి దేశ విదేశీ మారక నిల్వలు 5.654 బిలియన్ అమెరికన్ డాలర్లు తగ్గి 666.933 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని భారతీయ రిజర్వు బ్యాంక్ వెల్లడించింది. అంతకుముందు వారంలో విదేశీ మారక నిల్వలు 963 మిలియన్ డాలర్లు పెరిగి 672.587 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు చరిత్రాత్మక గరిష్ఠ స్థాయి అంటే 728.494 బిలియన్ డాలర్లను నమోదు చేశాయి. అనంతరం పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రూపాయిపై ఒత్తిడి పెరగడంతో ఆర్‌బీఐ డాలర్ల విక్రయాల ద్వారా మార్కెట్లో జోక్యం చేసుకోవాల్సి రావడంతో నిల్వలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి.

ఇదిలా ఉండగా, విదేశీ మారక నిల్వలను పరిరక్షించే దిశగా విదేశీ పర్యటనలను తగ్గించుకోవాలని, ఇంధన వినియోగాన్ని పరిమితం చేయాలని, ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను తగ్గించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మే 11 నుంచి పలుమార్లు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం, విదేశీ మారక నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీకరెన్సీ ఆస్తులు 150 మిలియన్ డాలర్లు తగ్గి 541.067 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలర్‌తో పాటు యూరో, పౌండ్, యెన్ వంటి ఇతర విదేశీ కరెన్సీల విలువల్లో చోటుచేసుకున్న మార్పుల ప్రభావం కూడా ఈ ఆస్తులపై ప్రతిబింబిస్తుంది. అదే సమయంలో బంగారం నిల్వల విలువ 5.394 బిలియన్ డాలర్లు తగ్గి 102.536 బిలియన్ డాలర్లకు చేరుకుంది.ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు (ఎస్‌డీఆర్‌లు) 89 మిలియన్ డాలర్లు తగ్గి 18.558 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అలాగే అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత రిజర్వు స్థానం కూడా 21 మిలియన్ డాల ర్లు తగ్గి 4.772 బిలియన్ డాలర్లకు చేరిందని ఆర్‌బీఐ వెల్లడించింది.

# 500మిలియన్ డాలర్ల విదేశీ నిధుల సేకరణలో ఐసిఐసిఐ

**ముంబయి, జులై 4:** ఐసీఐసీఐ బ్యాంక్ విదేశీ కరెన్సీ బాండ్ల ద్వారా సుమారు 500 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించేందుకు కసరత్తులు చేస్తోంది.ఈ నెల మూడో వారంలో ఏప్రిల్‌జూన్ త్రైమాసిక ఫలితాల ప్రకటన అనంతరం అధికారికంగా నిధుల సమీకరణ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.ఈ బాండ్ జారీతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టిన ప్రత్యేక విదేశీ కరెన్సీ స్వాప్ సౌకర్యాన్ని వినియోగించుకునే నాలుగో వాణిజ్య బ్యాంకుగా ఐసీఐసీఐ బ్యాంక్ నిలవనుంది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు ఇప్పటికే ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని విదేశీ మార్కెట్లలో బాండ్లు జారీ చేశాయి. రిజర్వ్ బ్యాంక్ గత నెల ప్రవేశపెట్టిన ఈ స్వాప్ విండో వల్ల విదేశీ కరెన్సీ బాండ్ జారీలకు హెడ్జింగ్ వ్యయం తగ్గుతోంది. దీంతో బ్యాంకులకు తక్కువ వ్యయంతో డాలర్లలో నిధులు సమీకరించే అవకాశం లభిస్తోంది.



ఐసీఐసీఐ బ్యాంక్ చివరిసారిగా 2017లో 500 మిలియన్ డాలర్ల విలువైన అమెరికన్ డాలర్ బాండ్లను జారీ చేసింది.

దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత మరోసారి అంతర్జాతీయ బాండ్ మార్కెట్‌ను ఆశ్రయించేందుకు సిద్ధమవుతోంది. భారత బ్యాంకులు వరుసగా విదేశీ మార్కెట్లలో నిధులు సమీకరిస్తుండటంతో అంతర్జాతీయ ఇన్వెస్టర్లు అధిక ప్రీమియంను డిమాండ్ చేస్తున్నారు. గత వారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఐదేళ్ల కాలపరిమితితో 750 మిలియన్ డాలర్ల బాండ్లను అమెరికా ట్రెజరీ దిగుబడిపై 90 బేసిస్ పాయింట్ల స్ప్రెడ్‌తో జారీ చేసింది. అనంతరం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ 300 మిలియన్ డాలర్లను 105 బేసిస్ పాయింట్ల స్ప్రెడ్‌తో సమీకరించగా, యాక్సిస్ బ్యాంక్ 300 మిలియన్ డాలర్లను 110 బేసిస్ పాయింట్ల స్ప్రెడ్‌తో సమీకరించింది.

మరోవైపు ఎస్‌బీఐ కూడా 300 మిలియన్ డాలర్ల ఫ్లోటింగ్ రేట్ నోట్లను విజయవంతంగా జారీ చేసింది. రూపాయి మారకపు విలువకు మద్దతు ఇవ్వడం, విదేశీ మూలధనాన్ని ఆకర్షించడం, అలాగే రుణాల వృద్ధి డిపాజిట్ల కంటే అధికంగా ఉన్న నేపథ్యంలో బ్యాంకుల నిధుల సమీకరణ వ్యయాన్ని తగ్గించడమే ఈ స్వాప్ విండో ప్రధాన ఉద్దేశమని ఆర్బీఐ తెలిపింది. ఈ పథకం ప్రకారం కనీసం మూడు సంవత్సరాల కాలపరిమితి ఉన్న విదేశీ కరెన్సీ రుణాలకు ఆర్బీఐ ఏడాదికి 1.5 శాతం స్థిర స్వాప్ రేటుతో సౌకర్యాన్ని అందిస్తోంది.




# కోటక్ మహీంద్రా బ్యాంక్ రుణాలు
# డిపాజిట్లలో రెండంకెల వృద్ధి

**ముంబయి, జులై 4:** ప్రైవేట్ రంగంలోని కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో రుణాలు, డిపాజిట్లలో బలమైన వృద్ధిని నమోదు చేసింది. శనివారం విడుదల చేసిన తాత్కాలిక గణాంకాల ప్రకారం, బ్యాంకు నికర అడ్వాన్సులు (రుణాలు) వార్షిక ప్రాతిపదికన 15 శాతం పెరిగి రూ.4.94 లక్షల కోట్లకు చేరాయి. గత త్రైమాసికంతో పోలిస్తే ఇవి 2.7 శాతం పెరిగాయి. బ్యాంకు మొత్తం డిపాజిట్లు కూడా ఏడాది క్రితం నమోదైన రూ.4.92 లక్షల కోట్ల నుంచి 13.6శాతం పెరిగి రూ.5.58 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గత త్రైమాసికంలోని రూ.5.38 లక్షల కోట్లతో పోలిస్తే 3.38 శాతం వృద్ధి నమోదైంది. కరెంట్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్ (కాసా) డిపాజిట్లు కూడా 13 శాతం పెరిగి రూ.2.17 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో ఇవి రూ.1.92 లక్షల కోట్లుగా ఉండగా, గత త్రైమాసికంతో పోలిస్తే కూడా 2.4 శాతం పెరుగుదల కనిపించింది. సగటు నికర రుణాలు, సగటు కాసా డిపాజిట్లు, సగటు మొత్తం డిపాజిట్లలో కూడా బ్యాంకు వృద్ధిని నమోదు చేసినట్లు వెల్లడించింది.

2025-26 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (జనవరి-మార్చి)లో కోటక్ మహీంద్రా బ్యాంక్ ఏకీకృత నికర లాభం 13శాతం పెరిగి రూ.4,027 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.3,552 కోట్లుగా నమోదైంది. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 8 శాతం పెరిగి 7వేల 875 కోట్లకు చేరగా, నిర్వహణ లాభం 7 శాతం పెరిగి రూ.5,855 కోట్లుగా నమోదైంది. నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) నిష్పత్తి కూడా మెరుగుపడింది. స్థూల ఎన్‌పీఏ 1.20 శాతానికి, నికర ఎన్‌పీఏ 0.25 శాతానికి తగ్గింది. ఇవి మార్కెట్ అంచనాల కంటే మెరుగ్గా ఉండటంతో బ్యాంకు పనితీరుపై విశ్వాసం పెరిగింది. 2025-26ఆర్థిక సంవత్సరానికి డివిడెండ్‌ను ప్రకటించిన బ్యాంకు వాటాదారుల ఆమోదం పొందాల్సి ఉంది.

## బ్యాంక్ ఆఫ్ బరోడాపై 63.6 లక్షలు, జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌పై 3.10 లక్షలు
# ఆర్బీఐ జరిమానా




**ముంబయి, జులై 4:** నియంత్రణ నిబంధనలను ఉల్లంఘించినందుకు ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడాపై రూ.63.60 లక్షల జరిమానాను విధించినట్లు భారతీయ రిజర్వు బ్యాంకు ప్రకటించింది. రుణదాతల కోసం అమల్లో ఉన్న ఫెయిర్ ప్రాక్టీసెస్ కోడ్‌తో పాటు నో యువర్ కస్టమర్ (కేవైసీ) నిబంధనలను పాటించడంలో బ్యాంకు విఫలమైనట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. కేవైసీ మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌పై రూ.3.10 లక్షల జరిమానా కూడా విధించింది.

ఆర్‌బీఐ తెలిపిన వివరాల ప్రకారం, 2025 మార్చి 31 నాటికి బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థిక పరిస్థితిపై నిర్వహించిన చట్టబద్ధ తనిఖీల అనంతరం బ్యాంకుకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. బ్యాంకు ఇచ్చిన వివరణను పరిశీలించిన తర్వాత కొన్ని రుణ ఖాతాల్లో ఒప్పందంలో పేర్కొన్న వడ్డీ రేటుకంటే అధిక వడ్డీని వసూలు చేసినట్లు గుర్తించింది.

కొంతమంది ఖాతాదారుల కేవైసీ వివరాలను నిర్దేశిత గడువులోగా సెంట్రల్ కేవైసీ రికార్డ్స్ రిజిస్ట్రీలో నమోదు చేయడంలో కూడా బ్యాంకు విఫలమైనట్లు ఆర్‌బీఐ పేర్కొంది.

మరోవైపు, జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌పై జాతీయ గృహ బ్యాంకు 2025 మార్చి 31 నాటి ఆర్థిక పరిస్థితిని ఆధారంగా చేసుకుని తనిఖీలు నిర్వహించింది. అనంతరం సంస్థకు కూడా షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.సంస్థ తనఖాతాల రిస్క్ వర్గీకరణను కనీసం ఆరు నెలలకు ఒకసారి సమీక్షించే విధానాన్ని అమలుచేయడంలో విఫలమైనందున రూ.3.10 లక్షల జరిమానా విధించినట్లు తెలిపింది. ఈ రెండు సంస్థలపై విధించిన జరిమానాలు కేవలం నియంత్రణ నిబంధనల ఉల్లంఘనలకే సంబంధించినవని, ఖాతాదారులతో సంస్థలు కుదుర్చుకున్న లావాదేవీలు లేదా ఒప్పందాల చెల్లుబాటుపై ఎలాంటి ప్రభావం ఉండదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణాలు, డిపాజిట్లలో రెండంకెల వృద్ధి

**ముంబయి, జులై 4:** దేశంలో అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తొలి త్రైమాసికంలో రుణాలు, డిపాజిట్లలో బలమైన వృద్ధిని నమోదు చేసింది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించిన తాత్కాలిక వ్యాపార గణాంకాలను బ్యాంక్ విడుదల చేసింది. బ్యాంక్ మొత్తం స్థూల అడ్వాన్సులు ఏడాది క్రితం ఇదే కాలంతో పోలిస్తే 15.4 శాతం పెరిగి 30 లక్షల 61 వేల కోట్ల రూపాయలకు చేరాయి. ప్రస్తుతం ఇచ్చిన అడ్వాన్సులు అంటే ఇంటర్‌బ్యాంక్ మొత్తం 31 లక్షల 27 వేల కోట్ల రూపాయలకు చేరింది. ఇది వార్షిక ప్రాతిపదికన 12.4 శాతం వృద్ధిని నమోదు చేసింది.డిపాజిట్ల పరంగాకూడా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బలమైనవృద్ధిని నమోదు చేసింది.




జూన్ చివరి నాటికి మొత్తం డిపాజిట్లు 14.7 శాతం పెరిగి 31 లక్షల 71 వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. త్రైమాసిక ప్రాతిపదికన డిపాజిట్లు 2.1 శాతం పెరిగాయి. కరెంట్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్‌లను కలిపిన కాసా డిపాజిట్లు 9.4 శాతం పెరిగి 10 లక్షల 26వేల కోట్ల రూపాయలకు చేరాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్ల వంటి టైమ్ డిపాజిట్లు వార్షిక ప్రాతిపదికన 17.4శాతం పెరిగి 21 లక్షల 45 వేల కోట్ల రూపాయలకు చేరాయి. గత త్రైమాసికంతో పోలిస్తే ఇవి దాదాపు 5 శాతం వృద్ధి నమోదు చేశాయి. దేశవ్యాప్తంగా బ్యాంకుల రుణాలు 17.7 శాతం పెరగగా డిపాజిట్లు 12 శాతం మాత్రమే పెరిగాయి. దీంతో రుణాల వృద్ధి డిపాజిట్ల వృద్ధికంటే 570 బేసిస్ పాయింట్లు అధికంగా ఉందని ఆర్‌బీఐ వెల్లడించింది.

## తొలి త్రైమాసికంలో
# వేదాంత భారీ వృద్ధి

**ముంబయి, జులై 4:** గనులు, లోహాల రంగ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కీలకవిభాగాల్లో ఉత్పత్తి వృద్ధిని నమోదు చేసింది. జింక్ ఇండియా విభాగంలో ఇప్పటివరకు ఎన్నడూ లేని స్థాయిలో తొలి త్రైమాసిక మైన్డ్ మెటల్ ఉత్పత్తి నమోదవగా, కాపర్, ఫెర్రో క్రోమ్ విభాగాలు కూడా స్థిరమైన వృద్ధిని నమోదు చేసినట్లు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన వివరాల్లో తెలిపింది.జింక్ ఇండియా విభాగంలో మైన్డ్ మెటల్ ఉత్పత్తి 2.68 లక్షల టన్నులకు చేరుకుని గత ఏడాదితో పోలిస్తే 1 శాతం పెరిగింది. అమ్మకానికి వీలున్న లోహ ఉత్పత్తి 4 శాతం పెరిగి 2.60 లక్షల టన్నులకు చేరుకోగా, శుద్ధి చేసిన జింక్ ఉత్పత్తి 6 శాతం వృద్ధిని నమోదు చేసింది. వెండి ఉత్పత్తి మాత్రం 149 టన్నుల వద్ద గత ఏడాది స్థాయిలోనే కొనసాగింది.

చందేరియా, దరిబా ప్లాంట్లలో చేపట్టిన డీబాటిల్‌నెకింగ్ చర్యలతో ఉత్పత్తి సామర్థ్యం పెరగడం వల్ల శుద్ధి చేసిన లోహ ఉత్పత్తి మెరుగుపడిందని కంపెనీ పేర్కొంది.వేదాంతా అనుబంధ సంస్థ ఫాకోర్‌లో ఫెర్రో క్రోమ్ ఉత్పత్తి 4శాతం పెరిగి 29వేల టన్నులకు చేరింది.అదే సమయంలో ఖనిజ ఉత్పత్తి 41 శాతం పెరిగి రికార్డు స్థాయిలో 1.53లక్షల టన్నులకు చేరింది. కాపర్ ఇండియాలో విక్రయాలు3శాతం పెరిగి 53వేల టన్నులకు చేరాయి. గత ఎనిమిదేళ్లలో తొలి త్రైమాసికానికి ఇది అత్యధిక విక్రయాలుగా కంపెనీ పేర్కొంది. అంతర్జాతీయ జింక్ వ్యాపారంలో గామ్స్‌బర్గ్ ఫేజ్1 ఉత్పత్తి గత త్రైమాసికంతో పోలిస్తే 10 శాతం పెరిగిందని, ఫేజ్2 ఉత్పత్తిని ఈ ఏడాది ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది.తొలి త్రైమాసికంలో జింక్ ఇండియా చరిత్రలోనే అత్యధిక మైన్డ్ మెటల్ ఉత్పత్తి నమోదు చేయడంతో పాటు, ఫాకోర్ విభాగం కూడా ఇప్పటివరకు ఎన్నడూలేని స్థాయిలో త్రైమాసిక ఖనిజ ఉత్పత్తిని సాధించిందని వేదాంతా




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.